


ఆంధ్రపత్రిక
సచిత్ర వారపత్రిక
4 అణాలు
23-3-55



హంసదూతము

[illegible]


నేడే చూడండి
ఆంధ్రదేశమంతటా
ప్రదర్శింపబడుచున్నది
వాహినీ వారి
బంగారు పాప
మమతలోని మాధుర్యాన్నీ
మానవత్వం లోని మహత్వాన్నీ చాటే
మనోజ్ఞమయిన చిత్రం......
కథ · పాలగుమ్మి పద్మరాజు - పాటలు · దేవులపల్లి కృష్ణశాస్త్రి
సంగీత దర్శకుడు · అద్దేపల్లి రామారావు - కళాదర్శకుడు · ఏ.కె.శేఖర్
ఫొటోగ్రఫీ · బి.యన్. కొండారెడ్డి
సౌండ్‌రికార్డింగ్ · ఎ.కృష్ణన్, కె.విశ్వనాథ్
స్టూడియో
వాహిని
నిర్మాత · దర్శకుడు
బి.యన్. రెడ్డి



మాలా గుంఫనము

చిత్రకారుడు: గోలి శేషయ్య.

సంవత్సర చందా	ఆంధ్రపత్రిక	సంపుటము 48
రు. 12-0-0	సచిత్రవారపత్రిక	సంచిక 29
విడిప్రతి 4 అ.		23-3-55

Founder : K. NAGESWARA RAO

జయ ఫాల్గుణ బహుళ చతుర్దశి బుధవారం

బారిష్టరు బాతాఖానీ

నేనొకరోజు సాయంకాలం కూర్చుని, ఏదో తీవ్రంగా ఒక కేసువిషయం ఆలోచిస్తుండగా తనలో తను, వెర్రివాడిలా నవ్వుకుంటూ టప్పయ్య దక్కొ వచ్చాడు. నేను చూచీ చూడనట్లు ఊరుకున్నాను. టప్పయ్య ఒక కుర్చీలో కూలపడ్డాడు. అతనికి, నవ్వు కడుపునొప్పిలాగ తెరలు తెరలుగా పొరలి వస్తూంది. ఆపుకోలేక పోతున్నాడు.

విషయానుక్రమణిక

'పాలుపొంగిన గతి పొంగు ప్రణయరక్తి' ఆపుకోలేనినాయికలాగునా, లేకపోతే బుతుశూలతో బాధపడే జవ్వనిలాగునా అలా శాధపడుతున్నావేమిటి. ఈవేళ మీ ఆవిడ ఏమైనా ప్రత్యేక శ్రద్ధాభక్తులు ప్రదర్శించిందా! లేక ఎవరన్నా ఉల్ఫాగా కాఫీహోటలుకు తీసుకువెడితే, వాళ్ళ నేపి పించడానికి మస్తుగా ఏమైనా పట్టించావా అక్కడ. తెరలు తెరలుగా వస్తున్న ఆ పొంగును అపుకోలేకుండా ఉన్నావేమిటి, అన్నాను.

మొక్కపాటి నరసింహశాస్త్రి

'అబ్బే మరేంలేదు మాష్టారూ - వాడి మాటలు - మన భద్రం అన్నమాటలు తలుచుకుంటే నవ్వు వస్తోంది, అని మళ్లీ నవ్వడం ప్రారంభించాడు. టప్పయ్య మాటలోనే శర్మ, శాస్త్రి వచ్చారు. *One Thing at a time* ... అనే చిన్ననాటి గీతావాక్యం మరచావటయ్యా' అన్నాడు శాస్త్రి.

బాబూ! టప్పయ్యా! ముందు చెప్ప తలచినది పూర్తిగా, నిష్కర్షగా చెప్పి, తరువాత, ఎదటివాడితో కలిసి నువ్వూ నవ్వడం ఉత్తమపద్ధతి: లేదన్నా వూ; ఉభయులూ కలిసి ముందు హాయిగా నవ్వేసి తరువాత మాట్లాడుకోడం మధ్యమపద్ధతి. ఎదటివాళ్ళ ప్రమేయం లేకుండా ఏ సంగతీ చెప్పకుండా, పిల్లలాడుకునే రబ్బరు బుడగ ఠపీమని బద్దలైనట్లు, బద్దలై, గుక్కపట్టినట్టు నవ్వడం అధమపద్ధతి; మళ్లీ మాట్లాడితే అమాధమపద్ధతి అని భర్తృహరి లాంటివాడెవడో అన్నాడు, తెలుసునా! 'నీ విప్పుడు ఏ జాతిలో చేరుతావో, ఇంక నేను చెప్పడమెందుకు' అన్నాడు శర్మ.

నోరుందికదా అని, ఎదటివాళ్లు మెత్తనివాళ్ళుకదా అని నోటికి వచ్చినట్లు వాగడం ఏ జాతి లక్షణమో ఏ కవీ నిర్వచించలేదు కాబోలు, అన్నాడు టప్పయ్య కొంచెం కోపంగా. మళ్ళీ అది మరచి నవ్వడం ఆరంభించాడు.

మనలో మనమాట, భద్రం ఏమన్నాడోయి. అతనింత నవ్వు వచ్చేటట్లు మాట్లాడగలడని ఎప్పుడూ అనుకోలేదు సుమా అన్నాను.

అబ్బే! అదేంకాదు మాష్టారూ. వాడేం తమాషాగా మాట్లాడాడని కాదు నేను నవ్వుతున్నది. వాడు తమాషా కోత ఒకటి కోశాడు. వాడు కొందరు స్నేహితులతో కలిసి మొన్నరాత్రి ఒక అడవిలోకి వేట కెళ్లాడట. తమాషా చూడడానికి. ఎక్కడో మాటుపెట్టినచోటికి చేరకుండానే మధ్య దారిలో, రోడ్డుకు అడ్డుగా దర్జాగా ఒక పెద్దపులి పడుకుని ఉన్నదట. వాళ్లు వెడుతున్న కారు దీపాలలో దాని కళ్లు కనకపుష్యరాగాలలా మెరుస్తున్నాయట. వాళ్లు హడిలిపోయి కారు ఆపారట. పులి మట్టుకు కదలలేదు మెదలలేదు. మాటుచాటు లేకుండా ఎదుటపడ్డ మెకాన్ని చంపడానికెవ్వరికీ దమ్ములు లేకపోయినాయి. అందుకని కొంచెం దూరం వెనక్కు పోయి, మరొక దారిని పోదామని నిశ్చయం చేసుకొని కారు కదిపేసరికి పెద్దపులి వొళ్లు విరుచుకొని, ఒక్కసారి వీళ్లకేసి అసహ్యంతో చూచి, వీళ్లవేపు రాసాగిందట. దానితో వీళ్లు హడిలిపోయి,

★ బారిష్టరుగారి బాతాఖానీ

ఎలాగూ చావు తప్పదని నిశ్చయం చేసుకుని, మొండిధైర్యంతో ఒకడు కళ్లుమూసుకుని తుపాకీ పేల్చాడట, ఆ దెబ్బ ఎలాగో పులికి కొంచెం తగిలింది. దానికి కోపం వచ్చి, అడవి దద్దరిల్లేటట్లు గాండ్రించి, వీళ్లమీద దూకిందట. కారులో ఉన్న వాళ్ళంతా చచ్చితిమిరా గిరిజా రమణా అని మూర్ఛపోయారట. భద్రం పక్కవాడి చేతిలో తుపాకీ లాక్కుని పైకి ఎగిరిన పులి మీద బారుపెట్టి పేల్చాడట. గుండు వెళ్ళి దాని గుండెలోనుంచి దూసుకుపోయిందట. పులి, స్వచ్ఛమైన మానవవాక్కుతో, 'హా హతోస్మి' అని జాలిగా వాడికేసి చూస్తూ వచ్చి వాడి కాళ్లదగ్గర పడిందట, చేతులు జోడించి, అన్నాడు టప్పయ్య.

అలనాటి గజేంద్రుడులా, శాపోపహతుడైన గంధర్వరాజు ఎవడో అయిఉంటాడు అన్నాడు శాస్త్రి, కనురెప్ప కదల్చకుండా.

లేకపోతే కోయవాళ్లి చిళ్ళంగిచేత పులి రూపం పొందిన పురుషుడు కానోపు అన్నాడు శర్మ.

అసలు భద్రం తుపాకీ చేత పట్టగలడం టూరా మేష్టారూ! వాళ్లు పెద్దపులిని చూశారంటూరా గురువుగారూ!

వాళ్లు అసలు వేటకెళ్ళారంటూరా నిజంగా బారిష్టరుగారూ! అన్నారు టప్పయ్య, శర్మ, శాస్త్రిగారలు వరుసగా.

ఇలాటి కోతవిని నవ్వక, ఏంచెయ్యను చెప్పండి అన్నాడు టప్పయ్య.

దీనిలో నవ్వడాని కేమున్నది బాబూ. కోతలు కొయ్యడం మానవస్వభావం. అది అనాదినుంచీ వస్తోంది. ఎటొచ్చీ తెలివైనవాడూ గడుసువాడూ ప్రగల్భాలు చెపుతుంటే అవి కోతలని చులాగ్గా కొట్టెయ్యలేము కాబోలనుకుంటాం. లేకపోతే కొద్దిగా అతిశయోక్తి అనుకుంటాం. ఆమాటలే కొత్త అమాయకుడు చెపుతే 'కొయ్యి' అంటాం. మానవజన్మఎత్తిన ప్రతివాడికీ తనో పెద్దవీరుడననిపించుకోవలెనని ఉంటుంగి కాబోలు. మనిషిలో ప్రయోజకత్వం తగ్గినకొద్దీ, ఈ వాంఛ మరీ గాఢంగా ఉంటుందను కుంటాను. చిన్నపిల్లలలో కొయ్యనివాడే ఉండడు. మా స్నేహితుడికొడుకు చిన్న కుర్రవాడు, నాలుగేళ్లుంటాయి. వాడు ఒకరోజున బజారుకువెళితే అక్కడ గోదావరి వరదలో కొట్టుకొచ్చిన పెద్దపులి ఒకటి కనపడ్డది. జనంఅంతా హడిలి చెల్లాచెదరుగా దుకాణాలుకూడా విడిచి పారిపోతున్నారు. తనుమట్టుకు, తిన్నగా దానిదగ్గరకెళ్ళి దాని మీసాలు పట్టుకు వాడేసి, చెవులు మెలేసి, ముక్కు నలిపేసరికి, బాబోయి అని పారిపోయింది అని నాతో చాలా Serious గా చెప్పాడు. అది నేను నిజమని నమ్మానని వాడు నమ్మాడు. మనందరిలోనూ ఆ చిన్ననాటి తీరనికోరికలు చాలా ఉంటాయి. అవి తీరే మార్గం మరొకటిలేక ఇలా కోస్తుంటాం. ఏటొచ్చీ కొన్ని మరీ నమ్మడానికి శక్యంకాకుండాఉంటే, మనకు నవ్వు పుట్టుకొస్తుంది.

మావూళ్లో ఒకఆసామీఉన్నాడు. అతను చాలా పెద్దమనిషి - పదిమందిలోనూ తలెత్తుకుని తగుదునమ్మా అని తిరుగుతుంటాడు. అతనొకరోజున క్లబ్బులో కూర్చుని, మాటలసందున తన చిన్ననాటి అనుభవాలు రెండు చెప్పాడు. ఇంకా చెప్పాలనుకున్నాడుకాని మేం తట్టుకోలేకపోయాం.

వాళ్లతండ్రి మహావిద్వాంసుడూ, మహా మంత్రశాస్త్రవేత్త, మహా తపశ్శాలీనట. కాని మహా కోపిష్టి కూడానట. ఎటొచ్చీ ఆ కోపంమట్టుకు చాలా క్షణికమట. ఒకరోజున ఆయన జపం చేసుకుంటుండగా ఈ కుర్రవాడు, మన కథానాయకుడు, అప్పటికి మూడేళ్ళ కుర్రవాడు చాలా అల్లరిచేశాడట. ఆయన తపస్సుకు భంగం కలిగింది. కోపం వచ్చి, తన చెంబులో ఉన్న ఉద్ధరిణె తీసుకుని వాడిమీదికి విసిరాడట. అది బ్రహ్మాస్త్రంలాగ వాడి శిరస్సులో దూరబడి, కంఠం, కడుపులు దాటి, అధోమార్గాన పైకి వచ్చిందట. వాడి వొళ్లంతా రక్తపరదలై, కెవ్వున కేకవేసి వెనక్కు పడ్డాడట. తల్లి హడిలిపోయి మొర్రోమందట. ముసలాయన, అయిన తపోభంగం ఎలాగూ అయిందని, కుర్రవాడిని చూచి జాలిపడి, వలవల విలపిస్తున్న భార్యను మాత్రం ఓదార్చి, కాసిని ఉదకం మంత్రపించి, కుర్రవాడిమీద చల్లాడట. దానితో ఆ ఉద్ధరిణె, మళ్ళీ వళిన దారినే అనగా మూలాధారంలోనుంచి షట్చక్రాలూ భేదించుకుని సహస్రారంలోనుంచి పైకి వచ్చి పడ్డదట. కుర్రవాడు ఏమీ ఎరగనట్టు లేచి, ఆ ఉద్ధరిణె తీసుకుని ఆడుకోడానికి పోయాడట. తల్లి సంభ్రమాశ్చర్యాలతో, ఆనంద బాష్పాలతో భర్త పాదాలకు ప్రణమిల్లిందట. అతని తలమీదనున్న మచ్చ ఒకటి చూపించి అది ఇనాటిదే నన్నాడు.

ఆఁ!!! హాఁ!!! అన్నాం అంతా ఏకగ్రీవంగా. తనకు 15, 16 సంవత్సరములు వచ్చిన తరువాత జరిగిన సంఘటన ఒకటి చెప్పాడు. వాళ్లు ఎప్పుడూ స్వంత వ్యవసాయం చేసుకునేవాళ్లట. ఇతను కుర్రవాడు కావడంచేతనూ తండ్రి పెద్దవాడు కావడంచేతనూ వ్యవసాయ భారమంతా ఇతనిమీదే ఉండేదట. ముసలాయన ఎలాగో, ఎవరినో, ఆశ్రయించి ఒక పది ఎకరాల బంజరుభూమి సంపాదించాడట. అది సాగుచేయించమని ఇతనికి పురమాయించాడు. రెండుకాళ్ల ఎడ్లూ రెండు నాగళ్లూ ఇచ్చి, పొలికాపుని దున్నమంటే, 'బాబయ్యా దానినిండా కొన్ని వేల తాచుపాములున్నాయండి. నేను దున్నలేనన్నా'డట. అక్కడినుంచి వూళ్లో ఎవరికి పురమాయించినా ఇదే సమాధానం వచ్చింది. దానితో ఇతనికి వొళ్లుమండి 'అహమస్మి' అని తనే ఆ పనికి పూనుకున్నాడు. మధ్యాహ్నం భోజనంచేసి, కాస్సేపు విశ్రమించి, సుమారు నాలుగు గంటలకు కాస్త టీ పుచ్చుకుని, ఒక పార తీసుకుని, పొలం వెళ్ళాడు. దున్నడమయితే ఆలస్యమవుతుందని పారతో, వొంచిన నడుం ఎత్తకుండా సూర్యాస్తమయం అయేసరికి ఆ పదెకరాలూ తిరగేశాడట. అప్పుడు నడుం ఎత్తి ఒక్కమాటు ఒళ్లు విరుచుకుని, చేతులు జాడించి గృహోన్ముఖుడయ్యాడు. వొళ్లు కొంచెం ఎర్రగా కనపడ్డది. అస్తమయ కాంతులు తన మీద ప్రసరించి అలా ఉన్నదనుకున్నాడు పాపం. ఇంటికి చేరగానే తల్లితండ్రులు లీరక్తసిక్తమైన కుమారుని శరీరంచూచి, 'ఏమి నాయనా. ఇదేమిటి, దుర్మార్గు లెవరైనా నిన్ను దండించారా! లేక ఎవరికైనా ఆ

తన్ని వారణ కడ్డుపడ్డావా. ఇలా వొంటి నిండా రక్తం ఎందుకొచ్చింది నాయనా' అని పలువిధాల విలపించారట. అటు వంటి దేమీ లేదని ఇతను ఎన్ని విధాల చెప్పినా తల్లిదండ్రులు వినక, గ్రామస్థులను కొందరిని వెంట వేసుకుని పొలందగ్గరకు చేరేసరికి, పొలంనిండా గద్దలూ, రాబొందులూ ఉన్నాయట. ఇదేమి టని ఇంకా దగ్గరకు వెళ్ళిచూస్తే కొన్ని లక్షల సర్పజాల మృతకళేబరాలు, ఖండ ఖండాలు కనపడ్డాయి. వచ్చినవాళ్లంతా హడిలిపోయి, ఇతని సాహసానికి మెచ్చి బ్రహ్మరథంపట్టి ఇంటికి తీసుకుపోయారట. తరువాత సన్మాన సభ వగైరా జరిగి ఉంటాయికాని ఇతను చెప్పడానికి సిగ్గు పడ్డాడు.

మావూళ్లో ఇంకో ఆసామీ ఉన్నాడు. అతనో ఛోటా రాజకీయ నాయకుడు. అత నెప్పుడన్నా జైలుకువెళ్లాడో లేదో కాని ఎప్పుడూ తన జైలు అనుభవాలనుగురించి చెపుతూ ఉండేవాడు. ఎప్పుడూ ఏవేనా కాంగ్రెసు సభలు జరిపించడం, వారినీ వీరినీ పిలిచి ఉపన్యాసా లిప్పించడం, కరువూ కాటకం, అతివృష్టి అనావృష్టులువస్తే చందాలు వసూలుచెయ్యడం; ఇదీ అతని జీవితవిధానం. అతను బాగా భూవసతి కల వాడు. ఊరికి కొంచెందూరంలో ఇతని పొలం ఒకటి ఉంది. అక్కడొక చిన్న చెరువు. ఆ చెరువుగట్టున ఒక కుటీరం. అందులో అతని నివాసమూను. సహాయ నిరాకరణోద్యమం బాగా ముమ్మరంగా ఉన్నరోజు లవి. ఒకరోజున బజారులో నన్ను చూచి, వాళ్ల ఆశ్రమం చూడడానికి రమ్మని బలవంతపెట్టి తీసుకు వెళ్ళాడు. కాఫ్యాదులుసేవించి కబుర్లు చెప్పుకుంటూ కూచున్నాం. సూర్యాస్తమయ మయింది. 'ఇక్కడ చాలా బాగున్నదయ్యా. ఎంత ప్రశాంతం. ఎంత సౌందర్యం. ఇలాటిచోట ఉంటే నాలాటివాడికికూడా కవిత్వం వచ్చేటట్టు ఉన్నది' అన్నాను. మేము ఊరికి సుమారు రెండున్నర మైళ్ళ దూరంలో ఉన్నాం. అప్పటి కక్కడ మనిషి సంచారం కాదుకదా పశు పక్షి సంచారం కూడా లేదు. గుడ్డిచీకట్లు నాలుగు మూలలా అలుముకొస్తున్నాయి. అతగాడు నాదగ్గరకు జరిగి, నా చెవులో ముఖం పెట్టి రహస్యంగా 'నే నిక్కడెందుకున్నానో తెలుసా' అన్నాడు. నేను తడుముకో కుండా 'వ్యవసాయానికి' అన్నాను. 'అబ్బే - అదేం కాదోయి' అన్నాడు. 'అయితే, బాకీదారుల కెవ్వళ్లకూ దొర క్కుండానా' అన్నాను. 'చాల్లేవోయి నీ దుమ్ము విట్లు (*Wits*). నాచుట్టూ ఎప్పుడూ ఇరవైనుంచి గూఢచారులు తిరుగుతూ నా ప్రతి చర్యా కనిపెడుతూ ఉంటారు. నాదగ్గరకు, ప్రతినిత్యం ఎవళ్లో ఒకళ్లు, జాతీయ అంతర్జాతీయ విప్లవకారులు, నా సలహాకోసం, సహాయంకోసం వస్తూ ఉంటారు. వాళ్లె వళ్లేనా ఏ పోలీసు వాడేనా పట్టుకుంటే, వాళ్ళవాళ్లు నా ప్రాణానికి ఉసూరుమని ఏడుస్తారు. ఇక్కడైతే, ఎవరొచ్చినా నరమానవుడి కంట పడరు. అథవా ఏ పోలీసేనా తెగించి ఇటు వస్తే అరమైలు దూరాన్నించే కనపడ తాడు. ఇక్కడివాళ్ళంతా తలో పొద చాటునా సర్దుకుంటారు. పోలీసువా డొక్కడూ వచ్చినా ఆ పొదలజోలికిపోడు' అన్నాడు.

'అదా సంగతి. ఓరి. దేవాంతకుడవోయి' అన్నాను. పాపం, అతను చాలా సంతోషించాడు.

ఇంకోసారి ఇంకో తమాషా కోత కోశాడు. కలకత్తాలో ఉంటున్న జర్మను *Consent* కూ తనకూ చాలా స్నేహమట. ఇతను అతనికి ఎన్నోసార్లు, ఎన్నెన్నో అత్యవసర సమయాల్లో ఉపకారాలు చేశా డట.

సంద్రంపు టుప్పు; అడవి యసిరి అన్నట్లు ఇతనికీ ఆ జర్మనుకీ సంబంధ మేమిటి మేష్టారూ అన్నాడు టప్పయ్య పాపం.

'నోరుముయ్యావోయి వెధవ చొప్పదంటు ప్రశ్నలు వెయ్యక. గురువుగారు చెప్పినది విని ఊరుకో' అన్నాడు శర్మ.

ఇంత అమాయకుడ వేమిటి టప్పయ్యా. ప్రపంచంలో అన్ని దేశాలనుంచీ విప్లవకారు లితనిదగ్గరకు వస్తున్నారంటే నీకు అభ్యంతరం లేదు కాని, ఈ జర్మను కౌన్సలు వచ్చాడంటే నీకు అనుమానం ఎందుకు. అలాటి వాళ్లదగ్గరకు ఎలాటివాళ్లేనా రావచ్చు. హిట్లరుకూ ఇతనికీ రహస్యంలో అనేక ఉత్తర ప్రత్యుత్తరాలు నడుస్తున్నాయేమో నీకేం తెలుసు. ఒకవేళ హిట్లరే స్వయంగా ఈ కౌన్సలు వేషంలో ఇతని దగ్గరకు వస్తూ పోతూ అనేక సలహాలూ సహాయాలూ పొందిఉండవచ్చు. ఇలాటి వాళ్లకిది సాధ్యం, ఇది అసాధ్యం అనకు. మనం, వాళ్లు ఏదిచెప్పినా నమ్మి తీరవలసి నదే. ఇదంతా ధ్వనించేటట్టు అతను మాట్లాడాడు. అతను చెప్పినదేమిటంటే, ఆ ఉద్యోగి, ఉద్యోగంలోనుంచి విరమించి, స్వదేశంపోతూ ఇతన్ని చూడడానికి వచ్చాడట. వచ్చినవాడు ఊరికే శెలవు తీసుకుపోక, 'బాబూ', నాదో చిన్న ప్రార్థన. నాకొక్క ఆఖరు సహాయం చెయ్యాలి' అన్నాడట. శుభం. కానియ్యి. దాని కింత సందేహ మెందుకయ్యా. మనలో మనకు తేడా ఏమిటి. నే చేసేవాడిని నీవు చేయించు కునేవాడవూనా. అంతా పరమేశ్వరాను గ్రహం అని ఒక చిన్న గీతావాక్యం కొట్టే డట. వాడు సంతోషించి హడిలిపోతూ చేతులు జోడించి, 'మరేం లేదండీ. మీవల్ల అనేకసార్లు అనేక ఉపకారాలు పొందాను. నే నింతకాలం హాయిగా ఇక్కడ బ్రతికి ఈ ఉద్యోగం నిర్వహించానంటే ఆ ప్రయోజకత్వంమీదికాని నాదికాదు. మీరు లేకపోతే నేనిక్కడ ఒక్క క్షణం బ్రతక లేకపోయేవాడిని. నేను ఎప్పుడూ ఏ రూపం లోనూ మీ ఋణం తీర్చుకోలేకపోయాను. ఇప్పుడేనా నేను ధనరూపంలో ఏమీ చెయ్యలేనన్న సంగతి మీకూ తెలును. కాని ఒక్క ఊహ నాకు తటుతోంది. మాదేశంలో చాలా పెద్ద కర్మాగారాధిపతులు నాకు సన్నిహిత బంధువులు. ఆయా వ్యాపారా లలో నాకూ కొంత వాటా లేకపోలేదు. అందుకని ఆయా ఫేక్టరీలలో తయారయే సామాన్లు మీ ఇష్టంవచ్చినరకం, ఒక్క అర డజను - పోనీ ఒక్క డజను - ఓడల్లో నింపి, మా స్వంత ఖర్చుమీద ఏ సుంకాలబాధా లేకుండా మీకు పంపిస్తాను. ఆ సరుకు మీ ఇష్టం వచ్చినట్లు వినియోగించి ఆ ఫలితాన్ని పొందండి. కాదనక నాముద్దు చెల్లించండి

(55వ పేజీ చూడండి)


కాంబోడియా కబుర్లు: 6

భూ దేవతలు


ప్రతి ఒక్కొక్క ప్రాంతంలో నూ ఒక్కొక్క దేవతో దెయ్యమో ఉంటుందనీ, ఆ ప్రదేశం అంతా దాని పర్యవేక్షణలో ఉంటుందని కాంబోడియా దేశంలో ఓ నమ్మకం. వీటిని నాక్తా (*Nakta*) లంటారు. ఇందులో చిన్నా పెద్దా కూడా ఉన్నాయి. మాటవరసకి, కొన్ని నాక్తాలకి ఓ పల్లెటూళ్లో మరీ ఒక్క వరి చేనుమీదే పెత్తనం ఉంటే మరికొన్నింటి విజృంభణ ఓ రాష్ట్రం అంతటా వ్యాపిస్తుంది. కొన్ని పాతనాక్తాలు, రిటైర్డు ఉద్యోగుల్లాగ, ఏశక్తీ లేకపోయినా, మేం పూఉన్నాం అంటూ నామకః లెక్కలోకి వస్తాయి. కొన్ని కొన్నయితే ఏ చెట్టు మీదో చెఱువు గట్టునో ఉంటూ ఆ చెట్టు

క్రొవ్విడి లక్ష్మన్న

పేరుతోనో, చెఱువు పేరుతోనో తాము వ్యవహరిస్తాయి. ఈరకం క్షుద్ర నాక్తాలు కాక, మరోరకం స్థలదేవతలు కూడా



ఉన్నాయి. ఒకానొకప్పుడు వీటికీ ఓ గుడీ, పూజా పునస్కారాలూ అంటూ ఉండేవని నిశ్చయంగా అనుకోవచ్చు. ప్రస్తుతం బొత్తిగా పాడు పడిపోయిన గుళ్లు యీరకం నాక్తాల గుళ్లన్నమాట. వీటి లో



"స ఘోషో ధార్తరాష్ట్రాణాం హృదయాని వ్యదారయత్"

ఫొటో: డి. రామలింగేశ్వరరావు

(మద్రాసు ప్రభుత్వంవారి పుష్పప్రదర్శనంలోనిది)

ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక

నవలా రచన పోటీ ఫలితం

బహుమతి పొందిన రచన: **"ఉదయ కిరణాలు"**

రచయిత:

శ్రీ పోతుకూచి సాంబశివరావుగారు, హైదరాబాద్

(బహుమతి: రు. 250)

ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రిక నడిపిన నవలారచన పోటీకి మొత్తం 76 రచనలు వచ్చాయి. వచ్చినవానిలో పోటీ నిబంధనలకు లోబడివున్న రచనలలో శ్రీ. పోతుకూచి సాంబశివరావుగారి "ఉదయ కిరణాలు" ఉత్తమమైనదిగా ఎంచబడినది. పోటీలో పాల్గొన్న రచయిత లందరికీ మా కృతజ్ఞత ప్రకటిస్తున్నాము. పోటీలో గెలుపొందిన రచన ప్రచురణ త్వరలోనే ప్రారంభించబడుతుంది.

—సంపాదకుడు.

ముక్కూ మొహంపోయిన పాత విగ్రహ శిధిలాలు కనిపిస్తాయి. ఈ నాక్తాల పూజలూ, సంబరాలూ వాటివల్ల — హైందవ సంస్కృతీ ప్రాబల్యంవొచ్చి పడకముందు వీరు పంచభూతాలని ఆరాధించేవారని తెలుస్తుంది.

ఈ దేవతలని, ముఖ్యంగా తోటలూ దొడ్లూ ఉన్నస్థలాల్లో, పంటలు పాడవకుండానూ, రోగాలు రాకుండా ఉండడానికీ ఆరాధిస్తారు. వానలు లేక భూమి బీటలువారి కరువూ కాటకం పెట్టినరోజుల్లోనూ, అంటువ్యాధులూ, పశువులకి తెగుళ్లూ మొదలయిన జాడ్యాలు వ్యాపించినప్పుడూ ముఖ్యంగా యీ అమ్మ తల్లులని "చల్ల"జేస్తారు. ఇంటిబాధలు యెప్పుడూ రాకుండా ఉండడానికని ముందుగానే మేలుకొంటారు. కాబట్టే చైత్ర వైశాఖ మాసాల్లోనూ (అంటే వరి పొలాలపని ఆరంభించేముందు), జ్యేష్ఠ మాసంలోనూ కూడా యీ దేవతల పండుగలు యెక్కువగా జరుపుతారు.

ఈ స్థల దేవత లన్నింటిలోకీ మరీ ప్రాచీనం అయినది "బానోమ్" (B'a ph-uom) లో ఉన్న "మేసాక్" నక్త. ఈ బానోమ్ అనేది పూర్వపు "మోతాన్" కొండఅని, ఐదో శతాబ్దంలో (ఏదో చైనా దేశపు లెక్క) శివుడు తన దివ్యశక్తులు యిక్కడ ప్రభవింప జేసేడనీ చైనా చరిత్రకారులంటారు. అసలు యీ నక్తా మహిషాసుర మర్దనం చేస్తూన్న ఉమాదేవి విగ్రహం. ఇది ఆంకోరువాట్ (*Angkor vat*) శిధిలాల్లో కనిపించే శిల్పంకన్నా ప్రాచీనం అయింది అంటారు. ఈ నక్తా వుత్సవం ఏటేటా వైశాఖ పూర్ణిమకి ముందువొచ్చే శనివారంనాడు జరుపుతారు. ఈ పండుగకి యిదివరకు నరబలియిచ్చే ఆచారం ఉండేదని —వాళ్లతాత ముత్తాతలు చెప్పిన ఉదంతాల ఉటంకిస్తూ—ఆ ప్రాంతంలో ముసలివాళ్లు యిప్పటికీ ఉంటారు. అయితే రాను రాను పశుబలి (దున్నపోతుని బలియిస్తారు) మాత్రం వేమిగిలింది. పోతుని నరకగానే రక్తం ఏదిశగా చిందుతుందో ఆవేపంతా కుంభవృష్టి కురిసి, సస్య సమృద్ధిగా ఉంటుందిట. అయితే బొత్తిగా యివేవల రోజుల్లో ప్రత్యక్షంగా బలియివ్వడం చాలావరకూ అంతరించిపోయి, చీనా కసాయివాడిచేత పందిని కొట్టించి ఆ కొట్టినపందిని పట్టుకెళ్లి నివేదనం చెయ్యడం ఆచారం అయింది. ఈపండుగ జ్యేష్ఠమాసంలో జరుగుతుంది. సంబరంనాడు వొండిన అన్నం నైవేద్యంపెట్టి, ఆ ప్రసాదం ప్రతివాళ్లకీ రంగుపాట్లాలలోపెట్టి పంచిపెడతారు.* వీటితోపాటు కోరానూలు తోరాలుకూడా ఉంటాయి. ఈ తోరాలు ఉన్నతోద్యోగుల చేతికి కడతారు. యిలాకట్టిన తోరాల వల్ల ఉద్యోగులకీ నక్తాలకీ సఖ్యతయేర్పడి మరే చికాకులూ ఉండవుట!

* ఈ పొట్లాలు *Conical* గా కట్టాలి గాని, *Flat* గా కట్టడానికి వీల్లేదు

అన్నిటికంటే కాంబోడియాలో బాగా ప్రసిద్ధి చెందింది పుర్స్యాట్ ప్రదేశంలో ఉన్న ఖ్లాంగ్ మురోంగ్ నక్తా. పదహారో శతాబ్దపు చివరిరోజుల్లో సెసెస్థార్ (*Cei-cesd'ar*) ప్రభువు, పుర్సాత్ కి కొన్ని మైళ్ల దూరంలో ఉన్న బాంతేసె (*Bantays*-విజయదుర్గం) కోటలో ఉంటూన్నప్పుడు ఓసారి సయాంతో గొప్పయుద్ధంచేసేట్ట. యుద్ధందారుణంగా జరుగుతోంది; ధారాపాతంగా రక్తంప్రవహిస్తోంది; కాంబోడియన్లు ఓడిపోతున్నారు; ప్రభువు బహు ప్రమాదావస్థలో ఉన్నాడు. అదుగో. ఆసందర్భంలో ప్రభుభక్తిపరాయణుడు పుర్సాత్



అశోక స్తంభం

(మద్రాసు ప్రభుత్వంవారి పుష్ప ప్రదర్శనములోనిది. ఫొటో: డి. రామలింగేశ్వరరావు.)



కొత్త చిగుళ్లు

ఫొటో: పి. రామారావు—రాజమండ్రి.

★ భూ దేవ త లు ★

గవర్నరు బలిదానం చేయ్యడానికి నిశ్చయించుకున్నాడు. లోతుగా ఓ గొయ్యి తవ్వించేడు. నానారకాల ఆయుధాలూ అందులో పడేసేడు. తరవాత ప్రార్థనలూ అవీ కానిచ్చి తానా గోతిలో దూకేసేడు. ఆయన సతీమణికూడా ఆప్రకారం వేచేసింది, భర్తపోయింతరవాత బతికి ఏంలాభం అని. తరవాత ఆగొయ్యి పూడ్చేసేరు. మరికొద్ది రోజులకి సయామజ్ సేనలు దుర్గాన్ని ముట్టడించేయి. కాని ఆరాత్రి ఘోరాతిఘోరమయిన అగ్ని ప్రమాదం సంభవించింది ఆసేనల్లో - సయాంసేనలు యీగల్లా మండిపోయారు. ఆ వీరాగ్నికి ఆహుతిఅయి!

ఆజాగాలో పుర్సాత్ గవర్నరు సమాధి వెలిసింది. అప్పట్నుంచీ యేటేటా వైశాఖ మాసంలో యీ సమాధిదగ్గర అతనుచేసిన సాహసత్యాగానికి ఉత్సవాలు జరుపుతూ ఉంటారు. అయితే యిటీవల యీ ఉత్సవంన్నూ, అక్కడి భూదేవత ఉత్సవంన్నూ కలిసిపోయినాయి. ఈ సంబరంనాడు అడివి ఎద్దుకొమ్ములు పట్టుకుని, వృక్షకీడలని అనుసరిస్తూ, నాట్యం చేస్తారు. వసంతానికీ తొలకరి వానలకీ సంబంధించిన పాటలు పాడతారు. యివిగాక పాతకాలపు పాటలు అనేకం పాడతారు.—

౧

"అవుగో అల్లవుగో
ఆకాశంలో మేఘాలు
ఆలకించారోదన
కీటకారణ్యంలో కీచురాళ్లు
అన్నా ఆరోహించండా కొండ
కొండలనుంచీ బండలు వొందలు
వొందలు దొర్లించండి"

౨

అవుగో అల్లవుగో
అడవియెద్దులు
గుంపులు గుంపులు
లేత పైరుల
చిగురు టాకులు
పొట్టబెట్టుకో
పయనిస్తున్నయ్
జంటలు జంటలు.

3

నే కొడతా నే కొట్టా, త
డాకా చూపిస్తా, రానీ ఆ
అడివికోతుల్ని
ఆడా మగా, ఎన్నో! ఎన్నో!!
ఎన్నెన్నో!!!
చెట్టుచెట్టునా, కొమ్మకొమ్మనా
చట్టున గెంతుతు, బిట్టరుస్తూ
తమతమ వారికి
దానం చేస్తాయి, ఏం!
తియ్యని పళ్లూ
దానం చేస్తా యేం?

౪

అయ్యో అన్నా, అయ్యో అన్నా,
అన్నన్నా
కోతి కూడా కొమ్మని భార్య!
కొండకొండనా
వాగువాగునా
కాళ్ళరగగా
తిరిగి తిరిగి మతి
చెరిగి చెదిరి నే నొక్కణ్ణే! *

* ఇది వాళ్ళ పాటకి యథా మాతృకానువాదం కాని రాసిన పాట మాత్రం కాదు.

కోంపాంగ్ - ఛ్నాంగ్ రాష్ట్రంలో సంబరాలకి ఎడ్లని బలియిస్తారు. వానదేవుణ్ణి (వరుణుణ్ణి) సంతృప్తి పరిచే సందర్భంలో, స్నానం చేసినట్టు చెమటలు కారే దాకా నాట్యం చెయ్యాలి. అప్పుడే వానదేవుడికి సంతృప్తి. జబ్బు పడి ఆరోగ్యం కోలుకోవలసిన వాళ్లు నైవేద్యం ఓ పళ్లెంలో ఉంచి, అడివిలో బొత్తిగా నిర్జనం అయిన ప్రదేశంలో దయ్యాలు తినడానికి వొదిలేసి రావాలి.

కోపాంగ్ - థోమ్ రాష్ట్రంలో వనదేవతల సంబరం జ్యేష్ఠమాసంలో జరుగుతుంది. అడివిలో ఓ ప్రధానదేవతా, ఆరుగురు చిన్న దేవతలున్నూ—ఈ ఏడుగురికీ ఏడు విగ్రహాలు. వీటికి ముందు పూజచేసి, నైవేద్యం పెట్టి, అడివిలో చెట్లు కొట్టుకోనిమ్మని ప్రార్థిస్తారు. ఈ అమ్మతల్లికి పెట్టే కానుకల్లో ముఖ్యంగా బట్టల్లూ, అలంకరణలూ, పౌడరూ, తలకి రాసుకునే నూనె తప్పకుండా పెట్టాలి. (ఈ నక్రాలన్నీ దేవతలాయె మరి!) మధ్యాహ్నం యీ దేవతలు పూన్తారు. దేవుడు పూనినవాళ్లు, ప్రశ్నలు వేస్తే జవాబు చెబతారు.

ఇంక ఒక చిన్న సంగతి ముచ్చటించి యీ తడవకి ముగిస్తాను. కొచ్చిన్ చైనాలో బౌద్ధులు చెక్కిన రెండు ప్రాచీన విగ్రహాలు కనపడతాయి: ఒకటి విష్ణువు, రెండోది ఉమాను. అనేక శతాబ్దాల క్రితం, తమ తండ్రిదగ్గిర్నుంచి పుచ్చుకుని ఓ రాచకుమారుడూ రాకుమార్తే వీటని ప్రతిష్ఠించడానికి ఇక్కడికి వొచ్చేరనీ, అయితే యీ స్థలం చేరుకునేలోగా పడవ మునిగిపోవడం మూలాన్న, అయిద్దరూ నీటిలోకి దిగి విగ్రహాలను వెతికి బయటకి తీసేరని ఓ గాథ.

పండుగ సమయంలో యీ విగ్రహాలకి సారాయి అభిషేకం చేస్తారు. బాజాలు మోగుతూఉంటే నైవేద్యం పెడతారు. ఇలా ముమ్మారు నైవేద్యం పెట్టి, ఆ పెట్టిన వస్తువులు అరటి దొప్పతో చేసిన పడవలో ఉంచి నీటిలో వొదిలివేస్తారు. జబ్బులూ యీతిబాధలూ అన్ని యీ పడవతో కొట్టుకుపోతాయి అని నమ్మకం. పిల్లలచేతులకీ పశువుల మెళ్ళలోనూ తోరాలు కడతారు. ఈ ప్రక్రియ జరుగుతూన్నంతసేపూ బాజాలు అలా మోగుతూ ఉండవలసిందే.

(ఇంకా ఉంది)

జీవితము

"జీవితమంటే ఏమిటిస్వామీ!"
శిష్యుడు గురువును అడిగాడు.
గురువుజవాబుగ ఉత్తరీయమును
కొంచెము ప్రక్కకుతొలగించి,
చేతిపైననొక దారుణదృశ్యము
శిష్యునకిదెయనిచూపాడు:
రాహువుసూర్యునివలె వ్రణమొక్కటి
బాహువునే కబళిస్తోంది.

* * * *

అదేనమయమున పరిసరతరువుల
నామని కోయిలకూసింది.
విరబూచిన విరజాజుల, మల్లెల
సురభిళానిలము వీచింది.

(వ్సెవలోడ్ మైకేలోవిచ్ గార్షిన్)

అలక

ద్వివేదుల సోమనాధశాస్త్రి

పిల్లకి బారసాల బలవంతాన్ని జరిపించి కమలతో సహా వచ్చేశాడు చంద్రం. అది సవ్యంగా జరిగిపోతే ఏ బాధా లేకపోనుగాని, అందరూ నవ్వులాట కింద కట్టడంవల్ల వచ్చింది.

పిల్ల పుట్టిందగ్గర్నుంచి వెంటనే బారసాల చెయ్యమని ఎన్నివిధాల చెప్పినా పదకొండోరోజున కాదు యిరవైఒకటో రోజున కాదు నెలకొకదినం తక్కువచేసికూడా మావగారు చేశారుకాదు, సరికదా సముజాయిషీ అయినా ఇవ్వలేదు. అందుచేతనే చంద్రం ఏం ఆలోచించుకున్నాడో గాని మరోవిధాన్నయితే లాభంలేదని మావగారూ అత్తగారూ ఏదో వూరువెళ్ళడం, పెళ్లాం ఒక్కర్తీ వుండడం చూసి ఒక మంచిరోజున వెళ్లి అప్పటికప్పుడు పురోహితుణ్ణి పిలిపించి ముహూర్తం పెట్టించి, బాజా బజంత్రీలు పిలిపించి తంతు యధావిధిగా జరిపించి వెంటనే కమలని యింటికి తీసుకు వచ్చేశాడు. అందరూ ముక్కులమీద వ్రేళ్ళు వేసుకొని బుగ్గలు పొడుచుకున్నా ఖాతిరు చెయ్యలేదు.

తనుచేసిన యీ పని అందరికీ విడ్డూరం అయినా తనకి అది తగినపని అని తోచింది. యీ మావంగారితో ఎంత పొత్తుగా వుందామని అనుకున్నా ప్రతివిషయంలోనూ ఏదో ఒక దగ్గిర తనకి యిష్టం లేనటువంటిది చేస్తూనే వుంటాడు. అది అతడు బుద్ధిపూర్వకంగానే చేస్తున్నాడా? అని-అనిపించి చంద్రానికి కోపం వస్తుంది. యీ పని మంచిదే అని తనకి తోచిచేసినా మనసు మాత్రం మాటి మాటికీ తర్కిస్తూ కొట్టుకొంటోంది. అందుగురించి ఆలోచించక తప్పకుండావుంది. ఇంత యిది అయినా కమల మాత్రం కించిత్తూ కోపంగాని అయిష్టత గాని కనపర్చలేదు. ఎప్పటిలాగేవుంది. ఇంటికి వచ్చేసినా యీ ఆలోచనే పట్టుకుంది. పరధ్యానంగా ఆలోచిస్తూ కూర్చుండిపోయేడు ఆ సమయంలో—

"పిల్లని ఎత్తుకుని అలా కాస్త ఆడించండని తెమలడంలేదు" అంటూ గౌరిని చంద్రం చేతుల్లో పెట్టింది కమల.—చంద్రం తెల్లబోయాడు. అప్పటికప్పుడే మంచిబట్టలు వేసుగొని ఆఫీసుకు పోడానికి సిద్ధపడుతున్నాడు. కాని అదేమీ గమనించకండానే కమల గౌరిని అతడి చేతుల్లోవుంచి వెళ్ళిపోతూంది.

"బావుంది ఆఫీసుకి వేళ అయిపోతూంది నువ్వే తీసుకు ఆడించు తరవాత పని చూసుకుందూగాని" అని మామూల్గా అనేసి పిల్లని తిరిగి యిచ్చిబోయేడు.

ఆ జవాబు విని వెళ్లిపోతున్నదల్లా యిటు తిరిగి కిసుక్కుని నవ్వింది. చంద్రం వయిపు అదోలా చూసింది—

ఆ చూపులో అయిదేళ్ల నాటి వేడుకలన్నీ కళ్ళకు కట్టినట్టు కనబడుతున్నాయి. ఆ నవ్వులో ఆనాటి అపురూపపు మాటలన్నీ బొటబొట రాలేయి. అపుడామె నిలబడ్డ వైఖరి...శోభనం గదిలో తలుపుదగ్గర నిలబడివున్నపుడు, చంద్రం దొంగతనం లేకండా తొలిసారి ధైర్యంగా చూసినట్టే వుంది. అలక పాన్పుమీద ఓరకంటితో చూసిన కమల యిప్పుడు తిరిగి అలాగే కనిపిస్తూవుంది.

ఇలా కమలవయిపు చూస్తూ వర్తమానం మరిచిపోయి వున్నాడు చంద్రం.

ఇంతలో వెచ్చవెచ్చగా చేతులకి, బట్టకిందా తగలగానే ప్రపంచంలో పడ్డాడు... గౌరి పుచ్చపోసింది......

ఆ అనవాయితీ తీరగానే గౌరిని తీసుకుందికని కమల చేతులు జాపింది. ఆ చేతులెందుకో గాని...మొదటిసారి చంద్రం పండుక్కి వాళ్లింటికి వెళ్లినపుడు ఎవరూ లేకండా చూసి ఆమె చెయ్యి అందుకున్నప్పుడులాగే ఒణుకుతున్నాయి.

కమల గౌరిని తీసుకుంటున్నపుడు చంద్రానికి ఆమె చేతులు తగిలేయి.

అప్పుడతని ఒళ్లు జల్లుమన్నదంటే ఆశ్చర్యం ఏముంది?

పరవాణ్ణం మొదటిమారు యిద్దరూకలిసి తిన్నపుడూ, గదిలో గంధం రాసినపుడూ, తలంబ్రాలుపోసినపుడూ, చిటికన వ్రేలుపట్టుకొని అగ్నిహోత్రం చుట్టూ తిరిగినపుడూ మంగళసూత్రం కట్టేప్పుడు కంఠం చుట్టూ చేయి తలిగినపుడూ, సూత్రం కట్టడానికి బరువయిన జడని మీదకు ఎత్తినపుడు, బిందెలో గొలుసుకోసం పందెంవేసి పోట్లాడుతూన్నపుడూ వున్నట్టే చంద్రానికి ఇప్పుడూవుంది.

అయితే గొలుసుపందెంలో అన్యాయంగా అతని చెయ్యిగిల్లి గొలుసు లాగేసుకుంది కమల. తేలుకుట్టినదొంగలా చంద్రం నోరుమూసుకు వూరుకునే సరికి "అబ్బే పెళ్ళాంతో చాలలేకపోయాడు!" అని అందరూ గోలపెట్టి చిన్నబుచ్చేరు. అయినా అప్పుడు కమల తీసుకుంటేనే చంద్రానికి సరదాగావుంది. అందేవిటో! అందికే పెళ్లాం బెల్లమంటారు!

కమల గౌరిని తీసుగొని వారిద్దరికీ మధ్యనున్న వుయ్యాల్లో పడుకోబెట్టింది. చంద్రం వేపూ గౌరి వేపూ చూస్తూ కమల—

"నాకు నవ్వొస్తూంది" అంది.

"ఎందుకూ!" అన్నాడు చంద్రం.

"చెప్పుకోండి!"

"నామీద ఉచ్చబోసిందనా! ఆనందం!"

"ఓ మా గొప్ప! టీ తాగుతూ ఒలకబోసుకున్నపుడూ, బొమ్మలు వేసేటప్పుడు రంగుబ్రష్షులు చొక్కాతోనే తుడిచేసుకున్నపుడూ లేదు కామోసు యిప్పుడే వచ్చింది!" అవును ఆ సమయంలో అలాగే వుంటుంది. మరి మంచి పెచెస్ పెడుతూంటే వేళకి గుడ్డదొరకనప్పుడు ఏం చేయడం?"

"పోనీలెండి! అందుకోసం కాదు!"

"మరి దేనికి!"

"జ్ఞాపకంలేదూ! తెచ్చుకోండి?"

"ఎక్కడనుండి తెచ్చుకోవడం?"

"మీ పెళ్లినుండి!"

"నా పెళ్లినుంచా! నీ పెళ్లినుంచా? మన పెళ్ళినుంచా!"

"ఎక్కడనుండి అయినా ఒకటే!"

అని ఆమె అన్న తక్షణం ఆమెని మంచం మీద కూర్చోబెట్టేడు చంద్రం.

"బావుంది యిదేంవిటీ వికారం? వేళా పాళా..."

"ఏం 'నాగవల్లి'... తెచ్చుకున్నాను జ్ఞాపకం..."

"అయితే..."

"అప్పుడూ యిలాగే కూర్చున్నాం... యిలాగే ఉయ్యాల కట్టేరు.. కాని...అయిన మార్పు—చందనపు బొమ్మకి బదులు—గౌరి—వసంతానికి బదులు—వుచ్చ..."

ఇలా చంద్రం చెప్పగా కమల మారిపోయింది. ఏదో ముగ్ధత్వం ఆవరించింది. ముఖం ఎర్రగా వేసుగొని దూరంగా జరిగి వయ్యారంగా సారిపెళ్ళికూతురిలా తల వంచుకొని వింటూంది!

కొంతసేపు ఎవ్వరూ మాటాడలేదు, ఆ

అలక

మధురస్మృతులు నెమరువేసుగుంటూ ఒకరి మొహం ఒకరు చూసుకుంటూ అదో లోకం లోకిపోయివున్నారు, అంతలో గౌరి ఏడుపు మొదలెట్టేసరికి యిద్దరూ మేలుకున్నారు...

"అడుగో మీ నాన్న! ఎత్తుకోమని అడుగు" అంది కమల.

"నా పేరు చెబితేనేగాని దానికేం తెలుస్తుంది" అన్నాడు చంద్రం." నీ పేరు బాగా తెలుసు నువ్వే తీసుకో!" అని కూడా అన్నాడు.

"నా పేరు మీరు చెప్పండి దానికింకా తెలీదు!" అంది.

"నువ్వే మొదట చెప్పు!"

"మీరు మొదట చెప్పండి!"

—అమ్మలక్కలెవ్వరూ అక్కడ లేక పోడంవల్ల ఆ ముచ్చట అట్టే సాగలేదు. ఇంతలో గౌరి ఏడుపు ఎక్కువ అయింది.

"కాస్సేపు ఆడిద్దురూ" అని యిదంతా మరిచేపోయి అనుకోకుండా అనేసింది. చంద్రానికి ఆశ్చర్యం వేసి.

"ఆఫీసుకు పోవాలి నువ్వే ఆడించు" అనేశాడు...

...మళ్లీ కమల పక్కున నవ్వింది...

...చంద్రం కూడా ఎక్కువ నవ్వేడు...

* * *

లాంఛనాలూ, పిలుపులూ, మర్యాదలూ, తూచ. తప్పకుండా జరిపించి పిలవగా పిలవగా మురిపించి మురిపించి పండగనాటికి వచ్చేడు, అల్లుడు!.. ...అల్లుడెంత చికాకు కలిగిస్తున్నా 'గౌరి'ని చూసేసరికి అవన్నీ మరిచిపోతూ వుంటారు కమలా చంద్రం. కన్నపిల్లని ఏడాదికోసారయినా తీసుకవచ్చి ముద్దూ ముచ్చటా తీర్చుగోకపోతే ఉండబట్టుతుందా? ఎవరికయినా? అందుకనే అల్లుళ్లు ఎన్ని అలకలు అలిగినా బతిమాలుకొని అన్నిటికీ వశి తీసుకువస్తూంటారు. అల్లుడొచ్చి శాంతంగా వెళ్లేవరకూ మనశ్శాంతే వుండదు కొందరికి.

మొత్తంమీద వేడుకలన్నీ అయినాక కానుకలన్నీ యిచ్చేక అల్లుడు వెళ్లిపోయాడు. గౌరిమాత్రం వుంది. అప్పటికి తిరుపతికొండఎక్కి దిగినట్లయింది చంద్రానికి!

ఆ నాలుగు రోజులూ కమల పనుల్లోనే మునిగిపోయివుంది. చంద్రంతో మాటాడ్డానికయినా తీరిక అయిందికాదు. ఒకసారి మధ్యలో తనే చొరవచేసుకోబోతే—

"మతిపోతూందా ఏమిటి? మరీ చిన్నతనం చేష్టలూ మీరూను! ఎదురుగుండా అమ్మాయీ, అల్లుడూ వుంటూంటేను" అని కసిరేసింది!

అమ్మాయీ అల్లుడూ ఎవరూ లేని సమయంకోసం కనిపెడుతూవుండడం, ఎవరూ లేరని అప్పుడప్పుడు ఎదురుతూ కలుస్తూపోతూండడం గమనిస్తున్న చంద్రానికి తన చిన్నతనం, తనూ కమలా వాళ్లయింటికి యిలాగే పండుగలకి వెళ్లినప్పుడు గడిపిన హాయి అయిన రోజులూ ఆ అనుభవాలూ అన్నీ జ్ఞాపకానికి తెచ్చుకొని ఆనందపడేవాడు...

మరి ఒకటి రెండురోజులు అల్లుడు వెళ్లిన తర్వాత పండుగకబుర్లతో గడిపేరు.

ఆ రోజు ఆఫీసులో వుండగా తన పేర వచ్చిన పార్సిలును ఆశ్చర్యంతో విప్పి చూడగా 'పొద్దున్నే లేచి ఎవరి ముఖం చూసేనా?' అని అనుమానించవలసివచ్చింది.

అందులోవున్న వస్తువలు చూడగానే చంద్రానికి కోపం, ఆశ్చర్యం, ఉడుకుమోతుతనం, అన్నీ కూడుకొని వచ్చేయి. అందులో తను అల్లుడికిచ్చిన సూటుబట్ట, ఒక వుత్తరం వున్నది—ఆ వుత్తరంలో—

"ఈ బట్టలు పొరపాటున నాకు తెలియకుండా వచ్చేసేయి, సర్దడంలో మీ అమ్మాయి పొరపాటు చేసివుంటుంది, యివి ఎవరివో తెలియక తిరిగిపంపేస్తున్నాను' అని వుంది.

అదిచదివి ఏంచేయాలో తోచక విసుక్కున్నాడు. కమల చెప్పియిసుంది కదా అని తను అల్లునితో ఏం అనలేదు! అదీకాక అతగాడిని కూడా బజారుకు తీసుకువెళ్లి కొన్నాడు. అటువంటప్పుడు ఎవరికోసం కొన్నట్టు? అతనికి కాక పోతే మరెవరికి ఆ సమయంలో కొంటాడు? బాగుంది వరస! యింకా మర్యాద చాలలేదా! యిలాగయితే ఎవడితరం? అని అప్పటికి అనుకొని యింటికొచ్చి పార్సిలు కమల చేతికిస్తూ:

"నువ్వు యీ బట్టలు అతనికే అని చెప్పలేదా?" అని అడిగాడు.

ఆ పార్సిలు చూసి చంద్రం అన్న మాటలు విని, ఆ వుత్తరం చదివి, జవాబు చెప్పడానికి బదులు కమల, పకపక నవ్వడం ఆరంభించింది.

అది చంద్రంకి ఏం అర్థంకాక పోగా చికాకు వేసింది.

"ఏమిటిది? నవ్వతావెందుకు? అతగాడు ఏవుద్దేశ్యంతో తిరిగిపంపేడో ఏమయింది?". అని అడిగాడు...

"ఏమయింది? మీరు నేర్పిన విద్యయే.. అన్నట్టు...అతగాడు మీకు అల్లుడేగా... తక్కువేం......" అంది నవ్వుతూ మాటాడుతూ నవ్వుతూ — మాటాడుతూ.

"నవ్వి అయినా చెప్పు... చెప్పి అయినా నవ్వు"

"మరి పూర్తిగా నవ్వనీండి!"

"చాలు యింక చెప్పు!"

"తగిన పనే చేశాడు!"

"అంత వేళాకాళంగావుంది! దీనితో పూరుకుంటాడా? నలుగురితో నూ చెప్పడూ?"

"ఏం చెబుతే!..." మీరూ అందరితోనీ చెప్పలేదూ?"

"ఏమని, ఎప్పుడు?"

"జ్ఞాపకం తెచ్చుకోండి!"

"ఎక్కడనుండి తెచ్చుకోవడం!"

"మీ అత్తవారింటిలోనుండి!"

—ఆ ముక్కతో చంద్రం స్థితి మారిపోయింది. అవును! ఆ సమయంలో ఆ ముక్కలంటున్న కమల సరిగ్గా అతని అత్తగారిలాగే అవుపించింది. అతని అత్తగారే అలా అడుగుతున్నట్టువుంది...ఆనాడు తను చేసినవన్నీ...జ్ఞాపకానికివచ్చేయి...... అవకాశం వుందికదా అని, వారి చెయ్యి కిందా తన చెయ్యిమీదా అని—వారి అనువు పరిస్థితి, కనిపెట్టి, ఆడపిల్లని యిచ్చుగున్నాక తనేం చేసినా చెల్లుతుందనే గర్వంతో నీ-భార్యని వెనకవేసుకొని ప్రతీదానికి ఒడ్డుతూ, ఒక ఆయుధంలా ఉపయోగించి ఏమయినా అంటే—తను చేయగలిగింది, చేసినా ప్రస్తుతం చెల్లుతున్నది పిల్లని పుట్టినింటికి వేరు చేయడం ఒక్కటేకాబట్టి, పంపను, అంటూ బెదిరించి, భయపెట్టడమూ, అయినదానికీ కానిదానికీ సందర్భశూన్యంగా పేచీలు పెడుతూండడమూ, శక్తికొలదీ పంచిల చాపు పెడితే, తాహాతుకి తక్కువ అని సూటు బలవంతాన్ని తీసుకోడం, మరోమారు సైకిలు యిచ్చినట్టయితే గాని తీసుకువెళ్లడానికి వీలు లేదనడం, యింకోసారి అర్జంటుగా అయిదువందలు కావాలని తీసుకొని ఎగనామం పెట్టడం, ఒకసారి మాటమీద మాటరాగా, పిల్లని తను పంపక పోయినా, చీరలు కొని పంపుతే తిరిగి పార్సిలుచేసి పంపెయ్యడం, ప్రతిసారి వెళ్లినపుడూ 'ఫలానాయింత' అని అచ్చివున్నట్టు, దాచపెట్టినట్టు అడిగి, గుంజి, డబ్బు తీసుకుంటూండడం......యీ విధంగా చింతించే మనసుల్ని విచారించకుండా క్షోభపెట్టినరోజులు జ్ఞాపకానికివచ్చి చంద్రం అలా వుండిపోగా—

కమల చేతిలోంచి పార్సిలు తీసుకుంటున్నపుడు తెలివివచ్చింది.

"అవును తగినపనేచేశాడు" అన్నాడు.

అది విని కమల పూరంత నవ్వింది...

"ఏం మీ రెంచేత చెప్పలేదు!" అని అడిగింది.

నువ్వు చెప్తేవనుకున్నా. నువ్వూ చెప్పలేదా?"

"అతను చూస్తుండగానే బెడ్డింగులో పెట్టేను వేరే చెప్పేదేముంది?"

చంద్రం కొంతవరకూ పశ్చాత్తాప పడ్డా

అహం వదలలేదు, కోపం లోపలవుంది.

"అతనికిస్తామని తెలీదా! అంత యిష్టం లేకపోతే యిక్కడే వదిలేయరాదూ? మళ్లీ యీ డొంక తిరుగుడంతా ఎందుకు. వేరే బొట్టుపెట్టి చిత్తగించు అని చెప్పాలా! ఒక డిని చిన్న బుచ్చితేగాని వేరొకడికి గౌరవం, ఆధిక్యతారాదు, అక్కడికిగాని అతగాడి గౌరవం నిలబడదు కాబోలు!" అని గబగబా అనేసేను.

"భూమి గుండ్రంగా వుందని చెప్పడానికి, తలనొప్పి అయినా తనదాకా వస్తేగాని తెలియదని చెప్పడానికిన్ని యీలా చేశాడు...అందికే అన్నారు అత్తా ఒకింటి కోడలే అని. మీ రివన్నీ ఆలోచించే అప్పుడు విడిపించారా?" అంది కమల.

"నువ్వయినా వుంచు నా మర్యాద! అసలు నువ్వుచెప్పి యివ్వకపోవడం నీది తప్పు!"

"బావుంది, ఏదివచ్చినా నామీద తోసేస్తారు! అమ్మాయితో చెప్పేను..."

అని కమల అంటూండగానే 'గౌరి' అక్కడికి వచ్చి—

"బావుంది నాన్నా... నువ్వే చెప్పు! యిచ్చేవారు మీరు, పుచ్చుకొనేవారు తను! మధ్య నే చెప్పడం ఏమిటి? నా పెత్తనం ఏమిటి? అలా అయితే యీ సామానంతా తీసుకోమని చెబుతాను! తీసుగోనిస్తారా? అయినా అతనితో నువ్వు మాటాడవా? అమ్మ మాటాడెదా? అతనిసంగతి మీకు తెలుసు! అందికే ఆయన తిరిగి తోలేశారు! యిందులో ఆయన తప్పేముంది?

అదిగాక నే చెప్పినంతమాత్రంలో తీసుకుంటే ఆ తర్వాత 'మేం చెప్పకండా తీసుకుపోకూడదు ఏదయినా యింతేకదా?' అని మీరంటే! అంచేతే ఎవరి జాగ్రత్తలో వారుండాలి!" అని గబగబా సమయం చూసుకొని తగినట్టు సమాధానం చెప్పేసింది.

అవన్నీ విని కమల ముఖం చంద్రం, చంద్రం మొహం కమలా చూసుకొని వుండిపోయేరు తప్పిస్తే జవాబు చెప్ప లేకపోయేరు!

కన్నకూతురయినా గౌరి ఆమె భర్తనే వెనకేసుకొచ్చి వాదించడం చూసి చంద్రం ఆశ్చర్యపోతూశు ... "యీ ఆడవాళ్ళలో ఎంతమార్పువస్తుంది!" అనుకున్నాడు.

అలా అంటున్న అమ్మాయి గౌరిని చూస్తూంటే తన చిన్నప్పుడు, తనది తప్పున్నా తన వైపు వాదించిన కమలే గౌరిలో చంద్రానికి కనిపించింది. గౌరి వెళ్లిపోయింది."

"చెసినతప్పులు దిద్దుకోండి" అంటూ మళ్ళీ ఒక్కలా నవ్వడం మొదలెట్టింది కమల, ఆ నవ్వు ఆగడంలేదు.....

కాని చంద్రానికిమాత్రం వీకొశాన్నా తెచ్చుకుందామన్నా నవ్వు రాలేదు...

ఒకప్పుడు గౌరిని చేతికిస్తూ 'నాగవల్లి' అని నవ్వించిన కమలతో సహా చంద్రం కూడా నవ్వేడు...కాని...

ఇప్పుడు...'అల్లుని అలకొ సమయంవచ్చినపుడుమాత్రం అలకతీర్చడం, అలిగినంత తేలిక కాదని అనుభవపూర్వకంగా తెలుకొవడంవల్ల కమల నవ్వినా, నవ్వించినా, చంద్రం నవ్వలేక పోయేడు... ★



18

రత్తమ్మకి అచ్చాఫీసులో కంపోజిటరు పనిచేస్తున్న సత్యనారాయణకీ పెళ్ళికుదిరింది. శ్రావణమాసంలో ముహూర్తం. ఇంక నెలరోజులేవున్నది. ఈలోగా, వధువూ వరుడూ స్వేచ్ఛగా కలుసుకునే అవకాశాలు కోకొల్లలుగా లభించాయి. వాళ్ళిద్దరూ, సినిమాలకనీ, పార్కులకనీ వెళ్తున్నారు. వసంతం, వాళ్ళనేమీ ఆటంకపర్చలేదు. పెళ్ళంటే పెద్ద అట్టహాసమేమీ లేకపోయినా, మంగళగిరి వెళ్ళాలి. అక్కడ గుళ్ళో తూతూమంత్రంగా తాళి గట్టించినాగాని వందరూపాయలు వొదుల్తాయి. ఈడబ్బు ముసలమ్మ దగ్గిరవుందా అని! పెళ్ళయినాక ముసలమ్మని రత్తమ్మతో కూడా పంపించటానికి వీల్లేకొచ్చింది. వరుడొప్పుకోలేదు. ముసలమ్మ తనమెడకే పడ్డది ... అయినా తప్పేదేముంది! తనకే తల్లివుంటే తప్పేదా! ఇలా ఆలోచిస్తోంది వసంతం తనగదిలో కూచుని.

రాత్రి పదిగంట లౌతోంది. వర్షం మధ్యమధ్య తుప్పరగా పడుతోంది. రత్తమ్మ ముసలమ్మముందు వరండాలో జల్లుతగలకుండా ఒదిగి పడుకున్నారు. ఇద్దరూ గాఢనిద్రలో మునిగిఉన్నారు.

రత్తమ్మ ఇంట్లో వుండటంవల్ల ఇంకో గట్టి చిక్కు ఏర్పడుతోంది వసంతానికి. వరదరాజు రత్తమ్మమీద కన్నేశాడు. అతన్ని పట్టుకోవడం బహుకష్టంగావుంది. అంతేగాదు; వసంతం కోసం వొచ్చేవిటులు కూడా రత్తమ్మనిచూసిన కళ్ళతో వసంతాన్ని చూసి వివరించుకుంటున్నాడు. "దాన్ని...ఏంచేస్తావు? రంగంలో కెప్పుడుదించుతావు?" అని అడుగుతున్నారు.

వసంతం ఈ విషయంలో నిర్మొగమాటంగా వుంటున్నది. ఇంకొక్క నెలరోజులు గడిస్తే చాలు. రత్తమ్మ అవతలకి దాటి పోతుంది.

మృత్యుంజయశాస్త్రి వస్తూనే రత్తమ్మని చూశాడు. "ఎవరది వసంతా!" అని ప్రశ్నించాడు.

వసంతం ఆయనకళ్ళలో దీపించే మోహాకాంక్షని అర్థంచేసుకుని ఎలాగరా దేవుడా అనుకుంటూ, "నా చెల్లెలండీ," అని చెబుతూ, చెయ్యిపుచ్చుని లాక్కెళ్లింది లోపలికి.

జూనియర్ వసంతమా! భేష్ బాగానేవుంది" అని కళ్ళు ఎగరేశాడు. అదంతా రసికత్వమేనని ఆయనభావం.

వసంతానికి చిరాకుపుట్టుకొస్తోంది ఒకవంక లోలోపల అసూయ దహిస్తూవుంటే ఎటూ ఏమీ చెప్పలేక సతమత మౌతూంది. శాస్త్రిగారికి తమలపాకులకి సున్నం రాసి ఇస్తూ, "దానికీ నెల వెళ్ళగానే పెళ్ళండీ. దానిదారిన అది పోతుంది. ఎవారంలో కొచ్చేది కాదులెండి" అంది వసంతం.

"అలాగునా! పెళ్ళి చేస్తున్నావా చెల్లెలికి! మంచిదే! కాని ... చేతులారా సంపాదన పోగొట్టుకుంటున్నావన్నమాట!" అన్నారు శాస్త్రిగారు, ఆమె ముఖంలోకి చూస్తూ.

వసంతానికి మండేసుకొస్తోంది. ఇలాటి మాటలు చెప్పే, తనను, పాడుచేశారు ఇలాటి పెద్దమనుషులు. కాని, బైటకి అనలేక పోతోంది.

శాస్త్రిగారు కొన్నేపు ఆలోచించి ఇలా అన్నారు. "ఇటు చూడువసంతం. నీకు పిచ్చిగాని, పెళ్ళిచెయ్యటానికింకా నెల వుందిగా! నేను తలిస్తే, వందలకైనా జంకను! నీకు తెలుసుగదా! ఒకసారి ఆ అమ్మాయిని..." ఆగాడు శాస్త్రిగారు తమలపాకులు నములుతూ.

వసంతం, "పోనిద్దురూ! ఏమీ తెలియని మాలోకం అది. తమబోటి రసికులకి తగదు" అంది లాలనగా, మరిపించాలని ప్రయత్నిస్తూ.

శాస్త్రిగారు సామాన్యులుగాదు. డబ్బు ఎంత పనైనా చేస్తుందని బాగా తెలిసినవాడు.

ఇటు చూడు వసంతం, నేను నీ మంచికీ ఆ అమ్మాయి మంచికే చెబుతున్నాను. ఓ రెండొందలుంటే రేపు పెళ్ళికి ఎంతయినా వుపయోగిస్తాయి. చీరెలూ రవికెలూ చెవులకు దుద్దులూ—ఎన్నైనానూ! నే చెప్పేదేమిటి? అయినా, ఈ వ్యవహారం రెండో వాడికి తెలియనిస్తామా! పెళ్ళికేమీ ఆటంకం వుండబోదులే" అన్నాడు.

వసంతం మనసులో దౌర్బల్యం ఎక్కడవుందో శాస్త్రిగారు చక్కగా అంచనావేశాడు. అయినా ఇంకా కొన్ని బాణాలు తగిల్తేగాని పని పూర్తిగాదు.

"ఎందుకొచ్చిందిలెండి అదొక మొండిప్రాణి. దాన్నొప్పించటం నాతరంగాదు" అంది వసంతం. ఆమె ఒక అడుగు జారింది. శాస్త్రిగారికి పట్టుచిక్కింది.

బైట వర్షం జోరుగా కురుస్తోంది రాత్రి పది దాటింది. ఇదే సమయానికి వరదరాజు వేరే ఎక్కడా వీలులేక తిరిగివచ్చి వసారాలో కింద తుండుగుడ్డ పరుచుకుని పడుకున్నాడు. వసారా, ఆ చివర ముసలమ్మా రత్తమ్మా పడుకుని నిద్రలో మునిగివున్నారు. వరదరాజు వాళ్ళకి నిద్రాభంగం కలుగుతుందేమోనని మెల్లిగా, నేల తుండుగుడ్డతో గులిపి పడుకున్నాడు. అతను పడుకున్నచోటికి పైనే వసకగది కిటికీవుంది. కిటికీ పై రెక్కలు సగం తెరిచివు



పుష్పాపచయము —చిత్రకారుడు: ఎ. వి. ఆర్. యస్. జోస్యులు.

న్నాయి. తగ్గించిన టేబిల్‌లాంప్ వెలుగు మసక మసగ్గా కిటికీ చువ్వలగుండా, ఎదురుగా కాంపౌండు గోడమీద పడుతోంది.

వరదరాజుకి లోపల శాస్త్రిగారూ వసంతం ఏం మాట్లాడుతున్నారో తెలుసుకోవాలన్న కోర్కె ఏమీలేదు. కాని యథాలాపంగా వర్షపుధారల జోరుశబ్దం మధ్యనించి, కొద్ది కొద్దిగా మాటలు వినిపిస్తున్నాయి. వరదరాజుకి తనకి తెలియకుండానే కొంత ఆసక్తి కలిగింది. నిశ్శబ్దంగా పడుకున్నవాడల్లా, లేచి కూర్చుని వినసాగాడు.

“దాన్నొప్పించటం కష్టమండి! ఏంగో వొట్టి తెలివితక్కువ పిల్ల!”

“ఆ మాటలు చెప్పకు! మొట్టమొదట కొంచెం బెరుగ్గావుంటే మాట నిజమేలే. కాని డబ్బు చూస్తే...ఆ బెరుకూ, తిక్కా వదిలిపోతాయి” శాస్త్రిగారు నవ్వారు.

వరదరాజుకి అర్థమైంది. అతని కిదంతా అయోమయంగా వుంది. ఏమిటిది? రత్తమ్మనిసరించేనా?......వరదరాజుకి కూడా అసూయ కలిగింది. అతను పక్కకి తిరిగి రత్తమ్మకేసి చూశాడు. వీధి దీపపు వెలుగులో మసగ్గా అనుపిస్తోంది. ఆమె అమాయకంగా పక్కకి వొత్తిగిలి పడుకునివుంది.

వరదరాజుకి చెడ్డ తలంపుల మధ్య, మంచి తలంపు కూడా పైకొచ్చింది. ఏదో పెళ్ళంటున్నారు! అమాయకురాలు! ఆమెని శాస్త్రిగారికి బలి ఇవ్వటమేగా ఈ ఆలోచనల పర్యవసానం! వసంతం పైకి మాట్లాడ్డమేనా! తీరా డబ్బుదగ్గర కొచ్చేప్పటికి మెత్తబడ్డదే! దాని బతుకే అంత! అనుకున్నాడు వరదరాజు.

వరదరాజు మెల్లిగా లేచి కిటికీ చువ్వల్లోనుండా లోపలికి చూశాడు. శాస్త్రిగారు గోడకి వేళ్ళాడుతున్న లాల్చీ జేబులోంచి వంద కాయితమో, పది కాయితమో తెలీదు, తీసి, పట్టెమంచంమీద కూర్చునివున్న వసంతానికిస్తూ, “ఏదో రేపో ఎల్లుండో సరిచెయ్యి” అనటం, సన్నని తెరనుండా నీడగా కనిపించింది. వరదరాజుకి రక్తం వుడుకెత్తింది. ఆ క్షణానే లోపలికి దూకి ఆ ఇద్దరి గొంతుకలూ నులిమి రత్తమ్మని రక్షిద్దామనిపించింది. కాని! వీలు!

ఉగాది రవికి వలపు పిలుపు

ఫొటో: రాళ్లబండి వెంకటసూర్యనారాయణ—రాజమండ్రి.



అతను తిరిగి కూర్చుని ఆలోచించసాగాడు.

రేపో ఎల్లుండో అంటున్నారుగా! రత్తమ్మ ఈ వ్యవహారాని కొప్పుకోదు. శాస్త్రిగార్ని బలవంతం చెయ్యకమానదు. అట్లాం టప్పుడు మనం వుంటే...

వరదరాజు ఆలోచిస్తూ గోడకి జేరగిలబడ్డాడు. వర్షం జోరుగా కురుస్తోంది. వరండా చివర పడుకున్న రత్తిమ్మ కుడివేపుకి దొర్లి పడుకోవడం, వర్షపు ధారలగుండా చిందిపడుతున్న వీధి దీపపు కాంతిలో వరదరాజుకి కనిపించింది.

19

తెనాలి నెళ్ళే ఉదయపు బండిఎక్కి కూచుని సదానందం ఊహా లోకంలో పడ్డాడు. ప్లాట్ ఫారం మీది రద్దీగానీ, జనసందడి గానీ అతనికి వినిపించడంలేదు. బ్రహ్మానందంలాగా, తనుకూడా ఇవ్వాళ కాకపోతే ఇంకోనెలకి కాలేజీ మానెయ్యవల్సి వస్తుం దేమో! అతనికి కాలేజీలో చదువు మానేస్తున్నందుకు కాదు విచారం. కాలేజీలో చదవటానికి వీల్లేని ఆర్థికస్థితికి భయం.

సన్నని తుంపర రాలుగోంది బైట. ఆకాశం మబ్బులు కమ్మి చల్లగా వుంది. బండి బయల్దేరేసరికి ఆరుగంటలయింది. అద్దాల తలు పులు మూసి లోపలకూర్చున్నారు ప్రయాణీకులు. వర్షం ముదిరి పోతోంది అంతకంతకీ.

సదానందం మనస్సులోకూడా తుపానులాగా ఆలోచనలు లేస్తున్నాయి. ఎంత శ్రమపడుతున్నా, ఈ కాపురాలు ఇలా రోజురోజుకీ, దిగనాసిల్లి పోవడానికి కారణం అనూహ్యంగా వుంది. సదానందం, ఆలోచనలు మానేసి అద్దాల కిటికీమీద పడు తోన్న వర్షపు చినుకుల ధారలగుండా బైట ప్రకృతిని చూస్తు న్నాడు. రైలుపెట్టెలలో జనం ఏమిటేమిటో మాట్లాడుకుంటున్న మాటలు వానతోకలిసి హోరుమని వినిపిస్తున్నాయి.

ఇలాంటి నిరామయమైన స్థితిలోనే సదానందం తెనాలి స్టేషన్లో దిగాడు. అప్పటికి ఏడుగంటలయింది. వర్షం కొంచెం వెలిసింది. రోడ్లన్నీ బురదమయం. ప్రకృతి తెలాతెలా పోతోంది.

సదానందం సైకిల్ రిక్షాఎక్కి శేషాద్రిరావుగారింటిదగ్గర దిగి, గడపదగ్గరే పదినిమిషాలు నిలబడ్డాడు ఆలోచిస్తూ. ఇంతలోనే రెడ్డి కుర్రాడు బయటకి వచ్చాడు.

"అబ్బీ! ప్లీడరుగారున్నారా?" అని అడిగాడు ఆ కుర్రాణ్ణి సదానందం.

జగానికిదే మేలుకొలుపు

ఫొటో : టి. శ్రీరామమూర్తి—విజయవాడ.



ఉపన్యాసాలు ★

"లేరండి! మదరాసు వెళ్ళారు. చిన్నబాబుగారూ వాళ్ళూ ఉన్నారు" అన్నాడు కుర్రాడు. ఈయన ఎవరా అని గుర్తుపట్టటానికి ప్రయత్నిస్తూ.

"మీ చినబాబుగారితో చెప్పు బెజవాడనించి మీ బావగారొచ్చారని" రెడ్డికుర్రాడు తలవూపి లోపలికి పరిగెత్తాడు.

ఐదు నిమిషాలకల్లా, జానకమ్మగారు బైటికి వచ్చింది. "లోపలికి రా నాయనా! అక్కడే నిలబడ్డావేం, రా. ఏమేవ్ అమ్మాయి! కాళ్ళుకడుక్కోడానికి నీళ్ళుతే" అంటూ లోపలికి దారితీసింది.

రమణమ్మ చెంబుతో నీళ్ళుతెచ్చి వరండాలో పక్కగా పెట్టి

చివ్వున పక్కకి తప్పుకుంది. త్రయంబకరావు ఇంకా లేవలేదల్లే వుంది. సదానందం కాళ్ళుకడుక్కుని హాల్లో కుర్చీలో కూర్చుని చుట్టూ చూశాడు. ఎంత సిరిసంపద తులతూగుతోం దిక్కడ! అయినా ఇంకా ఆశ వొదల్లు వీళ్ళకి...

జానకమ్మగారు, కాఫీ గ్లాసుతో తెచ్చి సదానందానికిస్తూ, "అబ్బాయి లేచాడులే. వస్తున్నాడు. నాన్నా, అమ్మా కులాసా?" అని అడిగింది.

"అంతా కులాసాగానే వున్నారండి. మామయ్యగారు వూళ్ళోలేరా?"

"ఏదో పనిమీద మద్రాసు వెళ్లారు. రెండురోజుల్లో వస్తారు. ఎన్నడూ ఇల్లుకదలని వాడివి ఇలా బయల్దేరావు?"

"మరేంలేదు. రేపు వొచ్చే శ్రావణ బహుళ పంచమి రోజు బాగుందిట......"......అంటున్నాడు—సదానందం.

జానకమ్మగారు, "అదా, సరేలే నాయనా. పైకం పంపించారా, మీ నాన్నగారు?..." అని అడిగింది, నిర్మొగమాటంగా.

సదానందం, వొచ్చే ఆగ్రహాన్ని తండ్రిమొగాన్ని తల్చుకుని అణుచుకుంటూ "ముహూర్తంనాడే ఇచ్చేస్తానని చెప్పమన్నారండి" అంటూ జేబులోనించి, ముహూర్తపత్రికతీసి, ఆమె చేతికిచ్చాడు. ఈ సంభాషణ ఆలకిస్తున్న రమణమ్మ తల్లివంక కోపంగా చూస్తూ, మెటికలు విరిచింది.

ఇదే సమయాన త్రయంబకరావు మేడమీదినించి నిద్ర మొహంలో ఆవలిస్తూ కిందికి దిగివచ్చాడు. రావటం రావటం సూటిగా సదానందాన్ని చూశాడు. "ఏమోయ్ బావా! ఎప్పుడూ రావటం!" అని పలకరించి, "ఇప్పుడే వొస్తావుండు" అని పెరట్లోకి వెళ్ళాడు.

సదానందం, బావగార్ని ఆయన నడకని చిత్రంగా చూస్తున్నాడు. పెళ్ళప్పటికంటె చాలా లావెక్కాడే! అవును మరి! దిగులా చింతా! ఏమౌతుంది, తినేదంతా,...

జానకమ్మగారిచ్చిన కాఫీ ఒక్క గుక్కలో నోట్లో పోసుకుని కూర్చున్నాడు సదానందం. త్రయంబకరావు మొహం కడుక్కుని టాయిలెట్ ఐ వచ్చాడు.

"ఏమోయ్ బావా! చాలా కాలానికి వచ్చావు తెనాలి! చదువుతున్నావు గదూ" అంటూ సదానందం పక్కన ఇంకో కుర్చీలో కూర్చున్నాడు. "అమ్మా, మా ఇద్దరికీ టిఫిన్ పట్రా!" అన్నాడు. సదానందం, "నాకు ఆకల్లేదండి" అంటున్నాడు.

వరండా దిగువన, సన్నని తుంపర పడుతోంది. చల్లని గాలి వీస్తోంది, రకరకాల వాసనల్ని, శబ్దాల్ని మోసుకొస్తూ. మబ్బులు దట్టంగా పట్టి వాతావరణం దిగులుగా వుంది. సదానందం మనస్సు ఏదో చిత్రించాలని కాబోలు తపిస్తోంది.

"బావా! మేడమీద నీ గదికి వెళ్దామోయ్, నాకు కాస్త రాసుకోవాల్సిన పనొచ్చింది" అన్నాడు సదానందం, బావగార్ని చూస్తూ.

"అలాగే పోదాం!......" అంటూ వంటింటివేపు చూసి, "అక్కయ్యా, టిఫిన్ మేడమీదికి పట్రా!" అని కేకేసి బయల్దేరారు. త్రయంబకరావు విశాలమైన గదిలో ఒకరికి అభిముఖంగా ఒకరు కూర్చున్నారు.

త్రయంబకరావు సదానందంవేపు ఆశ్చర్యంగా చూస్తున్నాడు. సన్నగా చురుగ్గా, వున్నాడితను! తన భార్య అచ్చు ఇలాగే వుంటుంది, ఇద్దరిలోనూ తేడా లేదు పోలికల్లో...

"ఏం బావా! ఇంట్లో అందరూ కులాసా? అన్నాడు" అతను. "ఓ! అంతా కులాసాగానే వున్నారు బావా! మా చెల్లెలు మాత్రం నీకోసం బెంగపెట్టుకుందోయ్! ఒక్కసారి వొచ్చి చూసి పోకూడదా!" అన్నాడు సదానందం, జేబులో పుస్తకం పెన్సిలు బైటికి తీస్తూ.



ధూమజ్యోతిస్స లిలమరుతాం

ఫోటో : ఎమ్. బలరాంచెట్టి, మదనపల్లి.

"అఁ! రావాలీ అనుకుంటాను. కాని పడదు. పెద్దలచాటు వాళ్ళము! ఏమిటో" అంటూ నసిగాడు త్రయంబకరావు.

"అదీ నిజమేలే" అంటూనే, సదానందం, త్రయంబకరావు రూపాన్ని పెన్సిల్ స్కెచ్ వేశాడు, కార్టూన్‌లాగా. త్రయంబకరావు, "అదేమిటోయ్ బావా! వొచ్చినవాడివి మాట్లాడకండా బొమ్మ వేస్తున్నావు!" అంటూ లేచి ఏం బొమ్మో చూస్తున్నాడు వెనకాల నిలబడి. చూసినవాడు విరగబడి నవ్వాడు. సదానందం వీపు చరిచాడు ఆ ఆనందంలో.

ఇంతలో రమణమ్మ రెండు వెండి ప్లేట్లలో ఉప్మా పట్టుకొచ్చి గదిలో పెట్టి, కొంచెం సిగ్గో, నమ్రతో తెలియని మెల్లని స్వరంలో, "బాబూ, జయ, అత్తయ్య, మామయ్య కులాసాగా వున్నారా" అని అడిగింది, సదానందం వేపు చూస్తూ.

"అంతా కులాసాయే వదినా!" అన్నాడు సదానందం, ఆమె వేపు చూస్తూ.

రమణమ్మ గడప ఇవతల నిలబడి, "ముహూర్తం ఎప్పుడన్నావు?" అని అడిగింది.

"శ్రావణ బహుళ పంచమి..." అంటున్నాడు సదానందం!

"శ్రావణ బహుళపంచమి?..." అంటూ త్రయంబకరావు ఉప్మా ప్లేటు ఖాళీచేసి, "తినవోయ్ బావా! తెల్లారి వొర్తి కాఫీ తాగినట్టున్నావు?" అన్నాడు. అతనిలో తన భార్యనిగురించిన ఏవో ఊహలూ ఆసక్తీ పెరుగుతున్నాయ్.

సదానందంగూడా ఉప్మా తింటూ బావగారితో మాట్లాడసాగాడు, తనేసిన బొమ్మ చింపేసి. (ఇంకా వుంది)

తెరచిన తలుపులు

సుబ్బారావు నిద్రలేచేసరికి చంద్రశేఖరం సూట్‌కేసు సర్దుకుంటున్నాడు. అప్పటికే సూట్‌కేసు బాగా తిన్నవాడి పొట్టలా ముందుకువచ్చి ఇక పట్టదని కండ్లు తేలవేస్తూంది, కానీ అందులోకి వెళ్ళాల్సిన మూడు డజన్ల బత్తాయిలు, మందు సీసాలు అల్లాగే పడిఉన్నవి. చంద్రశేఖరం వాటితో యించు మించు కుస్తీ పడుతున్నాడు. సుబ్బారావు పక్కమీద స్థిరమైనతాపున కూర్చొని సిగరెట్ అంటించి వినోదం చూస్తున్నాడు.

చంద్రశేఖరం మళ్ళీ అన్నీ ఒక్కొక్కటి తీసి కింద పెట్టాడు ఈమాటు బత్తాకాయలు ముందు సూట్‌కేసులో పెడుతున్నాడు.

'పండ్లు నలిగి పోతవోయ్'

"ఎల్లా యిక్కన్నీ పట్టడంలేదే?" చాలా నిరుత్సాహంగా అన్నాడు చంద్రశేఖరం.

'కాలేజిలో లెఖలు చెప్తావు ఈమాత్రం పట్టించలేవూ'

"అందుకూ యిందుకూ ఏమి సంబంధం? అయినా నేను ఇంజనీరింగ్ చదివిరాలేదు. కానీ నీవు చెయ్యి చేసుకోరాదూ?"

సుబ్బారావు కార్యరంగంలోకి దుమికాడు. ముందు పొట్లాలు పెట్టాడు. వాటిమీద పండ్లు పేర్చాడు. సూట్‌కేసేమో నిండుకపోయిందికానీ ఈ మాటు పెట్టాల్సినది అమాంతంగా రెండింతలు పెరిగి ఊరుకుంది. ఒక్కసారి ఘట్టిగా దమ్ములాగి సిగరెట్ పారవేశాడు సుబ్బారావు.

"ఈమందు సీసాలు బాంబు జేబీలో పెట్టుకోలేవూ"

'అల్లాగే'

బయట బస్ వచ్చి ఆగిన చప్పుడయింది. 'సార్' అంటూ పెద్దకేక ఆ డాల బూట్లు శబ్దంచేసుకుంటూ కండక్టరు వచ్చాడు.

'మూడు రహీమ్ ఇవ్వి పట్టడంలేదే'

'మా కూరలసంచీ ఉండాది దాందులో పోస్తారా సార్'

ముత్తమిమ్మీద ఇద్దరు కాలేజి లెక్చరర్లను సతమతం చేస్తున్న విషయం కండక్టరు రాకడంతో చాలా తేలిక అయిపోయింది. సుబ్బారావు దగ్గర సెలవు తీసికొని చంద్రశేఖరం బస్సులో ఎక్కి కూర్చున్నాడు. బస్సు పెద్దగా మూలుగుతూ భారంగా కదలింది.

సుబ్బారావు తనలో తానే బిగ్గరగా నవ్వుకున్నాడు, పెండ్లయినవాడను కూర్చి జాలిపడుతున్నట్టు. అతని నవ్వులో పెండ్లయితే విడో విడరాని బంధాలు బిగించుకపోయ్యేట్టూ, వాటికి తాను చాలా దూరంగా ఉండి స్వేచ్ఛ అనుభవిస్తున్నట్లు

'భార్గవ'

స్ఫురిస్తుంది. తర్కంచెప్పే సుబ్బారావు బుద్దికి చంద్రశేఖరం విషయం అగమ్యగోచరమయ్యేది ఎప్పుడూ ఎడతెగని ఆలోచనలతో తల మునకలవుతున్న చంద్రశేఖర మొక పజిలయ్యాడు సుబ్బారావుకు. దాంతో ఎన్నిమార్లు ఓడిపోతున్నా గడినీ మామూదులాగా మళ్లీ షవాలు చేస్తూనే ఉన్నాడు.

చంద్రశేఖరానికి గంటకంటే ఎక్కువ పట్టదు వాంప్రహోరు చేరేందుకు. అతనికి అదే యుగాలుగా మారి బాధపెట్టేది తన ఇంటిముందునుంచి బస్సు వెళుతుంది. ఆబస్సువాండ్లు బాగా తెలిసిన కారణంవల్ల సరాసరి ఇంటిముందే ఆపేస్తారు.

సూట్‌కేసుతో దిగిపోతున్న చంద్రశేఖరాన్ని కండక్టరు ఆపి చిల్లరఎంచి చేతులో పోశాడు. ఎంత యిచ్చాడో అతను ఎంచుకోలేదు. ఎంచుకునే అవకాశం అప్పుడూ కలుగదు. డాబా ముంగిట నే చెల్లెలు సుజాత ఎదురైంది.

'ఎల్లాఉంది సుజాతా నాన్నకు' అని పలుకరించి ఆమె సమాధానాని కెదురుచూడకుండానే లోపలికి పరుగు తీశాడు. అట్లా తన అన్నయ్య ప్రతిసారీ చేస్తున్నందువల్ల సుజాత అంతగా ఆశ్చర్యపోలేదు. అతన్ని సుజాత అనుసరించింది.

క్షయలాంటి పెద్దరోగాలు మధ్యతరగతి కుటుంబాలమీద అవ్యాజకరుణ చూపాయంటే ఆకరుణా సముద్రంలో బడి దారి గానక ఎట్లా కొట్టుకులాడుతారో చెప్పడం అవసరంలేదు. నిజంగా బాధపడేది ఆరోగి కాదు. అతనికి రోగబాధ తప్ప మరిఅంత బాధ మరేవిషయంలోనూ ఉండదు. మిగతా యింటిల్లపాది అన్ని పోష్టికరాలూ లాంగి సతమతమవ్వాలి. వారిలంకెలో చాలాభాగం అతడే తినేస్తాడు. వీరి సంతోషాన్ని విలాసాలనీ అన్నింటినీ పూరసగా ఆ చేస్తాడు. అడివిలో ఎక్కడో నిప్పుకణం పడి అడివినంతా దగ్ధం చేసినట్టు ఆకుటుంబమంతా అతని రోగంవల్ల దహింపబడాలి!

చంద్రశేఖరం తండ్రి క్షయరోగి. ఒకవిధంగా అతనికావ్యాధి రావడానికి కారణం తనేనని చంద్రశేఖరంలో బలమైన అనుమానం ఉంటూ ఉండేది. చంద్రశేఖరం బియ్యే అయిపోయాక ఎక్కడో ఉద్యోగం చేసకోమని తండ్రి హనుమంతయ్య చాలాదూరం చెప్పాడు. చంద్రశేఖరం ఆ సలహాను ఖాతరు చెయ్యలేదు. ఎమ్. ఏ. చదవాలనే తృష్ణ అతనిలో సమృద్ధిగా ఉండేది. తనేం చేయాల్సింది నిర్ణయించుకోని రోజుల్లో అనివార్యమైన లెఖల్లో గట్టెక్కిన ఎవరో మిత్రుడు మాట వరసకి 'ఇంతబాగా లెఖలు చదివారే మీరెందుకు ఎమ్ ఏ. పాసుచెయ్యకూడదు' అని అన్నాడు. అది అతనికి తెలియకుండానే ప్రత్యేకస్థానాన్ని హృదయంలో ఆక్రమించుక కూర్చుంది అలాంటి ఆశ ఉందని అతనికే తెలీదు. బి. ఏ. లో ఎప్పుడైతే క్లాసు వచ్చిందో అప్పుడే నన్ను చూడమంటూ కండ్లయెదుట స్పష్టమైన స్వరూపంతో నుంచుంది. దాన్ని వదుల్చుకోలేక పోయ్యాడు.

తండ్రిలో అన్నీ చెప్పాడు. హనుమంతయ్య దీనంగా పలు విధాలుగా తన అసమర్థత చెప్పాడు. చివరకు తల్లిచేత కూడా చెప్పించాడు. అగ ఎక రా వా గా ఉంటున్న ఇల్లూ తప్ప మరే ఆస్తిపాస్తి గృహస్థు తనకోసం ఇంకొకరి ... వించ లేదనికూడా చెప్పాడు. అది కాకుండా పదహారేండ్ల ... సుజాత పెండ్లి త్వరలో ముగించుకోవాలని ప్రతిమ

గాడాడు. ఇట్లా తండ్రిచెప్తున్న విష యాలు నిజంగా చంద్రశేఖరం లక్ష్యపెట లేదు. రెండేండ్లు పొయ్యాక సుజాతపెండ్లి తను చెయ్యగలనని సముదాయింప బోయ్యాడు. ఇంతా తను కష్టపడి చదివించి నప్పటికీ అతని చివరి కోరిక తీర్చకుంటే జీవితాంతం అతడు వాపోతాడని హనుమం తయ్య చివరకు ఇష్టపడి పంపాడు. కూతురు పెండ్లికొరకు దాస్తున్న వయ్యిగూపాయలు చంద్రశేఖరం చేతులో కుమ్మరించాడు. సంతోషంతో ఉజ్వలమైన కొడుకుముఖం చూసి హనుమంతయ్య ఆనందాశ్రువులు రాల్చాడు. అరఎకరా మాగాణి గూడా అమ్మడు పోయింది ఆ సంవత్సరంపూర్తి చేసుకొని చంద్రశేఖరం తిరిగి యింటికి వచ్చాడు. మాగాణి అమ్మిన తాలూకు డబ్బులో నాలుగొందలు మాత్రం మిగి లాయి. రెండోసంవత్సరం అయిపోవా లంటే అదికాక అంతకు మూడింతలు అవసరం కావాల్సి ఉంటుంది. తన చాలీ చాలని జీతం తిండికి సరిపోతుంది. అందులో ఏమీ మిగలదు. హనుమం తయ్యకు ఇల్లు పోకపెట్టడం ఇష్టంలేదు.

కాలం గిఱ్ఱున తిరిగింది. వెనుకటి ఆకులు ముందుకువచ్చాయి, ముందాకులు, వెనక్కు నిష్క్రమించాయి. ఆ నాలు గొందలతో చంద్రశేఖరం కాలేజికి వెళ్లిపోయ్యాడు. రెండు నెలవరకు దిగులేదు హనుమంతయ్య ట్యూషన్లు ఏనాడో వదలివేసినవే మళ్ళీ కుదుర్చుకున్నాడు ప్రొద్దున ఎనిమిదింటికి వెళ్ళి ఆడపిల్లలకు చెప్పివస్తాడు. మళ్ళీబడికి పోవటం తిరిగి రాత్రి ఎనిమిదినుండి మొగ పిల్లలు ఇంటికివసారు వాండ్లతో రెండు మూడు గంటలు గడచిపోతవి. ఈ ట్యూషన్లు అతనికి నూటవిభైకి తక్కువ లేకుండా సంపాదించి పెడుతున్నవి.

సగం పండిపోయిన అతను అంతకష్టానికి తాళుకోలేక పొయ్యాడు. కానీ తప్పదు. ఈ సంవత్సరమేనని అతని తాపత్రయం! దూరాన ఏదో చక్కని వెలుగు అవుపడు తూంది అది మెల్లగా తనదగ్గరకే వస్తూంది.

బళ్ళు మళ్ళీ మూశారు హనుమంతయ్య గారి ఆరోగ్యం ఒక్కమాటుగా పాడై పోయింది. అట్లా చెడిపోయిన ఆరోగ్యం తిన్నగా క్షయలోకి లాక్కుపోయింది!

ఇట్లా కావడానికి తనే కారణమని చంద్రశేఖరం అను కుంటాడు. నిజంగా కర్తలెవరు? జవాబుకు గీతలను తిరగ వెయ్యాలి. ఉడుకురక్తం గీతల జోలికి వెళ్ళడం లేదు.

అదృష్టంబాగుండి చంద్రశేఖరం మంచి మార్కులతో పాసయినాడు. అతను చది విన కాలేజీలోనే ఉద్యోగం కుదిరింది.

'ఎట్లావుంది నాన్నా?'

'వచ్చావా నాయనా! కా కూర్చో'

సుజాత తన తల్లితో అక్కడకువచ్చింది.

'వారిమందు తెచ్చావా చంద్రా!'

'ఆఁ తెచ్చానమ్మా! ఇంద సుజాతా' అని అందాకా మోస్తున్న సూట్ కేసు అందిం చాడు.

'తే నాయనా అన్నంతిని పోస్తువుగాని' అంది తల్లి!

అడుగులో అడుగు వేసుకుంటూ జ్ఞాప కానికి వస్తున్న పాతవిషయాలు యత్న పూర్వకంగా నెట్టేస్తూ నడుస్తున్నాడు. తల్లి పీటవేసి అన్నం పెట్టింది.

'మీ నాన్న దగ్గర ఉండమ్మా, అన్నయ్య వచ్చేదాకా' అని సుజాతను పంపింది తల్లి.

దిన దినానికి తండ్రిజబ్బు ముదురు పాకంలో పడుతోంది. సుజాతకు పెం డ్లీడు దాటిపోతూంది. ఈ రెండూ రెండు శూలాల్లాగా తల్లిహృదయాన్ని చీల్చి వేస్తున్నవి. దీనికితోడు ఇంట్లో విజృం భిస్తున్న దారిద్ర్యం. ముమ్మొనలతో తల్లిని రాపాడుతున్న విషసమస్యలు. ఇ కూ కా సుజాతను రాకుండా దూరంగా ఉం చిందిగూడా, ఈ ప్రస్తావన తెచ్చేందు కేమో? ఆమె కల్లా జవాబు చెప్పి మండుకపోతుంటే గుండెల్లోని అగ్నిని తాను చల్లార్చగలడు? మూడగ్నుల మధ్య తల్లి చేస్తున్న ఈ తపస్సుకు అంతం ఎప్పుడు? అసలే మలహీనురాలైన తల్లి ఈ తీరని వేదనల్లో కుర్రకుంగి పోతూంది. ఈ దుర్భర పరిస్థితుల్లో తనేం చేయలేడా నిజంగా? ఇట్లా ఎంతకాలమో నిలువలేదు. అప్పుడు తనగతి! సుజాతగతి!

చంద్రశేఖరం అన్నం కలుపుతు కూ ఉన్నాడు. ప్రక్కనే ఉన్న కూర కలుపు కోవాలని తోచలేదు. నిశ్చలంగా ఏదో



★ తెరచిన తలుపులు ★

అవ్యక్తమైన ఆలోచనల్లో మునిగి తేలుతున్న తనకుమారుణ్ణి చూస్తూ నెయ్యిచిట్టితో అట్లాగే నుంచుండి పోయింది ఆమె!

'నీవెందుకు నాయనా అట్లా బాధపడతావు?

'ఏం లేదమ్మా'


"నీఆరోగ్యం కాపాడుకో చంద్రా! అక్కడ వాగివాగి వచ్చి యిట్లాంటిసమయాల్లోకూడా ఈ తెంపులేని ఆలోచనలతో మునిగితేలుతూంటే నీఆరోగ్యం చెడిపోతుందిరా"

ఆ ఉద్యోగంమీద తల్లికి సుతరామూ యిష్టమే లేదు. అట్లా అస్తమానము వాగినందుచేత నే తనతండ్రి అల్లా తయారయ్యాడని ఆమె అనుమానం!

'నవ్వనుకు నేంత కష్టమేమీ అక్కడ లేదమ్మా'

'అదిసరే నాయనా' కొంచెంసేపు ఆగింది.' ఇల్లెక్కడనైనా పోకపెట్టి సుజాతను చాలా తొందరలో వదల్చుకోవాలి నాయనా! మీనాన్నకు అదే పెద్ద విచారంగావుంది. అదికాస్తా అయిపోతే నిశ్చబ్దంగా ఉంటారు. అల్లాఉంటే యింతగా విసమించదు నాయనా జబ్బుగూడా,

'నాన్నకు ఇల్లంటే చాలా యిష్టం



కెరటాలపై తరణి
కిరణాలత్రోవ
నేదూర తీరమున
కేగునో నావ?

—ఫొటో : పి. రామారావు, రాజమండ్రి.

గాదమ్మా! ప్రావిడెంట్ ఫండుతో కట్టిం చాననీ తన కష్టార్జితమనీ.'

'అల్లాఅని ఊరుకుంటే మరీపరిస్థితులు విషమించగలవు. చేతులుకాలాక అకులు పట్టుకోవడమేమంత మంచిది చంద్రా! పోనీవారికి తెలీకుండా చేసేందుకు వీల్లేదా?'

'ఆయన చేవ్రాలుండాలి కొడమ్మా'

'హుఁ సరే' ఈమాటతో తల్లిముఖం వివర్ణమై పోయింది. ఆమెహృదయంలో పెద్ద గాయమే అయింది. సజల నేత్రాలు తనకు చూపించడ మిష్టంలేక దొడ్లోకి వెళ్లి పోయింది.

చంద్రశేఖరానికి అన్నం మరి సహించ లేదు. ప్రక్కనఉండే మజ్జిగ పోసుకొని వంజిలేచాడు.

'అప్పుడే లేచావా' అని మాత్రంవంది ఆమెను బాధిస్తుండే విషమయాల్లో ఇది అంత గొప్పదిగాదు. మామూలు దినాల్లో తనిలా ప్రవర్తిస్తే అరచైనా కన్నీళ్లు కార్చైనా మళ్లీ అన్నంముందు కూలేసి దగ్గరే కూర్చుని కూరి కూరి పెట్టేది. అల్లాంటి మాతృమూర్తి.. ...

'నీవు పోమ్మా నేనుంటాను'

సుజాత తనవైపు చూడకుండా వే పోతూంది.

'ఏమ్మా నామీద కోపమా'

'నీమీద ఎందుకన్నయ్యా కోపం? నీళ్ళు పొర ఆమెకండ్లను కప్పేసింది. అక్కడ నుంచి వెళ్లిపోయింది. తన మీద అందరకీ కోపముందను కుంటాడు. అందుకనే సుజాత తన్ను చూడకుండా వెళ్లిపోతుంటే అల్లా అడిగాడు.

ఇదంతా వింటున్న ముసలాయన హృద యం అంపశయ్యకోతకు ఎర అయింది. తన కుమారుని హృదయంలో చెలరేగుతున్న తుపానులెల్లా విజృంభిస్తున్నవో ఊహించు కోలేక పోలేదు.

'నీతండ్రి అంత పాషాణమూర్తిగాదు చంద్రా'

'నేనల్లా అనుకోలేదు నాన్నా'

నాజబ్బుకు నీవు కారణమని వాపోతూ అందువల్ల నిన్నందరూ నిరసిస్తున్నారని నీ వనుకుంటున్నావు కాదు? నీ వెందుకు కారణమౌతావు నాయనా! నీ వట్లా వాపో తుంటే ఎంతమంది నిన్ను చూచి విలపిస్తు న్నారో ఆలోచించు. నీవు నిశ్చింతగా ఉండు. అనుమానం పెద్ద జబ్బు నాయనా! అవ్వంతా పోనియ్ బాబూ! సుజాతకు మంచి సమ్బంధ మేదైనా వెదకునాయనా! నేను సంపాదించుకున్నదంతా నాతో తీసుక వెళుతున్నాను. మీకేమీ మిగల్చలేక పోయ్యాను నా కింకేమీ కోరికలు లేవు. ఇదొక్కటే చూసి సుఖంగా వెళ్లిపోతాను నాయ్యాత్రకు! భగవంతుడు పిలుస్తుంటే పిలుపు నేడు దూర దూరంగా విన్పిస్తూంది. అది దగ్గరకు ఒకనాడు రానేవస్తుంది. ఆరోజు వచ్చేలోగా సుజాత గృహిణికావా లని నాఆశ!" అని కండ్లు మూసుకున్నాడు. కను కొలకుల్లోంచి వెచ్చటి నీళ్లు పార్లి చెవులదాకా జారి దిండును తడిపినవి. గద్గద స్వరంతో ఏమీ చెప్పలేక చంద్రశేఖరం అవతలికి వెళ్లిపొయ్యాడు.

శ్రావణమేఘాలు బాగా ముసుక వచ్చాయి. మెఱుములు ఉరుములు ఆరం భించాయి. రవ్వగాలికొంచెం కొంచెం చెవ్వివ దూసుకుపోతున్నది. సంజె లలము కోకముందే నిబిడమైన చీకట్లు నిండాయి! తనతండ్రి గదిలో కిటకీలు వేస్తున్న చప్పు డవుతుంది. నిబిడమైన శ్రావణమేఘాల దివ్య సౌందర్యాన్ని చూస్తూ తన్మయుడౌతు న్నాడు చంద్రశేఖరం.

అప్పుడప్పుడు గాలితోవస్తున్న వాన చినుకులు తన్ను కొత్త కొత్త తడిపేసి పూర్తిగా తడిపేందుకు ఉబలాట పడు తూంది. ఒక్కసారి ఉరుములు బయలుదేరి ఎక్కడో పిడుగు పడింది. సుజాత మెల్లగా అక్కడకు వచ్చింది.

'లోపలకు రాకూడదన్నయ్యా! బాగా చలి వేస్తూంది'

'వస్తున్నా నీవు లోపలికి పదమ్మా'

మళ్లీ మెరుపు వచ్చింది. సుజాత తన్ను చూస్తుంది తను సుజాతవైపు చూస్తు న్నాడు. ఆమె కండ్లలో ఆరిపోయిన. వెలు గులు - కరడు కట్టిన కళలూ అతడు గమనిం చాడు. ఆరిపోయేముందు దీపం ఎంత జాజ్వల్యమానంగా ప్రకాశిస్తుందో అది అతనికండ్లలో సుజాత చూసింది.

సుజాతనెల్లా దుఃఖానికి దూరంచేయ డమా అని చంద్రశేఖర మాలోచిస్తున్నాడు. తన సోదరుని ఎట్లా సంతోషపరచాలో అర్థం చేసుకునేందుకు సుజాత తికమకలు పడుతూంది. మొత్తమ్మీద ఉభయులు స్వ సుఖాలను విస్మరించారు.

'రేపే కాలేజికి వెళ్లాలి కదన్నయ్యా'

'శని ఆదివారాలు అయిపొయ్యాయిగా సుజా'

పసిపిల్లలనైతే మిఠాయి పొరుతోనో, కొత్తగుడ్డల పేరుతోనో సంతోషపరచ వచ్చు. పద్దెనిమిదేండ్లుగా లోకానా కళించు కుంటున్న సుజాతనెల్లా సంతోష పరచాలి?

మాటాడేందుకు పలుకుతోడులేక మాటాడుదామన్నా మాటల్లేక తమోకోణా ల్లోంచి అవుపించని వెలుగుకోసం తపించి పొయ్యే సుజాతను మూనివేసిన చదువులో ప్రవేశపెడితే కొంచెం ఆమె మూగబాధ ఉపశమింపదూ?

'నీకన్నా పెద్దవాండ్లు కాలేజిలో చదువు కుంటున్నారు సుజా'

'అయితే..........'

'నీ కిష్టమయితే.........'

'చదవమంటావన్నయ్యా'

'అవునమ్మా! నీ వొంటరితనం కొంచెం పోతుంది.'

తెరచిన తలుపులు

'నిజమే! అమ్మ మరీ వొక్కర్తయిపోయి నాన్నతో అన్నీ పనులు ఎల్లా చేసుకోనగలదన్నాయ్'

'అమ్మఅమ్మ వాళ్లెవళ్ళనయినా రమ్మంటే——'

'వాళ్లు రారన్నయ్యా! అయినా మన వాళ్లయినారారు.

ఎక్కడో బాదరాయణ సమ్మంధం

'అయితే వీళ్ళందరూ తిని పొయ్యే వాళ్లేనా'

'పద అన్నయ్యా? ఇప్పటిదాకబుర్లెందుకు? లోపలికిపోదాం పద' అని సుజాత వెళ్ళిపోయింది.

బయట వర్షం కురుస్తూనే ఉంది. ఈ వర్షం అవిరామంగా కురిస్తే, ప్రళయం పుట్టుక రాదూ? అప్పుడు అందరూ ఏమవుతారు? ప్రళయంలో సాముదాయక మరణం! ఛీ! ఏం పాడు ఆలోచన! మరణమంటే అంత భయమెందుకు? చావునుండి ఎవళ్ళయినా తప్పుకోగలరా? మరి ఎందుకంతభయం? కండ్లు ఘట్టిగా మూసుకున్నాడు.

మళ్లీ బస్సుహారన్ వినిపిస్తూంది. కాళీ సూట్ కేసుతో బయలుదేరాడు. ముందొచ్చినప్పుడు సూట్ కేసునిండా బరువు గుండెల్లో గూడా ఏదో బరువు. ఇప్పుడు ఎక్కడా బరువు లేదుగాని హృదయంలో భయం మాత్రం కెలకరిస్తూంది. ప్రాభాత సూర్య కిరణాల్లోంచి కొంచెం కొంచెం వేడి అంతకు ముందున్న చల్లని వాతావరణాన్ని పారదోలి కాస్త ఆప్యాయతను ప్రసరిస్తూంది.

రూము చేరేసరికి సుబ్బారావు లేడు; ఎక్కడికో వెళ్లాడు, తాళంతీసి సూట్ కేసు లోపల పెట్టాడు. ప్రొద్దుటినుండి కాఫీ కూడా తాగలేదని జ్ఞప్తికి వచ్చింది. హోటల్ కు దారితీశాడు. తిన్నగా అన్ని పెద్దపెద్ద హోటళ్లు గడచి తన మామూలు చిన్న హోటల్ లో జొరబడ్డాడు. నాలుగు నెల్లనుండి ఇందులోనే కాఫీ తాగుతున్నాడు. తను చదువుకునే రోజుల్లో ఈ కాఫీకే ఎంతెంత దూరం నడిచి మంచికాఫీ అని తాగివచ్చేవాడు. తనీనాడు తాగేదిచాకబారు కాఫీ! కాఫీసుగించి మెల్లగా రోడ్డు మీదకు చేరి అక్కడే ఉన్నాడు. కాలేజి కుర్రాళ్లు తన్ను చూసి దూరంగా పోతున్నారు.

'ఇక్కడటోయ్ నీవు కాఫీ తాగేది?' సుబ్బారావు పలకరించాడు

'ఆఁ'

'ఆ సంజన్‌లో ఎట్లా ఊర్వాని తాగొచ్చివోయ్'

చంద్రశేఖరమేమీ జవాబీయ...



మన్మథాగమ ముహూర్తానికి
కొమ్మ కొమ్మా పూలపల్లకి!

— ఫోటో: కె. నామూరావు, రాజమండ్రి.

'ఇంటిదగ్గిర పిల్లోయి వాళ్లు కులాసా! అట్లా వారం వారం వెళ్లకుంటే సుఖంగా కాపరమే పెట్టియ్యలేక పోయావా?' ఇన్ని రోజులుమళ్లీ చాలా కసిగావుండే ప్రశ్న చేసి సాహసంచేసి అడిగేశాడు. చంద్రశేఖరం ముఖం కందిపోయింది. పెదవులు కొంచెం చెలించాయి. ఇదంతా గమనించకుండా సిగరెట్ నిర్విరామంగా పీలుస్తున్నాడు సుబ్బారావు.


'నీ వనుకున్నట్లు నాకు పెండ్లాముక్కడ లేదు సుబ్బారావ్, అసలు పెండ్లే కాలేదు'

'ఆఁ ఏమిటి? నీకు పెండ్లే కాలేదా' నిర్విణ్ణుడై పొయ్యాడు సుబ్బారావు.

'పొరపాటయిందోయ్ వారంవారం అట్లా తప్పకుండా వెళుతుంటే అనుకున్నానోయ్'

చేతిరుమాలతో ముఖం తుడుచుకున్నాడు సుబ్బారావు.

'అయితేఎందుకు వెళుతున్నట్లు శేఖరం'



భ్రమరకర శింజాయితమ్మౌ
కొమ్మ కొమ్మా కుసుమవల్లకీ!
—ఫోటో: ఈమని సత్యనారాయణ రెడ్డి, రాజమండ్రి.

‘మరణసంధ్యలో ఉంటున్న మాతండ్రిని చూసేందుకు సుబ్బారావ్. అక్కడికి వెళ్ళేది నా వాళ్ళతో దుఃఖంలో పాలు పంచుకునేందుగ్గాని సంతోషం పొందేందుగ్గాను. నీ వనుకునేవన్నీ నిజాలనుకోకు!’ అని పెద్ద పెద్ద అంగలతో వెళ్ళిపొయ్యాడు చంద్రశేఖరం!

సుబ్బారావు హృదయం విలవిల్లయింది. ఎంత అపార్థం చేసుకున్నాడు తను! అతనెంతగా బాధపడ్డాడో పాపం! అసలు వాళ్ళ నాన్న కేమిజబ్బో! ఎల్లాంటి విలాసాలకు ఖర్చు చేయకుండా డబ్బు దాస్తున్నాడు అందుకే కాబోలు! ఇంతవరకు అతను ఒక్క సినిమాకు వెళ్ళగా తను చూళ్ళేదు. ఏదో పుస్తకం చదువుతూ కూర్చునేవాడు. అతన్నిచూస్తే ఏదో వెలితిగా జీవిస్తున్నట్లుందిగానీ నిండుదనమే కనిపించదు. ఇల్లాంటి వ్యక్తి పట్లతను ఎంత అనాగరికంగా ప్రవర్తించాడు?

‘నన్ను క్షమించు శేఖరం– నేను చాలా’

‘ఆఁ ఫరవాలేదు లేవోయ్’ అంటూ కాలేజికి దారితీశాడు.

అట్లా వాళ్లిద్దరూ తమహృదయాలు ఒకరికొకరు తెలియ చెప్పుకునేసరికి స్నేహసౌధంలోకి రెండో అంతస్థు ఎక్కారు. చంద్రశేఖరం హృదయంలో దహించుకుపోతున్న బాధను ఎల్లా తీర్చడమో సుబ్బారావుకి అర్థం కాకుండా వుంది. చూచాయగా చంద్రశేఖరం మాటలవల్ల వాళ్ళ చెల్లిలి పెళ్ళి పెద్దసమస్యగా ఉందని సుబ్బారావుకు తేలింది! ఇప్పుడుండే పొత్తిళ్ళలో వాళ్లు అంత గొప్పగా కట్నమిచ్చి పెళ్లి చేయలేరు. నానాటికి కట్నాల రేట్లు పెరిగిపోతున్న ఈ రోజుల్లో కట్నంలేకుండా ఎవరు చేసుకుంటారు? స్నేహితుడికోసం తనీపాటి త్యాగం చేయలేడా?

తన తండ్రిని గూర్చి ఆలోచిస్తున్న శేఖరం అతని ఊహలకి అడ్డం పోలేదు. బస్సుమాత్రం వాళ్ల ఊహాలని ఆపేసింది. కొత్తకొత్తగా అనుకులేస్తూ పోతున్నాడు సుబ్బారావు. తొరతొరగా ముందుకుసాగిపోతున్నాడు చంద్రశేఖరం. గేటుదాటి చంద్రశేఖరం పంచలోనుంచోని సుబ్బారావు కొంచెం ఎదురు చూస్తున్నాడు. సుజాత అన్నకొరకు హమ్మంలోకి వచ్చింది అపరిచితవ్యక్తిని చూసి లోపలికి వెళ్ళిపోయింది. సుబ్బారావు ఆమెవెళ్ళిన దిక్కే చూస్తూ బస్సు ఆగడంచేత అసంపూర్ణంగా వొదిలేసిన ఆలోచనలు పూర్తి చేసుకుంటున్నాడు.

హాల్లో సుబ్బారావును కూర్చోపెట్టి తండ్రి గదిలోకివెళ్లి పొయ్యాడు చంద్రశేఖరం ఇందాక అవుపించిన సౌమ్యవదనం మళ్ళీ అవుపిస్తే బావుండుననుకుంటున్నాడు సుబ్బారావు.

చంద్రశేఖరం కాఫీ అందిస్తూ మా నాన్ను చూస్తావా సుబ్బారావ్’ అన్నాడు.

‘ఆఁ పోదాం’

కాఫీకప్పు క్రిందపెట్టేసి కాళ్ళకున్న బూటు విప్పి రోగిగదిలోకి ప్రవేశించాడు సుబ్బారావు. సుజాతకు ఈ అపరిచితుని దర్శనం మళ్ళీ అయింది. సుబ్బారావు పరీక్షగా ఆమె కండ్లలోకి చూశాడు. అక్కడినుండి సుజాత వెళ్ళిపోబోతూంది.

హనుమంతయ్య ‘ఉండమ్మా ఏం ఫరవా

★ తెరచిన తలుపులు ★

లేదు' అన్నాడు. సుజాత మరి వెళ్ళలేక పోయింది.

'అదికాదు నానా! మీకు మందు వేళ అయింది' అంది.

'ఇంకా ఏం మందులు సుజా! కూర్చోండి నాయనా! వారిని అట్లా కూర్చోమను చంద్రా! వీరేకదూ మీ రూమ్ మేట్! వీరు తర్కం చెబుతారన్నావ్ కదూ ఆఁ వీరి పేరు...'

'సుబ్బారావు.'

'ఆఁ....చాల సంతోషమైంది నాయనా! మిమ్మల్ని చూడ్డంచేత అన్నాడు.

ఏదో ప్రశ్న వెయ్యాలి కనుక సుబ్బారావు 'డాక్ట రేమంటాడండీ' అని అడిగాడు.

'ఇంకా కొద్దిరోజులు మాత్రమే చను రుందంటాడు.'

'నాన్నా ఏమిటి మీ వేదాంతం....'

'చూడు సుబ్బారావ్ నీవు చూడు! ఇంకా నేను.... సుజాతా పోమ్మా పో మందు తే పో!'

ఆర్ద్రమైన కండ్లను చాటుగా తుడుచుకొని వెళ్ళింది సుజాత!

'మీ రన్నీ తెలిసినవారు, మీరే ఆడవాళ్ళముందు అల్లా మాట్లాడితే వాళ్లు హడలిపోరండీ పాపం! ఆ అమ్మాయి చూడండి ఎంతగా కుమిలిపోతుందో!' అన్నాడు సుబ్బారావు.

'పొరబాటయింది నాయనా! నీవన్నది నిజమే!'

సుబ్బారావు నిశ్చయానికి రావడంలో కాలాన్ని ఏమంత దుబారా చెయ్యలేదు.

అతని నిశ్చయాన్ని విని శేఖరం రెండింతలు మనిషయ్యాడు. అతని కండ్లలో వెలుగులు స్ఫుటంగా ఉట్టిపడుతున్నవి.

శేఖరం చాలా చురుగ్గా పెండ్లి ప్రయత్నాలు ప్రారంభించాడు. ఇల్లుమీద రెండువేలు సిగల తీశాడు. సుబ్బారావుతో తాము కట్నమిచ్చే స్థితిలో లేమని ముందుగానే చెప్పిఉన్నాడు.

ఆ ఇంట్లో ఒక క్షయరోగి చావు బ్రతుకుల మధ్యదశలో పడిఉన్నాడనే విషయం అందరూ మర్చిపోయినట్లున్నారు. కామమంతయ్య కూడా ఆ విషయం విస్మరించాడు. అందరి కండ్లలోను ఓ నవ్య తేజస్సు చిలుకుతూంది కానీ దాని వెనుక ఎంత భయంకర సత్యం దాగిఉందో వాండ్లల్లో ఒకళ్ళయినా ఊహించుకునేందుకు కొన్త

యినా ప్రయత్నం చేయడంలేదు. ఏ నీలా కాశంలో పరిపూర్ణ కళలతో విరాజిల్లే చంద్రమామపైకి ఎల్లాంటి కరాళ నిబిడ మేఘాల గుంపులు పొంచి మూగివున్నాయో ఎవరికి తెలుసు?

ఆవేళ చంద్రశేఖరం పేరుతో ఓ ఉత్తరం వచ్చింది ఆ ఉత్తరం సుబ్బారావు రాశాడు. చెప్పుకోదగ్గ విషయాలు అంతగా లేవు కాని క్రియాయోగి కుటుంబంలో సమ్బంధం చేయడం వాళ్ళమ్మగారికి ఇష్టంలేదట. అట్లా వినక చేస్తే బావిలోకి ఉరుకుతుందట ఆమె! అందువల్ల ఈ విషయంలో తాను ఇంకా కొంచెం కాలం ఆలోచించుకోవాలని మాత్రమే వ్రాశాడు.

ఆ ఉత్తరం హనుమంతయ్యామీద అంతగా

తెరచిన తలుపులు

దెబ్బతీస్తుందని ఎవరూ అనుకోలేదు. ఒకొక్క ప్పుడు ఎవరూ అనుకోనివి, అనుకోలేనివి జరిగినా ఆశ్చర్యపడాల్సిన అవసరంలేదు అంతగా! క్షయరోగంతో కుస్తీపడుతున్న హనుమంతయ్య కూతురు పెండ్లి అనే ఉత్సాహం వల్ల మామూలు మనిషిలా ఉన్నాడు. అది మొదట్లో నే నాశనమయ్యేసరికి జబ్బు విజృంభించింది. దగ్గు తెరకమ్మి, కొంచెం నెత్తురు కక్కి అంతవరకూ ఉన్న ఆశను, పెండ్లి గాని కూతురునూ వదలి వెళ్ళిపోయాడు.

ఆదిలోనే హంసపాదు ఏర్పడ్డ సుజాత పెండియత్నం, భర్త హఠాన్మరణం ఈ రెండు దెబ్బలతో చంద్రశేఖరం తల్లి కూలి నేలగరచింది. హిందూసమాజంలోని ఒక మనిషికి చివరిసారి జరగాల్సిన కర్మకాండ యావత్తూ బాగా జరిగిందనే తృప్తి ఒక్కటే మిగిలిందామెకు!

ఇహ సుజాత పెండ్లిని తొందరించేవాళ్లు లేరు. అంతే ఉన్నా సుదీర్ఘమైన విరామ కాలం వచ్చిపడింది. తండ్రి చనిపోయిన క్రొత్తలో పెండ్లికూతురుగా ముస్తాబవడానికి ఏ బాలికా ఇష్టపడదు.

హఠాత్తుగా సుబ్బారావు వచ్చాడు. హనుమంతయ్యగారి మరణం తెలుసుకున్నాక చంద్రశేఖరానికి తన ముఖం చూపలేకపొయ్యాడు. అతడంతలో ఇంత విపరీతం జరుగుతుందనుకోలేదు.

'ఇట్లా జరుగుతుందని నేను అనుకోవటం లేదు చంద్రశేఖరం.'

'ఊఁ'

'చాలా దారుణమే జరిగింది.'

ఇట్లాంటి ఆదరింపుమాటలు అయినాక సుబ్బారావు తన విషయం బయటపెట్టాడు. అదివిని చంద్రశేఖరం పలకనూలేదు. ఉలకనూ లేదు. అసలా మాటలు విన్నాడనైనా అనిపించదు.

సుజాత కాఫీ తెచ్చి సుబ్బారావును చూడనైనా చూడకుండా వెళ్ళిపోతూంది.

'నీతో కొంచెం మాటాడాలి సుజాతా! దయచేసి కాస్త తీరిక చేసుకుంటావా!'

గిరుక్కున వెనక్కు తిరిగింది. సూటిగా అతని కండ్లలోకి చూసి వెంటనే తల వొంచుకుంది సుజాత!

అతని కండ్లు చాలా ఆర్ద్రంగా ఉన్నవి. "నామీద మీ కందరకూ కోపమని తెలుసు! నేను చేసింది తప్పు కాదనుకుంటాను. మోసం చేద్దామని తలంపు లేదు మన సమాజంలో అవిద్యవల్ల ఎంతెంత మూఢాభిప్రాయాలు బలంగా ఉంటవో మీకు తెలియనిది కాదు. 'క్షయ జబ్బు వారసత్వంగా వస్తుంది, రేపు నీ పిల్లలకుకూడా వస్తుంద'ని అమ్మ ఈ పెండ్లి మానమంది. ఆమెలో పాతుకపోయిన ఈ భావాన్ని పారద్రోలాలంటే కొంచెం వ్యవధి కావాలి! అదే మీకు రాశాను. నా ఉత్తరంతో ఈ విపరీతం జరుగుతుందని ఊహించుకోలేకపోయాను అదే నా తప్పు! ఆమెకు చాలమంది డాక్టరు చేత కడకు నాటువైద్యుల చేత కూడా చెప్పించాను. ఎంతో కష్టపడ్డాను— ఆమెలో పాతుకపోయిన ఆ మూఢభావాన్ని దూరంచేయాలని. ఎంతో ప్రయాసమీద ఆమె తన ఉద్దేశాన్ని నేటికి మార్చుకుంది ఇప్పుడు నాకేమీ ఫరవా లేదని ఎంతో సంతోషంతో వచ్చాను. నా సంతోషాన్ని చూసి ఏనాడో భగవంతుడు నాకు తెలీనివ్వకుండానే హరించేసి వినోదం చూస్తున్నాడని ఈనాడు తెలుసుకున్నాను సుజాతా! నీ విశాల హృదయంలో కొంచెం చోటు కావాలని నేను చాలరోజుల క్రిందనే అనుకోని, ఆ చోటు నాకొరకు నిర్దేశింపబడిందని కూడా అనుకున్నాను" తల నేలకు దింపుకున్నాడు. చంద్రశేఖరం కండ్లుమూసుకుని నిశ్చలంగా ఉన్నాడు.

"కాఫీ చల్లారిపోతూంది ముందది తాగండి! వొద్దొద్దు అది మీరు తాగలేరు, వేడిచేసి తెస్తాను" అని రెండు కప్పులూ చేతుల్లోకి తీసుకుంది సుజాత.

'చల్లబడిపోతున్న నా హృదయాన్ని కూడా వెచ్చబరుస్తావనుకుంటాను.

సుజాత నవ్వి వెళ్ళిపోయింది ఇద్దరూ మౌనంగా కూర్చున్నారు. కొంచెంసేపటికి సుజాత వేడి కాఫీతో వచ్చింది. ఆమె వెంట తల్లికూడా వచ్చింది

"మీ ఇద్దరినీ నేను హృదయపూర్వకంగా ఆశీర్వదిస్తున్నాను నాయనా! భగవంతుడు మిమ్మల్ని ఏనాడో కలిపాడు. దాన్ని ఎవ్వరూ విడదీయలేరు నాయనా! నీవేమీ సందేహపడకు" అందామె!

వాండ్లిద్దరూ ఆమెకు నమస్కరించారు! అతడు కండ్లుమూసుకొనే ఉన్నాడు!!!

★

వనితాలోకం

వనితాలోకం:

ప్రజ్ఞాచక్షువు: డాక్టర్ హెలెన్ కెల్లర్

"నీవు మూకబధిరాంధులనుగురించి వ్రాస్తావా? ఏమని వ్రాస్తావు? వాళ్ళు చక్కగా చదువుకొని ఆత్మగౌరవముతో బ్రతకాలని నా అభీష్టము. ఈమాటే వ్రాయి!" అన్నది నా చేతిని తన చెంపల కానించుకుంటూ ఈనెల 7 వ తేదీన ప్రభుత్వ మూకబధిరాంధ పాఠశాలను దర్శించటానికివచ్చిన డాక్టరు (మిస్) హెలెన్ కెల్లర్ ఎదురుగావెళ్ళి నమస్కరించిన నాతో.

ఆమె తనసహచరియైన పాలీ థామ్సను చెయ్యిపట్టుకొని లోపలికివస్తూ అందరికీ నమస్కరించింది. పాఠశాలలోని బ్రెయిల్ గ్రంథాలయాన్ని పరిశీలించింది. కష్టపడి చదువుకొని గౌరవముగా జీవించమని విద్యార్థులను హెచ్చరించింది మూకబధిరాంధులకు వృత్తివిద్యలను నేర్పు కర్మాగారాలను స్థాపించి శిక్షణపొందే విద్యార్థులకు స్వల్ప వేతనములను ఏర్పాటుచేయాలని, ఆదురదృష్టవంతులకు ప్రజలూ ప్రభుత్వమూ తగినన్ని అవకాశాలను కల్పించవలెనని ఉపన్యసించి తనపట్లచూపిన ఆదరాభిమానాలకు కృతజ్ఞతను తెలుపుతూ పాఠశాలాధికారులకు మరొకసారి నమస్కరించి తనకు వేసిన పూలహారమును మెడలోనుంచితీసి చేతికి తగిలించుకొన్నది మిస్ హెలెన్ కెల్లర్.

ఇల్లిందల సరస్వతీదేవి

ఉపన్యసించే అంతటిలో ఒక మూగ విద్యార్థి ఆమె చిత్రాన్ని పెన్సిలుతోగీసి తయారుచేశాడు. ఉపాధ్యాయులకందరికీ చూపించి ఆ చిత్రాన్ని ఆమెకు బహుమతి చేశాడు. ఆమె దానినందుకొని తడి చూసి అమితానందముతో "నా యింట్లో నేను పడుకొనే గదిలో దీనిని పెట్టుకొంటాను" అని ఆసక్తితో కరచాలనము చేసింది.

"బాహ్య స్వరూపము చేతకాక, నిజతత్వ విచారముచేత మంచి చెడ్డలను నిర్ణయించుటలో మీకు గ్రుడ్డితనము తోడ్పడ్డదా" అని నేను ప్రశ్నించగా "అవును! నేను అంధురాలను గనుక వాటి వాటి యోగ్యతనుబట్టే నిర్ణయిస్తాను" అని సమాధానమిచ్చింది.

విద్యార్జనకూ విజ్ఞాన సముపార్జనకూ మానవ సేవాసక్తికీ మానవునికి చర్మచక్షువులు అనవసరమంటుంది 78 సంవత్సరాల ముదుసలి ఆ విద్వాంసురాలు.

ఆమెను దర్శించినవారెవరూ ఆమె అంధురాలనుకోరు. కాంతిరాహిత్యమును

ప్రజ్ఞాచక్షువు : డాక్టర్ హెలెన్ కెల్లర్

కప్పిపుచ్చగలిగిన ఆ నీలిరంగు వెడదకన్నులు మనను వీక్షిస్తున్నట్లే ఉంటాయి.


'సాధనమున పనులు సమకూరు ధరలోన' అన్నట్లు 24 సంవత్సరాల అవిరళకృషి ఫలితముగా మాట్లాడగలుగుతున్నాను' అంటూ విజయోత్సాహముతో చెప్పగలుగుతున్నది మిస్ హెలెన్ కెల్లర్.

1880 వ సంవత్సరము జూను 27 వ తేదీన అమెరికా సంయుక్త రాష్ట్రములలో ఎలబామాలో ప్రముఖ వంశీయుడైన ఒక సైనికోద్యోగి యింట ఒక చక్కని బాలిక జన్మించింది. వసపోసిన పిట్టవలె ఆరు నెలలకే పలుకులు నేర్చి, మంచి ఆరోగ్యముతో గునగునలాడుతూ ఏడాదికే నడువనారంభించిందా అపురూపపు బిడ్డ.

ఆ బిడ్డకా కంటి చూపు, వినే శక్తి, స్ఫుటమైన మాట ఆ విధముగానే నిలచి ఉన్నట్లయితే సామాన్యజీవితమునే గడిపేదేమో! కాని-19 నెలల వయసున మెనింజైటిస్ వ్యాధి ఆమె కంటిచూపును, వినికిడి జ్ఞానమును, మాటను దోచుకొన్నది. ఆమె తనకేది కావలసివచ్చినా సంజ్ఞలద్వారా తెలిపేది. ఆరవఏట ఆమె తండ్రి వాషింగ్టన్‌లో ఉన్న అలగ్జాండర్ గ్రహామ్ బెల్ దగ్గరికి బిడ్డను తీసుకొనివెళ్లి, ఆమెకు తగిన విద్యాశిక్షణ నివ్వవలసినదని కోరాడు. ఆ బిడ్డకు విద్య నేర్పటము సామాన్యులకు సాధ్యమా? 'ఈ బిడ్డకు తగిన విద్యాశిక్షణ నివ్వగల సమర్థుడైన ఉపాధ్యాయుని పంపవలసినది'గా అతడు పేర్‌కిన్ ఇన్‌స్టిట్యూట్‌కు వ్రాశాడు. ఆ సంస్థవారు మిస్ సలివన్‌ను పంపారు. ఆనాటినుండీ 1936 వరకు ఆమె హెలెన్‌కెల్లరుకు విద్యాశిక్షణ నిస్తూ తోడునీడగా ఉన్నది.

ఉపాధ్యాయినితో తన ప్రథమసమావేశమును గురించి హెలెన్‌కెల్లర్ తన స్వీయ చరిత్రలో ఈవిధముగా వ్రాసుకొన్నది 'అది సరిగా 1887 వ సంవత్సరములో మార్చి 3 వ తేది. నాకు 7 సంవత్సరాలు ఇంకా మూడు నెలలకు నిండుతా యనగా ఒకనాటి మధ్యాహ్నము అమ్మ అటూ ఇటూ తిరిగి సందడిచేస్తుంటే ఏదో విశేషమున్నదనుకున్నాను. నేను వాకిటి తలుపుదగ్గర మెట్లమీద నిలబడ్డాను. ఎవరిదో అలికిడి వినబడింది. నేను చేతులు చాపాను. ఆ వచ్చేది అమ్మ అనుకొన్నాను. అంతలో ఎవరో నా చేతి నందుకొని నన్ను దగ్గరికి లాక్కొన్నారు; హృదయానికి చేర్చుకొన్నారు. అప్పుడు నా హృదయములో అవ్యక్తమైన ఆవేదన బయలుదేరి 'వెలుగును ప్రసాదించు - వెలుగును ప్రసాదించు' అన్న దీనాలాపన కంఠమువరకూ వచ్చి నిలచిపోయింది. సరిగా ఆ ముహూర్తములోనే నాకు జ్యోతిర్దర్శనమయింది'

మిస్ సలివాన్‌కు ఈ బిడ్డను చూడగానే ఆశ్చర్యము కలిగింది. బయలుదేరుతుండగా ఆమెకొక ఆలోచన కలిగిందట. 'ఆబిడ్డ పిరికితనముతో ఈదురోమనే తెలివితక్కువ పిల్లఏమో - తనకెట్లా మాట దక్కుతుందా' అని. హెలెన్‌కెల్లర్ ప్రథమవీక్షణములోనే ఉపాధ్యాయినిని చకితురాలిని చేసింది. అప్పుడారంభమయింది ఆబిడ్డకు అక్షరాభ్యాసము. లోహముతో తయారుచేయబడిన అక్షరాలనుబిడ్డచేతిలోపెట్టిఒక్కొక్క అక్షరాన్ని ఉచ్చరించుచూ ఆమె విద్య నేర్పింది.



కలువలసరసిలోన కొలువున్న తల్లి !
సిరులునిండినవెల్లి ! వరకల్పవల్లి !

ఫోటో : డి. రామలింగేశ్వరరావు.

ఒకనాడు ఉపాధ్యాయిని ఒకబొమ్మను హెలెన్‌కెల్లరుచేతిలో పెట్టింది. ఆమె దానితో చాలాసేపు ఆడుకొన్నతరువాత మిస్ సలివాను 'బొమ్మ' అని ఆమెచేతిలో వ్రాసింది. దానితో హెలెన్ కెల్లర్‌కు ఎక్కడలేని ఉత్సాహమూ పుట్టుకొని వచ్చింది. అప్పటినుంచీ తాను ఆడుకొన్న వస్తువు బొమ్మ కాబోలుననుకొని దానిని వ్రాయటానికీ, నోటితో ఉచ్చరించటానికీ ప్రయత్నించి కృతకృత్యురాలయింది. అవిధముగానే ఒకపర్యాయము హెలెన్ కెల్లర్ ఉపాధ్యాయినితోకూడా తోటలో విహరించుచుండగా, దోసెడు నీళ్లు శిష్యురాలి చేతిలో పోసి ఆపైన చేతిమీద 'నీరు' అని మిస్ సలివాన్ వ్రాసింది. నీటిస్పర్శ ఒక చేతికీ అక్షరాల స్పర్శ మరొక చేతికీ తగిలి ఒకదానికొకటి తోడుకాగా 'నీరు' అన్న మాట తటాలున ఆ బిడ్డ నోటినుండి వెలువడ్డది. ఆ ఉత్సాహములో ఆరాత్రి 30 మాటలను నేర్చుకొన్నది.

అది మొదలుకొని ఒక్క క్షణమైనా వృధా పుచ్చకుండా కృషిచేసి హెలెన్ కెల్లర్ కొన్ని నెలలకే 800 మాటలను నేర్చుకొన్నది. వాటిని బ్రెయిల్ లిపిలో వ్రాయనూ చదువనూ అభ్యసించింది. అప్పటినుండీ ఆమె విద్యావ్యాసంగము నిరాటంకముగా అద్భుతముగా సాగిపోయింది. మిస్ సలివాన్ ఈ బిడ్డనుగురించి తన మిత్రురాలికొక జాబు వ్రాసింది. "ఈబిడ్డకు విద్య నేర్పటము నా జీవితములో ఒక ప్రత్యేక సంఘటన. ఈ బాలిక ఉజ్జ్వల భవిష్యత్తు కలదిగా కనబడుతున్నది. నేను ఈ బాలిక ప్రతిభనూ శక్తిసామర్థ్యాలనూ రాణింపుకు తేగలననుకుంటాను' అని తన ప్రయత్నాలనుగురించి వ్రాసింది.

విద్యుద్వేగముతో ఆమె పురోగమించటానికి దోహదమిచ్చిన అంశాలు రెండు. ఆమె మేలుకొనిఉన్న ప్రతి క్షణమూ ఉపాధ్యాయినితో గడిపేది. పిల్లలు పెద్దలు అతిథులు అనేకమంది నౌకరులు ఉన్న సందడిగల యింట్లో నివాసము; వివిధ జంతువులను, పచ్చని పంట చేలను, సువాసనలను గుప్పించే పూల తోటలను, ఉత్తుంగ తరంగాలతో పొంగుతూ పారే జీవనదులను అనేక విశేషాంశాలతో కథలతో, గాథలతో హెలెన్ కెల్లర్ మనోవీధిలో పరుగులెత్తించేది చతురబుద్ధిగల ఉపాధ్యాయిని. ఈ విధముగా ఆమె జీవితములో రమారమి మూడు సంవత్సరాల కాలము ఇంటనే చదువు సాగింది.

పదిసంవత్సరాల వయసున న్యూయార్కులో సారా ఫుల్లరువద్ద విద్యాభ్యాసము చేయించటానికి హెలెన్ కెల్లరును తీసుకొని వెళ్లారు. అతడు హారేస్‌మాన్ పేరుగల చెవిటిపిల్లల పాఠశాలకు ప్రిన్సిపాలు. శబ్దమంటే ఏమో సరిగా ఎరుగని హెలెన్ కెల్లర్ గంటలకొలది ఆ పాఠశాలలో కృషి చేసి ఒక్కొక్క మాటనే నేర్చుకొనేది. భావోదయము కాగానే దానిని ఉచ్చరించవలెనని ఆమెకు ఉత్సాహము కలిగేది. ఈ విధముగా కృషిచేసిన హెలెన్ కెల్లర్ తిరిగి ఎలబామాకు వెళ్లి 'నేను మూగదానను గాను'ని సోదరితో చెప్పుకొన గలిగినది.

మిస్. హెలెన్ కెల్లర్ ఆంగ్లభాష నేర్వటముతో తృప్తి చెందలేదు. లాటిన్, ఫ్రెంచి, జర్మనీ భాషలను అభ్యసించినది. ఆమె తన 16 వ ఏట ఒక సాహసకార్యానికి పూనుకొన్నది. రాడ్‌క్లిఫ్ కాలేజిలో తాను చేరి చదువవలెనన్న అభిలాషకొద్దీ కేంబ్రిడ్జి స్త్రీల కళాశాలలో ప్రవేశించింది. హార్వర్డు విశ్వవిద్యాలయానికది స్త్రీలశాఖ. కళాశాలలో ఆ విద్యావ్యాసంగము, గురుశిష్యుల ఎనిమిది సంవత్సరాల ఎడతెగని కృషి, మిస్. సలివాన్ శిష్యురాలితో కూడా క్లాసులకు వెళ్లి, ఉపాధ్యాయులు చెప్పిన పాఠములను తన వేళ్లతో ఆమె అరచేతిలో వ్రాసేది. ఇంటివద్ద చదువవలెనని నిర్దేశించిన పాఠములను గుర్తుపెట్టుకొని బోధించేది.

1904 సంవత్సరములో రాడ్‌క్లిఫ్ కళాశాలలో హెలెన్‌కెల్లర్ పట్టభద్ర అయినది. ఆంగ్లభాషలో ప్రత్యేకమైన సన్మానాలను పొందింది. ఆ కళాశాలలో విద్యాభ్యాసము చేస్తున్న రెండవసంవత్సరములో ఆమె తన

కొత్త సంవత్సరాది

పి. ఎస్. గోపాల్

హాయిహాయి నవ వసంతము
హాయిగొల్పు నిది నితాంతము!

కొల్లలుగా తావులీను ప్రతిలతాంతము
జిల్లనుహృదయము, తలచినగత హేమంతము

తెల తెలవారకమును పే కోకిలమ్మపిలుపు
ఎలమామిడితోటలోన తేటిమేలుకొలుపు!

పొలములలో విననాయెను మోటబావిగీతము
పోకబోదె విరిపూతల తేటుల సంగీతము!

మల్లెమొగ్గలల్లిన మా చెల్లెలిజడసొంపు
అల్లరిపిల్లలనగవులు రతనాలనునింపు!

'జీడికిబంటెవరో' యన 'నేనో' యనుకేక
చెరువవతలతోటలోన ఆటవిడుపుమూక

కొండపైన మబ్బుతునక కొనలవెండిగీతలు!
ఎండలోన నిండుమావిగున్నల తెలిపూతలు!

అదిగదిగో దేవళమున పంచాంగ శ్రవణము!
సంవత్సరఫలములు విన పేరిశాస్త్రి పయనము

పిల్లలకూ పెద్దలకూ
అల్లుళ్ళకు కోడళ్ళకు
మన్మథ సంవత్సరాదిరాక
ఉత్సాహము మదినించునుగాక!




పొలిమేర



—చిత్రకారుడు పి వి రామారావు—విశాఖపట్నం.

వంకర బాట



మొదటి గ్రంథాన్ని రచించింది. ఈ గ్రంథము 'నా జీవితకథ' అను పేరుతో అమెరికాలోని స్త్రీల మాసపత్రికలో సీరియల్‌గా ప్రచురింపబడ్డది. దీనితో ఆమె సామర్థ్యము దశదిశలా ప్రాకిపోయింది.

ఆమె అనేక గ్రంథాలను వ్రాసింది. ది వరల్డ్ ఐ లివిన్, అవుటాఫ్ ది డార్క్, మై రిలిజియన్, మిడ్ స్ట్రీమ్, మై లాటర్ లైఫ్, పీస్ ఎట్ ఈవెంటైడ్, లెటస్ హేవ్ ఫెయిత్ అన్నవి ముఖ్యమైనవి. ఇవిగాక అమెరికాలోని పత్రికలకు బహుధా వ్రాస్తూ ఉండేది. రచనలు తాననుకొన్న విధంగా రూపొందే వరకూ ఆమె తన వ్రాతప్రతులను దిద్దుతూ ఉండేది. ఆమె సాధారణమయిన టైపు రైటరును గాని బ్రెయిలు వ్రాతమిషనును గాని ఉపయోగించుతుంది. ఆమె వ్రాతలో చాలా నిదానము. అందరివలె వ్రాసినదానిని చదివి చూసుకొనే భాగ్యము ఆమెకు లేదు కనుక జాగ్రత్తగా వ్రాయటము అలవరచుకొన్నది.

ఆమెకు సంగీత సాహిత్యాలయందు గాఢాభిమానము. ఆమె నాటకాలను చలన చిత్రాలను చూసి ఆనందించగలదు. వెంటనున్నవారు కథాంశాలను చేతిమీద వ్రాస్తూ ఉంటే గ్రహించి ఆమె ఆనందించ కలుగుతుంది. ధ్వని తరంగాలవల్ల ఆమె సంగీతాన్ని వినగలుగుతుంది. అపురూప శిల్ప సౌందర్యాన్ని కరస్పర్శతో గ్రహించగలుగుతుంది.

మార్కు ట్వైన్ యొక్క హాస్యపూరితమైన భాషణములను ధ్వని తరంగాల సహాయముతో వినగలిగినది. ఒక సుప్రసిద్ధ గాయకుడు తన కిన్నెర కంఠాన్ని ఆమె 'చేతిలో వినిపించాడు.' మరొక గాయకుడు ఫిడేలుమీద ఆమె చేతి వేళ్లను ఆనించి తన గానకళను ఆమె ఎదుట ప్రదర్శించి గ్రహింపచేశాడు. ధ్వని తరంగాలవల్లనే ఆమెకు సర్వమూ విదితమయేది. సర్వజ్ఞత్వముగల తన హస్తాంగుళీయములతో ఆమె పియానో వాయించుతుంది. నిరుడు ఆమె ఐసెన్‌హోవరు ముఖము తడిమి మందహాసమును గుర్తించగలిగినది.

డాక్టరు హెలెన్ కెల్లర్ ఇటీవల 'అపరాజిత' అనే చిత్రములో నటించింది. ఆ చిత్రము ఆమె జీవితకథ నాధారము చేసుకొని తీయబడ్డది.

ఆమె తన జీవితసాఫల్యముతో తృప్తిపడక, తోడి మూకబధిరాంధజీవులకై కృషి చేయ సంకల్పించింది. తాను విద్యార్థినిగా ఉన్నప్పుడే తోటివారికి చేతనయిన సహాయముచేస్తూ ఉండేది. అమెరికాలో అంధుల కొరకు స్థాపింపబడిన సంస్థకు విరాళాలను ప్రోగుచేసి ఇస్తూ ఉండేది. అంధులకు ప్రాతినిధ్యము వహించి జపాను ప్రభుత్వాహ్వానముపైన జపాను, కొరియా, మంచుకూ వెళ్ళి వచ్చింది.

టెంపుల్ విశ్వవిద్యాలయమువారు ఆమెను డాక్టర్ ఆఫ్ హ్యూమన్ లెటర్సు అన్న డిగ్రీతో బహూకరించారు. గ్లాస్గో విశ్వవిద్యాలయమువారు డాక్టర్ ఆఫ్ లాస్ అన్న డిగ్రీ యిచ్చారు. 1951 వ సంవత్సరమునుండి 1954 వరకు ఆమెకు 18 రకముల బహుమానాలు లభించాయి. 1954 వ సంవత్సరములో నోబెల్ బహుమానము ఇవ్వవలెనని పనమా రిపబ్లిక్ నేషనల్ ఎసెంబ్లీ సూచన చేసింది.

1946 లో బ్రిటన్, ఫ్రాంసు, ఇటలీ, గ్రీస్ దేశాలను పర్యటించి యుద్ధ ప్రమాదమువల్ల అంధులయిన వారి సంఖ్యను తెలిసికొని తగు చర్యను తీసుకొనవలసినదని ఆయా ప్రభుత్వాలను హెచ్చరించింది. అమెరికా సంయుక్తరాష్ట్రాలలో మూకబధిరాంధుల అభ్యుదయముకొరకు శాసనము చేయించి శాసనసభలో ప్రాతినిధ్యము వహించింది.

1904 లో ఆమె ఉపాధ్యాయిని అయిన మిస్ సలివాన్ సాహిత్య ప్రియుడయిన జాన్ మాసీను వివాహమాడింది. కాని ఆ వివాహము హెలెన్ కెల్లర్ విద్యాభ్యాసంగానికి అవరోధము కాలేదు. ఆమె ఆ దంపతులవద్దనే నివసించ నారంభించింది. వారిద్దరూ ఆమెకు చదువులలో సహకరించేవారు. 1936 లో సలివాన్ మాసీ మరణించిన తరువాత హెలెన్ కెల్లర్ న్యూయార్కు నగరసమీపములో వసతి ఏర్పరచుకొన్నది. 1946 లో ఆమె యూరపు దేశములో పర్యటించుతుండగా ఆమె గృహము పరశురామప్రీతి అయినది. ఏ గృహవాటికలో ఆమె తన అంధజీవితాన్ని ప్రకాశింపచేసుకొంటూ, తోటి బధిరాంధజీవులకు వెలుగుబాటలను చూపగలిగినదో ఆ ఆరామము అగ్నిహోత్రుని కాహుతయిపోయింది. ఆమె మిత్రులు పురజనులు ఆమెయెడ తమకు గల ఆదరాభిమానాలను ప్రకటించుకొన్నారు. వెంటనే అటువంటిదే మరొక భవనాన్ని నిర్మించి యిచ్చారు. కాని ఆమె విచారించినది కాలిపోయిన యింటికొరకు కాదు - బ్రెయిల్ లిపిలో ఉన్న తన గ్రంథ భాండాగారానికై తపించిపోయింది.

కానెక్టికట్ అడవులమధ్య ఒక దివ్య భవనములో డాక్టర్ హెలెన్ కెల్లర్ నివాసము. ఎనిమిది అడుగుల ఒక రాతిదీప స్తంభము ఆ తోటలో నిత్యదీపారాధనగా వెలుగుతూ ఉంటుంది. ఆమె జీవితాంతమూ అది ఆవిధముగా వెలుగుతూ ఉండవలసినదే నని నిర్దేశింపబడ్డది.

1914 నుండీ పాలీ థామ్సన్ హెలెన్ కెల్లర్ కుటుంబములో ఒక వ్యక్తిగా పరిగణింపబడుతూ వచ్చినది. సలివాన్ మాసీ వలెనే ఈమెకూడా హెలెన్‌కెల్లర్‌కు ఆరవప్రాణము. సలివాన్‌మాసీకొరకు హెలెన్ కెల్లర్ దుఃఖపడకుండా ఆశ్వాసింపవలసిన భారము మీద వేసుకొని కన్నతల్లిలా ఆమెను కాపాడుతూ ఉంటుంది పాలీథామ్సన్.

హెలెన్ కెల్లర్ ఎక్కడ ఉపన్యసించినా తన అభివృద్ధికి కారకురాలైన సలివాన్ మాసీ నామము సుస్మరించి మనసులో నమస్కరించకుండా ఉండలేదు. ఆమె జీవితకథను వ్రాసి తన కృతజ్ఞతను తెలుపుకొనవలెనని హెలెన్ కెల్లర్ సంకల్పించింది. ఆ గ్రంథము రచిస్తూ ఉండగా రెండవప్రపంచయుద్ధము ప్రారంభమయింది. యుద్ధములో గాయపడినవారికి తన చేతనయినంత సేవ చేయవలెనని ఆమె మనసు కొట్టుకొనిపోయింది. వెంటనే వ్రాస్తూ వ్రాస్తూ ఉన్న గ్రంథము వదలిపెట్టి వైద్యాలయాలకు వెళ్ళి గాయపడిన సైనికుల నందరినీ సానునయ వాక్కులతో పలకరించి తనకు సాధ్యమైనట్టుగా ఉపచారముచేసేది. ఆమె అమృత వాక్కులతో వారి హృదయాలు పొంగి బాధోపశమనము కాగా ఆమెకు తమ కృతజ్ఞతను వెల్లడించేవారు.

హెలెన్ కెల్లర్ ఆధ్యాత్మికచింత కలది. బయట ఎంతసేపు తిరిగినప్పటికి యింటికి చేరుకోగానే ఒకచోట కూర్చొని అధ్యాత్మిక చింతలో పడకపోతే ఆమె మనసు కుదుటపడదు. మాలిన్యరహితమైన ఆమె నైతిక ప్రవర్తన, నిర్మలమైన నడవడి, ఎడతెగని కృషి, సంకల్పశుద్ధి విశ్వాసము ఆమెకు హెచ్చిన అలంకారాలు. డెబ్బది మూడు సంవత్సరాల మూకబధిరాంధ జీవితాన్ని సాహిత్యారాధనకు, మానవ సేవకు అంకితము చేయగలిగిన ధన్యజీవి. ఆమె తన జీవితములోని ప్రతి దశాబ్దములోను అంగలోపము కలవారి నుద్ధరించుటకై సరికొత్త ఆలోచనలను పథకాలను శక్తిసామర్థ్యాలను సంపాదించేది.

'నా జీవితము సుఖప్రదముగా శాంతియుతముగా సాగిపోతున్నది. దానికి కారణము నాకు ఆప్తులనదగిన మిత్రులున్నారు. నాకభిమానమైన పని చేతినిండ ఉన్నది. కనుక నా జీవితము స్వర్గధామమనియే నా భావన, నాకు లోపించిన వాటినిగురించి నేను ఎప్పుడూ ఆలోచించను. నాకా విచారము ఎప్పుడూ లేదు. కాని తెరవచ్చినట్టు అప్పుడప్పుడు బాధ వస్తూఉంటుంది. పూవులు ఝంఝామారుతానికి ఊగిపోయినట్టుగా ఊగిపోతాను. కాని వెంటనే మామూలు మనిషినయిపోతాను" అంటుంది హెలెన్ కెల్లర్.


ఆమె గొప్ప మేధావతి. సత్సంకల్పమూ సమయస్ఫూర్తిగల రసజ్ఞురాలు. తన కరస్పర్శచేతనే ప్రపంచములో నాలుగు దిశలలో మిత్రులను సంపాదించుకొన్న భాగ్యశాలిని.

డాక్టరు హెలెన్ కెల్లర్ భారతప్రభుత్వాహ్వానముపై మూకబధిరాంధ జీవుల కొరకేర్పడిన సంస్థలను దర్శింప వచ్చిన అతిథి [illegible] చేరి ఆ విద్యాంసు [illegible] వచనాలను సర్వజనత్వము గల లక్ష హస్తాంజలియములతో తనను సంభాషణవిచారముచేసి అందరినీ విస్మయపరచింది.

'మార్కుట్వెన్ నెపోలియన్‌తో మిమ్ముల పోల్చుటలు ఎట్లా ఉన్నదని ఒకరు ప్రశ్నింపగా "నాకు ఆయనకూ పోలిక ఎక్కడ? ఆశయాలలో ఇద్దరమూ భేదిస్తాము. ఆయనది రాజ్యకాంక్ష - నాది తోటిమూకబధిరాంధుల అభ్యుదయకాంక్ష! మీరే యోచించండి మాయిద్దరి పోల్పుటను ఎంత సమంజసముగా ఉన్నదో!" అన్నది.

చాలాకాలముక్రిందట ఆమె రవీంద్రనాథటాగూరును దర్శించిందట. అప్పుడే భారతీయులతత్వశాస్త్రాన్ని గురించి విని పరిచయముకలిగించుకొన్నదట. దానిని మనసు కెక్కించుకొనవలెనని అభిప్రాయముట!

డాక్టర్ హెలెన్ కెల్లర్ మూడు సంవత్సరాలు కృషిచేసి ఉపన్యాసము చేయటకు నేర్చుకొన్నది. కాని ఆమె కంఠధ్వని అకస్మాత్తుగా నిలిచిపోవటముగాని తగ్గిపోవటముకాని జరుగుతూ ఉంటుంది. ఆమె తన ఉపన్యాసాన్ని పాలీ థామ్సనుద్వారా విని



చైత్రశోభ —ఫొటో: ఈమని సత్యనారాయణరెడ్డి, రాజమండ్రి.

ఆడ బ్రతుకు

పరంధామయ్యగారూ, కొడుకు రామారావూ, భోజనం చేస్తున్నారు. కోడలు జానకి వడ్డిస్తోంది.

"ఈ వంకాయకూర స్వర్గానికి మెట్లు కడుతోంది" అన్నాడు పరంధామయ్య కొడుకువైపు చూసి.

రామారావు చాటుగా జానకివైపు చూసి చిరునవ్వు నవ్వేడు. జానకి కళ్ళు తళతళా మెరిసేయి.

"అ - క్రొత్తోక వింతా - పాతోక రోతా అన్నారు" అని దీర్ఘం తీసింది పరంధామయ్యగారి భార్య మాణిక్యమ్మ, పూజ చేసుకుంటూ.

"ఏడిసేవులెద్దూ! నువ్వు వంట చేసినంత కాలం, నేను తృప్తిగా భోజనం చేసింది ఒక్క రోజూ లేదు."

"నెల రోజులు రావలసిన ఖర్చు సామానులు, పదిహేను రోజుల్లో ఖర్చు పెడితే సరి, నేను చేసిందీ సంతర్పణ వంటలాగే ఉంటుంది" అని రుసరుసలాడుతూ హారతి వెలిగించింది మాణిక్యమ్మ. రామారావు తల వంచుకున్నాడు. జానకి కళ్ళనీళ్లు తుడుచుకుంది.

ఇంతలో 'టెలిగ్రామ్' అని కేక వినబడింది. రామారావు గభాలున లేచి, చెయ్యి కడుక్కొని వెళ్లి వీధి తలుపు తెరిచేడు. వణుకుతున్న చేతుల్తో టెలిగ్రాం తీసుకొని సంతకం పెట్టి, బంట్రోతును పంపేసి, హాలులోకి వచ్చి కవరు చింపి, ఆత్రుతగా చూసేడు.

"నాన్నకు పక్షవాతం చెల్లెల్ని అర్జెంటుగా పంపవలెను—మాధవరావు"

అది జానకి అన్నగారిచ్చిన టెలిగ్రాం రామారావు, ఒక్క నిట్టూర్పు విడిచి, అప్పుడే చెయ్యి కడుక్కొని వచ్చిన తండ్రి

జె. రాఘవేంద్రరావు

చేతికిచ్చేడు. జానకి, మాణిక్యమ్మ, ఇద్దరూ అడిగితే ఏమి అశుభవార్త వినవలసివస్తుందో అని, వెలవెలబోతూ నిలబడిఉన్నారు

"వియ్యంకుడుగారికి పక్షవాతం వచ్చిందట కోడల్ని అర్జెంటుగా పంపమన్నారు" అన్నాడు పరంధామయ్య, భార్యవైపు చూసి జానక్కి నెత్తిమీద పిడుగుపడ్డట్టయింది. కళ్ళు చీకట్లు క్రమ్మేయి వంటనే తన గదిలోకి పోయి, మంచంమీద పడిపోయింది

అలా ఎంతసేపుందో కాని, "అమ్మాయీ" అన్న పిలుపు, నూతి అడుగుననుండి వచ్చినట్లు వినబడి కళ్లు తెరిచింది ఎదురుగా మామగారు నిలబడిఉన్నారు. జానకి సిగ్గుపడుతూ లేచి, మంచం దిగి ప్రక్కగా నిలబడింది.

"మీ నాన్నగారికేమీ ఫర్వాలేదు - ఖంగారు పడకు ఇలా చూడు- అబ్బాయికి సెలవు దొరకదట - నిన్ను మూడు గంటల బండి ఎక్కిస్తాడు - వెళ్ళగానే ఉత్తరం రాయి, ఎలా ఉందో - అన్నట్లు - కట్నం బాపతు మూడువేలివ్వాలిగా—అవి కనక యిప్పుడు వసూలు చేసుకోపోతే చాలా కష్టం. నువ్వు కనక ఆ డబ్బు పట్టుకొచ్చేవంటే వెంటనే ఒక ఎకరం భూమి కొనేస్తాను నీ పేర నీకు పసుపూ కుంకుమా కింద సరిపోతుంది - ఏమంటావ్?" అన్నాడు పరంధామయ్య, కోడలి ముఖంలోకి చూస్తూ.

జానకి అంతులేని వేదనతో మూల్గింది.

రామారావు జానకిని మూడు గంటల బండిలో, ఆడవాళ్ళ పెట్టెలో ఎక్కించేడు. "మీరు కూడా రాకూడదూ?" అని దీనంగా అడిగింది జానకి.

రామారావు ముఖం ప్రక్కకి త్రిప్పుకొని "సెలవు దొరక లేదు. ఏం చెయ్యమంటావు చెప్పు?" అన్నాడు. రైలు కూత వేసి కదిలింది. జానకి ఒక్క నిట్టూర్పు విడిచింది.

రైలు వేగంగా పోతోంది. టెలిగ్రాఫ్ స్తంభాలు వెనక్కి పరుగెత్తుతున్నాయి. పొలాలు, చెరువులు, అడవులు, వెనకబడి పోతున్నాయి కిటికీదగ్గర కూర్చున్న జానకి వీటినన్నిటిని చూస్తోంది కాని, ఆమె మెదడు వాటిని గ్రహించడం లేదు స్టేషన్లలో రైలు ఆగడం, జనం ఎక్కడం, దిగడం—యివేమీ ఆమె గమనించడం లేదు చివరకు ఒక పిల్లల తల్లి ప్రక్కకు జరగమని తన భుజంమీద, బరువుగా చెయ్యి వేసినప్పుడు, జానకి యీ లోకంలోకి వచ్చింది. తాను వెళ్ళేసరికి తండ్రి బ్రతికిఉంటాడేమో నన్న ఆలోచన, మెదడులో మెరుపులా మెరిసింది గుండె 'ఝలు'మంది కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగేయి, గొంతుకలోకి దుఃఖం ముంచుకొని వచ్చింది ప్రక్కవాళ్ళు చూస్తారేమో నన్న భయంతో, పమిటి కొంగు నోట్లో కుక్కుకొని, కిటికీలోంచి బయటకు చూస్తూ కూర్చుంది.

జానకి తండ్రి అందరిలాంటి తండ్రి కాడు ఆమెకు మూడవ ఏటనే తల్లి పోయింది అప్పటినుంచీ తండ్రే తల్లి అయి పెంచేడు. ఆమెకోసం మళ్ళీ పెళ్లి చేసుకోవటం మానేసేడు. పిల్లకి పోషణ బాగా జరగడం లేదని, ఉద్యోగంలోంచి, ఎంతో ముందే రిటైరయిపోయాడు పాలు పట్టడం- నీళ్లు పోయడం, పడుకో బెట్టి జోకొట్టడం, ఏడుస్తున్నప్పుడు గంటలకొద్దీ భుజంమీద వేసుకొని త్రిప్పడం - ఈ పనులన్నీ యితరులమీద పెట్టకుండా తానే చూస్తూ కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చేడు. ఈ సంగతులన్నీ పొరుగింటి సుబ్బమ్మగారు చెప్తూంటే విని జానకి, జన్మజన్మాలకీ తండ్రి ఋణం తీర్చుకోలేననుకుంది. కాస్త జ్ఞానం వచ్చినప్పటినుంచీ, తండ్రి చేసిన చాకిరి ఆమె ఎన్నటికీ మర్చిపోలేదు రాత్రిళ్లు వెన్నెలలో ప్రక్కలో దగ్గరగా పడుకోబెట్టుకొని నిద్రపోయేదాకా కథలు చెప్పే

ప్రజ్ఞాచక్షువు: డాక్టర్ హెలెన్ కెల్లర్

...త్సాహంఉంది. తాను మెల్లగా కొన్ని వాక్యాన్నే ఉచ్ఛరిస్తుంది

ఆమె నాలుగునెలలు పర్యటించ దలచుకొన్నది లండను, రోము, కైరో, హాంగ్‌కాంగ్, నగరాలను దర్శించటములో రోజులు గంటల క్రింద మారిపోయినవి. కాని బొంబాయి కలకత్తా ఢిల్లీ కరాచీ, రంగూన్ మనీలా, టోకియోలలో వాస్తవమైన కృషిజరుగుతుందని ఆశించబడ్డది

'అంధత్వము కలుగకుండా ఉండే ఉపాయాలను సాధించాలని సంకల్పించాను కాని అది అసాధ్యమేమో! నేను వృద్ధురాలనై పోతున్నాను అని ఆమె తనను దర్శించ వచ్చిన వారితో అంటూఉంటుంది

మె తన 75వ జన్మదినోత్సవము నాటికి తిరిగి స్వస్థానము చేరుకొనవలెనని సంకల్పించింది ఆమె తన దేశమునకు మరలిపోయే ముందు మూకబధిరాంధుల అభ్యుదయానికై ఒక ప్రణాళికను భారతప్రభుత్వానికి సమర్పించుతుందని ఆశించబడుచున్నది.

ప్రపంచఖ్యాతిగాంచిన పదిమంది మహిళలలో డాక్టర్ (మిస్) హెలెన్ కెల్లర్ ఒకరు. ★

కాదు. బజారులో, కొత్త డిజైను కుడ్డవస్తే చాలు వెంటనే కొని గౌనులు కుట్టించేవాడు ఆమెకోసం తండ్రి కొన్న బొమ్మలు గాజువి, కొయ్యవి, సెల్యులాయిడ్‌వి అన్నీ ఒక కావిడిపెట్టె నిండాయి

జానకికి ఏడవ ఏడు వచ్చేక బళ్ళో వేసేరు. ఉదయమే నీళ్లు పోసి కాఫీ ఇచ్చి, ఎత్తుకొని తీసుకొని వెళ్లి తండ్రి స్కూలు దగ్గిర దిగబెట్టేవాడు. మళ్ళీ స్కూలు విడిచిపెట్టేసరికి గేటుదగ్గిర హాజరుగా ఉండేవాడు. తన తోటి పిల్లలందరూ నడిచి పోతూంటే, తనని తండ్రి ఎత్తుకొని తీసుకు వెళ్ళడం జానకికి చిన్నతనంగా ఉండేది. "నేను నడుస్తాను నాన్నా!" అంటే "ఒద్దులే అమ్మా! నీకు కాళ్ళు నొప్పెడతాయి" అనేవాడు.

జానకి హైస్కూలులో చేరిన తర్వాత కూడా, స్కూలుదగ్గిర దిగబెడితే కాని తండ్రికి తోచేది కాదు. తండ్రి తోడు రావడం సిగ్గుగా ఉండేది ఒక రోజున ధైర్యంచేసి "నాన్నా! ఇవాళనుంచీ, నేనూ పక్కింటి శారదా కలిసి వెడతాం స్కూలుకి" అంది జానకి. తండ్రి ముఖం వెంటనే వివర్ణమయింది. అలా ఎందుకయిందో ఆమెకు పెద్దయేవరకూ తెలియలేదు. ఆమె పరీక్ష ప్యాసయిందని విన్నప్పుడల్లా బ్రహ్మానందభరితుడయేవాడు. అన్నగారు, ప్యాసయేనని చెప్పినప్పుడు "సంతోషం" అని ముక్తసరిగా అనేవాడు ఎందువల్లో! జానకి స్కూలు పైనలులోకి వచ్చింది. అన్నగారు కాలేజీలో చదువుతున్నాడు. తండ్రి, అతడికి మంచి పేంట్లూ, అవీ కుట్టించేవాడు కాదు కాని జానకికి మాత్రం లంగాలూ ఓణీలు రకరకాలు తెచ్చేవాడు. ఈ పక్షపాతం ఆమెకే కష్టంగా ఉండేది. ఒకరోజున జానకి స్నానంచేసి వచ్చేసరికి హాలులో తండ్రి అన్నగార్ని తీవ్రంగా మందలించడం వినబడింది "అబ్బాయీ! చూడు దానికి పసితనంలోనే మీ అమ్మ పోయింది. అప్పటినుంచీ దాన్ని ఎన్ని యిబ్బందులుపడి పెంచేనో నీకు తెలుసు. దాని మనస్సుకు చిన్నమెత్తు బాధ కలగడం కూడా నేను ఓర్చలేను. నేను పోయిన తర్వాత కూడా, నువ్వు దాన్ని నేను చూస్తున్నట్లు చూడకపోతే, స్వర్గంలో ఉన్నాసరే - నా ఆత్మకి శాంతి ఉండదు. ఈ సంగతి జ్ఞాపకం ఉంచుకో - ఇదిగో - ఈ ఏభై రూపాయలూ పట్టుకెళ్ళి నీకు కావలసిన బట్టలు కుట్టించుకో. నేను నిన్ను నాతో సమానంగా చూసుకుంటాను. జానకి నాకు అంతకంటె చాలా ఎక్కువ" ఈ మాటలు వింటూంటే జానకికి, కృతజ్ఞతతో కళ్ళు చెమ్మగిలేయి.

జానకి స్కూలు ఫైనలు చదువుతూ ఉండగానే ఒక పెద్దచిక్కు వచ్చింది. ఆమె రోడ్డుమీద వెడుతూంటే కాలేజీ పిల్లలు మారుపేరు పెట్టి బిగ్గరగా అనడం మొదలుపెట్టేరు ఆమెకు చచ్చేటంత సిగ్గయిపోయింది విపరీతమైన అసహ్యం కలిగింది తండ్రి ఎంత గారాబంగా పెంచినా స్త్రీఅయి పుట్టిన పాపంచేత, యీ విధమైన అవమానానికి గురికావలసి వచ్చిందన్న బాధ మొదటిసారిగా, ఆమె హృదయంలో కలిగింది తండ్రితో చెప్పుదామనుకుంది. తీరా చెపితే ఆయన ఎంత బాధపడతాడో అని సందేహించి ఊరుకుంది. కాని యిది అన్నగారికి తెలిసింది. ఒక రోజున, అలా అంటున్న వాడిని పట్టుకొని రెంకుకొట్టేడు. ఆ సాయంకాలం తండ్రితో యిక చెల్లెల్ని బడికి పంపడానికి వీలులేదని చెప్పేడు. తండ్రి జరిగినదంతా విని "అబ్బాయీ! చెల్లెలి గౌరవాన్ని కాపాడినందుకు నిన్ను అభినందిస్తున్నాను నువ్వు దాన్ని ఎప్పుడూ అంతే ప్రేమగానూ చూస్తూఉండాలి సుమా" అని కొడుకు భుజం తట్టి జానకి దగ్గరకు వచ్చేడు. తండ్రి తన యిష్టానికి వ్యతిరేకంగా మాట్లాడటానికి జంకుతాడని ఎరుగున్న జానకి, తనంతటతానే యిక చదువు మానేస్తానని చెప్పింది. తండ్రి "నీయిష్టం" అని నిట్టూర్పు విడిచేడు.

చదువు మానేసి యింట్లో ఉంటే జానకికి ఏమీ తోచేది కాదు. ఏదో బెంగగా ఉండేది. ఒక రోజున పొరుగింటి పుల్లమ్మగారు "ఏమయ్యా! పిల్లని, గజ్జెల గుఱ్ఱంలా యింకా ఎంతకాలం పెంచుతావు? ఇక పెళ్ళి చెయ్యవా ఏమిటి?" అని అడిగింది. తండ్రికి ముఖంలో కత్తివేస్తే నెత్తురుచుక్క లేదు. కాని అప్పటినుంచీ ఆయన పెళ్లి సంబంధాలకోసం కాళ్ళకు బలపం కట్టుకొని తిరిగేడు. చిత్రం ఏమిటంటే ప్రతి సంబంధంకోసం, గట్టి ప్రయత్నించేసేవాడు. తీరా నిశ్చయమయ్యే

★ ఆడబ్రతుకు ★

లక్షణాలు కనబడితే, విలవిలలాడేవాడు, తగిన సంబంధం కాదని తప్పిపోతే, నిట్టూర్పు విడిచేవాడు.

ఆఖరున, జానకి మామగారు, అత్తగారూ, భర్తా వచ్చేరు పెళ్ళిచూపులకు. ముగ్గురూ ప్రశ్నలవర్షం కురిపించేరు. నీ పేరేమిటి? ఎంతవరకూ చదువుకున్నావు? వంటచేయడం వచ్చా? ఇంగ్లీషు నేపరు చదవగలవా? సంగీతం వచ్చా? హిందీ పాటలు పాడగలవా? కొంచెం లేచి ముందుకు నడు? మళ్లీ వెనక్కి రా! అలా ఒంటికాలి మీద నిలబడతావేం? అదిగో! ఆ గోడమీది అక్షరాలేమిటి?—ఈ యక్ష ప్రశ్నలు వింటూంటే జానక్కి అరికాలిమంట తల కెక్కింది. అభిమానంతో కళ్ళవెంబడి వచ్చే నీళ్లు బలవంతంగా ఆపుకొని తండ్రివైపు దీనంగా చూస్తూంటే ఆయన గిలగిలలాడి పోయేడు.

చివరకి ఆ సంబంధం నిశ్చయమైంది - నాలుగు వేలు కట్నం - లాంఛనాలు వేరు. జానకి మామగారు, వాళ్ళ ఊరు వెళ్ళి పురోహితుడిచేత, ముహూర్తం పెట్టించి తెలియజేస్తామన్నారు. పెళ్లివారు వెళ్ళగానే, జానకి యింక ఉక్రోషం ఆపుకోలేక తండ్రి ఒడిలో పడి వెక్కి వెక్కి ఏడుస్తూ "గొడ్డును పరీక్ష చేసినట్లు చేసేరు. పైగా నాలుగు వేలు, పుచ్చుకుంటున్నారు. ఇంతకంటె అన్యాయం ఏం ఉంటుంది? నాన్నా" అంది.

"అంతేనమ్మా! ఏం చేస్తాం? ఇందులో ఉన్న అన్యాయం ఎవరికీ తలకెక్కడం లేదు. చదువుకున్న వాళ్ళలోనే యిది మరీ ఎక్కువగా ఉంది" అని తండ్రి నిట్టూర్పువిడిచేడు. పది రోజులైనా పరంధామయ్యగారి దగ్గరనించి ఉత్తరం లేకపోయేసరికి, తండ్రి ఖంగారుపడి, హైదరబాదు వెళ్లేడు. జానక్కి మాత్రం యింత అవమానంతో పెళ్లిచేసుకోనేకంటె ఆజన్మాంతం బ్రహ్మచారిణిగానే జీవిస్తే మంచిదనిపించింది. మర్నాటిసాయంకాలానికి, తండ్రి తిరిగివచ్చేడు. అన్నగారు హడావిడిగా "ఏంజరిగింది?" అని అడిగేడు.

"ఏముంది? వాళ్లకు ఎవరో ఎనిమిది వేలిస్తామని వచ్చేరుట. అందుకని, మనల్ని యింకో సంబంధం చూసుకోమన్నారు" అని తండ్రి యింకా ఏదో చెప్పబోతూండగా, అన్నగారు అడ్డువచ్చి "పిల్లి ఆశకి అంతులేదనుకుంటాను. నిశ్చయం చేసుకున్న తర్వాత డబ్బుకోసం గడ్డితిని మాట తప్పిపోయే మదనష్టపు సంబంధం తప్పిపోతేనే మంచిది" అన్నాడు.

తండ్రి కొంతసేపాగి "ఎనిమిది వేలూ నేనే యిస్తానని చెప్పి ఒప్పించి, ముహూర్తం పెట్టించుకొనివచ్చేను. పెళ్లినాడు నాలుగు వేలివ్వడం, తరవాత కార్యంలోపుగా మిగిలిన డబ్బు యిచ్చేటట్టునూ ఒప్పందం" అన్నాడు.

అన్నా, చెల్లెళ్ళిద్దరూ ఆశ్చర్యపడ్డారు. "ఆడపిల్లని కన్నంతమాత్రాన పౌరుషం లేకుండా ఎంత అవమానాన్నైనా సహించవలసిన దేనన్నమాట! నువ్వు చేసినపని నాకెంతమాత్రం యిష్టం లేదు. నీ యిష్టం. దానిష్టం" అని చిరాకుపడుతూ అన్నగారు చివాలున బయటికి పోయాడు.

పెళ్లిలోకూడా మగపెళ్లివారు పెట్టిన యిబ్బందులకు లెక్కలేదు. చీటికీ, మాటికీ తగాదాయే. అన్నగారు తారాజువ్వలా లేచేవాడు. పేచీ వచ్చినప్పుడల్లా తండ్రి

(52 వ పేజీ చూడుడు)



ఉగాది

చల్లగావచ్చినది సంవత్సరాది!
కొల్లగా తెచ్చినది క్రొత్తవింతలను.
తలంటిపోసినది పిలిచి మాఅమ్మ.
ప్రేమతో పెట్టినది వేపప్రసాదం.
సరిక్రొత్తపంట్లాము చొక్కాలు తెచ్చె,
మామయ్యకంటేను మంచివాడెవడు?
నేటిసంతోషమే యేటిసంతోషం!
నల్లనివాడవో చిన్నికృష్ణా!
ఏడాదిపొడుగునా కాపాడవోయి.

ఎ. ప్రసాదరావు, (సాలూరు).

ఎంత పెద్దది!

భాస్కరం ప్రభాకరం

"అన్ని సంద్రాలొక్కటైతే
ఆ సముద్రం ఎంత పెద్దది?"
"అంత పెద్దది!"
"అన్ని వృక్షాలొక్కటైతే
అపుడు వృక్షం ఎంత పెద్దది?"
"అంత పెద్దది!"

"అంతయినుమూ గొడ్డలైతే
అపుడు గొడ్డలి ఎంత పెద్దది?"
"అంత పెద్దది!"
"అందరం కలిసొక్కడైతే
ఆ మనుష్యుడి కెంత శక్తి?"
"అంత శక్తి!"

అంత శక్తితో ఆ మనుష్యుడు
అంత గొడ్డలి చేతపట్టుకు
అంత చెట్టును కొట్టివేస్తే
చెట్టు సంద్రంలోన పడితే
అపుడు కెరటం ఎంత పెద్దది?!
"అం...త...పెద్దది!!"



బుద్ధవిగ్రహం పొడుగు

జపాన్ దేశంలో కామకురా అరణ్యమధ్యంలో బ్రహ్మాండమైన ఒక బుద్ధ విగ్రహం ఉన్నది. అది కంచువిగ్రహం. దాని ఎత్తు 50 అడుగులు. ముఖం ఎనిమిదడుగుల పొడుగు వుంటుంది. అర చెయ్యి మూడడుగుల మందాన వుంటుంది.

ఈ బ్రహ్మాండమైన విగ్రహం అలానిశ్చలంగా, నిర్మల మందహాసంతో వందలాది యేళ్ళనుండీ అలాగే అక్కడే వున్నది. కామకురా కొన్ని వందల యేళ్ళక్రిందట ఒక పెద్దనగరం. ఆరోజుల్లో ఈవిగ్రహం ఒకచక్కని ఎత్తైన దేవాలయంలో వుండేది. కాని ఇప్పుడా నగరం భూగర్భంలో లీనమైపోయింది. దేవాలయం మట్టిలో కలిసిపోయింది. కాని గౌతమ బుద్ధునికీర్తి ఈనాటికీ చెక్కుచెదరకుండా దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నట్లే ఆ బుద్ధవిగ్రహం కూడా చెక్కుచెదరని శిల్పఖండంగా నిలిచి వుంది.

ఇప్పుడు చెప్పబోయేకథ కామకురానగరం మహావైభవంతో విలసిల్లిన కాలంలో జరిగినది. ఏమో నిజంగా జరిగిందో లేదో ఎవరికి తెలుసు!

సముద్రంలోని జలచరాలన్నిటిలోకీ తిమింగిలం పెద్దది.

పొడుగులోనూ, చుట్టుకొలతలోనూ, బలంలోనూ దాన్ని మించిన జంతువులేదు. తనకింత బలం, ఇంత పెద్దఆకారం వుందిగదా అని దానికి ఎక్కడలేనిగర్వమూ మిడిసిపాటూ. ఇతరజంతువులు ఇంకా సుందరమైనవి, ఇంకా తెలివైనవి, ఇంకా ఉపయోగకరమైనవి ఉంటే ఉండవచ్చును. కాని తిమింగిలం అంతపెద్ద జలచరం మరొకటిలేదు. అందుచేతేదానికి అంతగర్వం. దానికున్నదల్లా ఆ శరీరంమాత్రమే అది చూసుకుని మిడిసిపడేది. మిగతాజలచరాలన్నీ దానికి సేవకులు. అది సముద్రానికి చక్రవర్తి అయితే అదికొంచెం మంచిస్వభావం కలిగినదికావడంచేత ఎవరికీ బాధకలిగేదికాదు.

ఒకరోజున కొందరు పల్లెవాళ్ళు సముద్రంలో చేపలుపడుతూ, కామకురాలోని బుద్ధవిగ్రహాన్ని గూర్చి మాట్లాడుకోసాగారు ఆ విగ్రహాన్ని చూడడానికి ఏటేటా వందలకొలది యాత్రికులు వస్తూ ఉంటారని, ఆవిగ్రహమంత ఎత్తయినది ప్రపంచంలో మరొకటిలేదని వారు చెప్పుకున్నారు. ఇదంతా చేపవిని గబగబ పరుగెత్తుకుపోయి తిమింగిలంతో చెప్పింది.

ఈ మాటవిని తిమింగిలం పెద్ద అట్టహాసంగానవ్వింది అది కదులుతుంటే పెద్దపెద్ద కెరటాలులేచాయి తనకంటె పెద్ద జంతువుగాని, వస్తువుగాని ఈ లోకంలో ఉంటుందా? అసంభవం. ఎవరో గిట్టనివాళ్లు కల్పించిన మాట అయివుంటుందనుకుంది. కాని ఆలోచించినకొద్దీ దానికి అనుమానం, ఈర్ష్య పెరిగిపోసాగాయి. ఏమోనిజంగా అంత పెద్దవిగ్రహం ఉన్నదేమో. నిజంగావుంటే ఇకతన గొప్పదనంఏముంది? వందలాదిజనం ఆవిగ్రహాన్ని పూజిస్తూ వుంటారట. దాన్నేఎందుకు పూజించాలి? తననెందుకు పూజించగూడదు. తాను మాత్రం పెద్దదికాదా? ఈవిధమైన ఆలోచనలతో దానికి కోపంవచ్చేసింది. మహోగ్రరూపందాల్చి, సముద్రాన్ని అల్లకల్లోలంగా బాదే



పాపాయి తొలిఉగాదినాడు
వేపచేదుయి త్రాగుతున్నాడు.

ఫొటో : పి. రామారావు—రాజమండ్రి.

★ బుద్ధవిగ్రహం పొడుగు ★

సింది. పెద్దపెద్దకొండలవంటి అలలు లేచి కొన్నిమైళ్ల దూరానవున్న పడవల్లోని జనంకూడా ఏమిటా యీ ఉపద్రవమని భయపడి పోయారు. మిగతా జలచరాలు కూడా తిమింగిలం దేన్ని ఏ నిమిషాన దండిస్తుందోనని కంపించాయి.

కాసేపటికి అలిసిపోయి కొట్టుకోవడంమానింది. ఒక పెద్దసారచేప ఇదే అదనని జాగ్రత్తగా, భయభక్తులతో తిమింగిలాన్ని సమీపించింది. ఈ ఆందోళనకు కారణం ఏమిటని అడిగింది. తన బాధ అంతా తిమింగిలం చెప్పింది.

"మహారాజా! మీరువట్టి అనుమానాలతో బాధపడకండి. మిమ్మల్నిమించినవారు లోకంలో ఎందుకుంటారు? అయినా మీరు సెలవిస్తే, నేనుపోయి ఆ విగ్రహం సమాచారమంతా తెలుసుకువస్తాను-" అని సారచేపఅన్నది. అనుజ్ఞతీసుకుని ఒడ్డుకు ఈదుకుని వెళ్లింది.

ఒక చెట్టుమొదలులో ఒకచిట్టెలుక కనిపించింది. సారచేపదానితో సంగతంతా చెప్పేసరికి అది తను వెళ్లి విగ్రహం కొలతలు తీసుకుని వస్తానని హామీఇచ్చింది.

చిట్టెలుక తిరిగివచ్చింది. భయంతో అది నిలువునా కంపించిపోతోంది. తనజీవితంలో అంతపెద్ద ఆకారాన్ని ఎన్నడూ చూడలేదన్నది. తానుతలెత్తి చూస్తే విగ్రహంతలకాయ కనిపించలేదంది. విగ్రహపీఠంచుట్టూ ఒకసారితిరిగితే, తనఅడుగులతో అయిదువేలఅడుగులున్నట్లు తెలిసిందని చెప్పింది

ఈముక్కలు సారచేప తిమింగిలానికి చేరవేసింది. తిమింగిలానికి కోపంతోనూ, అవమానంతోనూ వళ్లు దహించుకుపోతోంది. తిండీ నిద్రామూ నేసి ఊరికే పిచ్చెక్కినట్టు తిరిగింది. చివరికి తనంతటతనే బుద్ధవిగ్రహాన్నిచూసి అటో యిటో తేల్చుకోవా లనుకుంది. బయలుదేరి మెల్లిగా ప్రయాణంచేసి కామకురా ప్రాంతానికి చేరుకున్నది. అప్పటికి రాత్రిఅయింది. చీకటిగా ఉండడంచేత తిమింగిలాన్ని ఎవరూ చూడలేదు. చూస్తేహడలి చచ్చిపోయి వుండేవాళ్లు.

కొండశిఖరంలాంటి బౌద్ధ దేవాలయాన్ని తిమింగిలం తేలికగానే కనుక్కుంది. వెళ్లి ద్వారాలు తట్టింది.

పర్వతగుహలు ప్రతి ధ్వనించినట్టు గంభీరకంఠం ఒకటివినబడింది, 'లోపలికిరా,' అని.

"మీరే బయటికిరండీ," అన్నది తిమింగిలం.

బరువైన అడుగులచప్పుడు వినబడింది. తలుపులు తెరుచుకున్నాయి. బ్రహ్మాండమైన ఆకారం ఒకటిబయటికి వచ్చింది.

రెండు ఆకారాలూ ఒకదాన్నొకటి చూసుకున్నాయి. ఆశ్చర్యపడ్డాయి. తరవాత తిమింగిలం తన కథచెప్పింది.

ఈమాటలువిని దేవాలయానికి చెందిన అర్చకుడు గాభరాగా లేచాడు. విగ్రహపీఠం శూన్యంగా వుంది. బయటికి పరుగెత్తుకువచ్చి చూశాడు. కొండలవంటి రెండు ఆకృతులనుచూసి కెవ్వున అరచి మూర్ఛపోయాడు. బుద్ధవిగ్రహం అతన్ని లేవతీసి సేదదీర్చింది. జపతావళంతో తమఇద్దరి శరీరాలను *కొలవవలసిందిగా ఆజ్ఞాపించింది.*

అర్చకుడు కొలతను తీసుకున్నాడు. కొలుస్తున్నంత సేపూ తిమింగిలం గుండెలు గుబగుబకొట్టుకుంటూ నే వున్నాయి, ఫలితంఏమవుతుందో అనే తహతహతో. లోకోత్తర సౌందర్యంతో మెరిసిపోయే బుద్ధవిగ్రహం ముఖంలో కూడా సందేహ మలినచ్ఛాయలు పొడగట్టాయి. కొన్ని నిమిషాలు గడిచాయి.

అర్చకుడు లెక్కలు వేసి, కూడి, తీసివేసి చివరికి తేల్చి చెప్పాడు:


"తిమింగిలంగారే రెండంగుళాలు ఎక్కువ పొడుగున్నారు ప్రభూ!" అని పరమ కారుణ్యమూర్తి, దీనజనమందారుడు, భగవంతుడు అయిన బుద్ధమూర్తితో విన్నవించాడు.

విజయ గర్వంతో తిమింగిలం ఉప్పొంగిపోయింది. తన కంటె గొప్పదిసృష్టిలో లేదనిఅతిశయంతో విర్రవీగుతూ తిరిగి తన సముద్రనివాసానికి వెళ్ళిపోయింది. ఒకందుకు మాత్రం సంతోషించాలి. తిమింగిలం పొడుగే ఎక్కువఅని ఋజువు కావడం చాలామంచిది లేకపోతే పరాభవంతో ఏంచేసేదో చెప్పలేము.

బుద్ధదేవుని సుందర వదనారవిందంలో ప్రశాంత మందహాసం మాత్రం ఈ ఓటమివల్ల ఏమార్పూ చెందకపోగా, నాటికీ నేటికీ అలాగే కాంతులు వెదజల్లుతూ నేవున్నది.

(జాపనీస్ జానపదకథ)

★



రెండూ నేనే

ఫోటో: ఉప్పలూరి వెంకటశ్రీనివాసరావు-విజయవాడ.

(బొమ్మరిల్లు సీరియల్)

జూదరి

మూలం: చార్లెస్ డికెన్స్ అనువాదం: కె. రామచంద్రరావు

నెల్, ఆమె తాత ఎంతో హాయిగా జీవిస్తూ ఉంటారు. తాతకి ఎక్కువ ధనం సంపాదించాలని బుద్ధిపుట్టి, చీట్లాటకి దిగుతాడు. అప్పుల పాలవుతాడు. బాకీ పెట్టిన క్విల్ప్ అనేవాడు వాళ్ళ ఇల్లు, దుకాణం స్వాధీనం చేసుకుంటాడు. తను చీట్లాడుతున్న రహస్యం బయట పెట్టిఉంటాడని తాత తమదగ్గిర పనిచేసే కిట్ పై ఆగ్రహపడతాడు. తాతను అక్కడనుంచి దూరంగా తీసుకుపోతే కాని సుఖం, శాంతి ఉండవని, నెల్ అనుకుంటుంది. నెల్, తాత ఎవరితో చెప్పకుండా లండన్ విడిచిపెడతారు.

2

"తాతా! ఇప్పుడు మనం ఎటు వెళ్లాలి?" అని అడిగింది నెల్. తాత శూన్యంగా ఆమెవంక చూశాడు. నెల్ కి ఒకవిషయం అర్థమైంది. తాతకి తానే ఇక దారిచూపవలసి ఉంటుంది. నెల్ ఇష్టం వచ్చినట్లు దారితీసింది. తాత మాటాడకుండా ఆమె వెనుకనే బయలుదేరాడు.

లండన్ ప్రజలు ఇంకా పక్కల మీదనుంచి లేవనే లేదు. తాత, మనవరాలు ఆపాటికే లండన్ పొలిమేరలు దాటి బయటపడ్డారు. మధ్యాహ్నం అయ్యేసరికి ఒక పెద్ద పచ్చికబయలు చేరారు. ఇద్దరూ బాగా అలిసిపోయినారు. అక్కడ ఆగి, నెల్ తనసజ్జలోనుంచి కొంచెం రొట్టె తీసి తాతకిచ్చింది. తాత గబగబా తినేశాడు. అక్కడే పండుకొని నిద్రపోయినాడు. నెల్ అక్కడి ప్రకృతి అందం చూస్తూ అతని పక్కన కూర్చున్నది. తన తాతను దుఃఖసాగరంనుంచి వెలికి తీసుకువచ్చినందుకు ఆమె పరమానందం పొందింది.

ముసలాయన లేచిన వెంటనే "మనం ఇక్కడే మరికొంచెం సేపు విశ్రమిద్దామా తాతా? లేక పోతే బయలుదేరదామా?" అని అడిగింది నెల్: "వద్దువద్దు ఇక్కడ ఆగవద్దు వెళ్దాం. లండన్ కూ, లండన్ ప్రజలకు సాధ్యమైనంత దూరంలో ఉండాలి. పదపోదాం" అన్నాడు తాత.

లండన్ ప్రజలెవ్వరైనా కనిపిస్తే, తిరిగి, ఆమురికి కూపంలోకి లాక్కొని పోతారేమోనని బెదురుతున్నట్లు కనిపించాడు తాత. నెల్ ఈవిషయం తెలుసుకొని వెంటనే బయలు దేరింది.

చీకటి పడేవరకు వాళ్లు నడిచారు. ఆ రాత్రికి ఒక గ్రామంలో ఉండి మరునాడు మళ్లీ ప్రయాణం సాగించారు. ఈసారి క్రిందటి రోజుకుమల్లే నడవలేక పోయినారు. నెల్ పాదాలు బొబ్బలు పొక్కినాయి. తాతకూడా అలిసి సొలిపోతున్నాడు. మధ్యాహ్నం అయింది. నాలుగు, ఐదు మైళ్ల కంటె ఎక్కువ నడవలేక పోయినారు. ఒక గ్రామం చేరుకొని, ఎదురుగా కనిపించిన ఒక యింటికి వెళ్లారు. అది చిన్నదైనా చాలా శుభ్రంగా ఉన్నది. ఆ ఇంట్లో ఒక ముసలి, కూతురు ఆమె పిల్లలతో ఉంటున్నాడు. నెల్ లోపలికి వెళ్లి "మేము లండన్ నుంచి నడిచి వచ్చాము. చాలా అలిసిపోయినాము. కాసిని పాలు ఖరీదుకు పోస్తారా?" అని అడిగింది. ఇంటావిడ నెల్ చక్కదనం చూచి విస్మయం పొందింది. పిల్లలనుగన్న తల్లి కావటంచేత ఆమె దీనస్థితి చూచి కరుణార్ద్రి అయింది. "రా! అమ్మా! నీకు కావలసినవి పట్టుకు వెళ్లు" అన్నది. ఆమె పిల్లలు రొట్టె, పాలు తెచ్చి ఇచ్చారు. ఆమె తండ్రి నెల్ తాతను సాదరంగా ఆహ్వానించి కబుర్లలోకి దిగాడు.

నెల్, తాత సుష్టుగా భోజనం చేశారు. తిరిగి ప్రయాణమౌతుండగా ఆ ఇంటివారందరూ పోవద్దని, ఆ రాత్రికి అక్కడే ఉండవలసిందని పట్టుపట్టారు. కాని తాతకి అక్కడినుంచి వెళ్లిపోవాలని చాలా ఆదుర్దాగా ఉండటంచేత వెంటనే ప్రయాణమైనారు. ఆ ఇంటి యజమానురాలు నెల్ పాదాల బొబ్బలకు మందు రాచింది. "అమ్మా! భగవంతుడు నిన్ను రక్షిస్తాడు. నువ్వు వెళ్లినచోటనెల్లా నీకు ఆదరణ

"లభిస్తుంది." అని దీవించి సాగనం పింది.

నెల్, తాత ఎక్కువదూరం సాగిపోకముందే వెనకనించి ఒకగడ్డి బండివచ్చి ఆగింది. ఆబండివాడు ఇలాఅడిగాడు: "ఏం అమ్మాయి! మీరు ఇంతవరకు ఆయింటిలో ఉన్నారుకదూ? అక్కడనే భోజనంచేశారా?"

నెల్ ఔనన్నది. ఆబండివాడు" "అయితే బండలోకి ఎక్కండి ఆయింటివారు చాలా మంచివారు. మీసంగతి అంతా చెప్పారు. మిమ్మల్ని బండిలో ఎక్కించుకొని వెళ్ళమనిచెప్పారు" అంటూ బండిలోకి ఎక్కించుకున్నాడు. నెల్, తాత ఆ అభిమానానికి ముగ్ధులయినారు. బండిఎక్కిన తరువాత నెల్ గడ్డిలోపడుకొని నిద్రపోయింది.

మునుచీకటి పడేవేళకి బండి ఆగింది. ఇద్దరూ బండిదిగారు అల్లంతదూరంలో ఒకగ్రామం కనిపించింది. అటు వెళ్లగా వారికి మొట్టమొదట ఒక చర్చి తగిలింది. ఆచర్చి ఆవరణలో ఎవరోఇద్దరు పనిచేస్తున్నారు. నెల్, తాత వారిని సమీపించి ఆరాత్రికి బసచెయ్యటానికి వసతి ఎక్కడలభిస్తుందని అడిగారు.

అక్కడఉన్నవారిద్దరూ తోలుబొమ్మల ఆటగాళ్లు. ఊళ్ళవెంబడి తిరుగుతూ, బొమ్మలాడించి, పొట్టపోసుకునేవారు. వాళ్లు నెల్ను, తాతను తమవెంట తీసుకొనివెళ్లి ఒక సత్రంచూపించారు. వాళ్లను చూసి సత్రంయజమాని వంటలు చేయించటం ప్రారంభించాడు. నెల్, తాత కూర్చున్నవారు కూర్చున్నట్లు నిద్రపోయినారు.

మరి కొంతసేపటికి ఇంకాకొంత మంది ప్రయాణీకులు అక్కడికి వచ్చారు. ఆవచ్చినవారు బొమ్మలాటవారితో పరిచయంఉన్నవారే. అంతాకలిసి బాతాఖానీ ఆరంభించారు. వచ్చినవారిలో ఒకడు "ఆ నిద్రపోతున్న పిల్లా, ఆముసలివాడూ ఎవరయ్యా" అని ప్రశ్నించాడు. బొమ్మలాటవారిలో ఒకడు సమాధానం చెప్పాడు. "ఎవరికితెలుసు? లండన్ నుంచి వస్తున్నారట."

"ఎక్కడికి పోతారుట."

"ఎవరికి తెలుసు? మంచి మర్యాద కలవారిలా కనిపిస్తున్నారు. ఎవరికంట పడకుండా పారిపోవాలని ప్రయత్నిస్తున్నట్లున్నారు. ఆముసలాడు మరీని. ఎంత చప్పన లండన్ నగరానికి ఎంత దూరంగా పోదామా అన్న ఆదుర్దాలో ఉన్నాడు."

"అయితే సంగతేమిటో కనుక్కొని వీళ్లవర్తమానం కావలసిన వారికి పట్టిస్తే."

"మంచి బహుమానం దొరకుతుంది. అనుమానంలేదు."

సరిగా ఈ సమయానికి నెల్కు మెలుకువ వచ్చింది. మాట్లాడుతున్నవారు, ఉలిక్కిపడి మాట మార్చటానికి ప్రయత్నం చెయ్యసాగారు. వాళ్లు తమగురించే అంతవరకూ మాట్లాడుతున్నట్లు నెల్కి అర్థమైంది.

అందరూ భోజనాలై పడుకోబోయేముందు బొమ్మలాట వాళ్లలోఒకడు రహస్యంగా నెల్ వద్దకి వచ్చాడు.

"చూడునేస్తం. నేను నీమేలు కోరేవాణ్ణి. రెండోవాడున్నాడే - వాడు మంచివాడుకాడు. పైకి దయగా మాట్లాడతాడు. కాని వాణ్ణి నమ్మకు. నేను నిన్ను రక్షిస్తాను. నీవు నావెంటే ఉంటూ ఉండు." అన్నాడు.

నెల్కి ఏమీ అర్థంకాలేదు. నిత్తరపోయింది.

"ఏమండీ! ఇప్పుడేమయింది, నాకువచ్చిన ప్రమాదంఏమిటి?"

ఇలా అడిగేసరికి వెంటనే వాడు ఏమీ సమాధానం చెప్పలేక కంగారుపడి "ఏమీలేదు. కాని వాడిమాటలు నీవు నమ్మకు. నేను నీమేలు కోరేవాణ్ణి. ఇది గుర్తు ఉంచుకో." అనిచెప్పి వెళ్లిపోయినాడు.

పాపం! నెల్ భయభ్రాంతురాలై పోయింది. తాము భోజనం చేయకముందు నిద్రపోతూఉండగా కూడా వారు ఏమేమో మాట్లాడుకుంటూ, తనకి మెలుకువరాగానే ఆపివెయ్యటం గుర్తువచ్చింది. మరింతభయం వేసింది. అయితే

వాళ్లు ఏమి చెయ్యదలచుకున్నారో మాత్రం తెలియ లేదు. వెంటనే అక్కడినుంచి తప్పించుకోవాలని మాత్రం నెల్ నిశ్చయించుకున్నది.

సూర్యోదయ మైంది. నెల్, తాత బొమ్మలాటవాళ్లు కలిసి బయలుదేరారు. వారిలో ఒకడు నెల్‌ని అంటిపెట్టుకొని ఉండటం ఆరంభించాడు. మరొకడు నెల్‌పైన దృష్టినిలిపి ఉంటున్నాడు. నెల్ తప్పించుకు పోవటానికి వీలులేక పోయింది. ఆ రోజంతా వారు అలాగే ప్రయాణం చేశారు. సాయంత్రం ఒకచోటబస చేశారు. అక్కడ మరునాడు బొమ్మలాట ప్రదర్శనం జరుగుతుంది.

మరునాడు తెల్లవారు ఝామునే నెల్‌కిమెలకువ వచ్చింది. వెంటనేలేచి ఆచుట్టు ప్రక్కల ఉన్నచోట్లకిపోయి రకరకాల పువ్వులు, కోయగలిగినన్ని కోసు కొనివచ్చి చక్కటి గుత్తులు తయారుచేసింది. నెల్ పర్సులో ఒక్కపైసకూడా లేదు. ఈ పూల గుత్తులు అమ్మి కొంతడబ్బు సంపాదించవచ్చునని నెల్ ఊహ.

నెల్ పూలగుత్తులు తయారు చేస్తుండగా, తాతవచ్చి ప్రక్కన కూర్చున్నాడు. బొమ్మలాటవాళ్లు తమ పనిలో మునిగిఉండటంగమనించిందినెల్. కాని ఒకకంటితోవారు కనిపెడుతున్నారు. నెల్‌పైకి ధైర్యంగానేఉన్నది. కాని మనస్సుఆరాటపడుతునేఉన్నది. మెల్లిగా ఆమె తాతతో ఇలాచెప్పింది.

"తాతా! మనంఇప్పుడు పెద్ద చిక్కున పడ్డాము. ఇక్కడినుంచి మనం ఎలాగైనా తప్పించుకొని పోవాలి. ఈదుర్మార్గుల బారినుంచి పారిపోవాలి."

తాత ఈమాటలువిని సంచలించాడు. నెల్ మళ్లా అన్నది.

"భయపడ్డట్టు కనిపించకు. పదిలంగాఉండు. వాళ్లు మనం మాటాడుకున్నట్లు అనుమానం పడతారు. వీళ్లు చాలా క్రూరులు. వీళ్లనించి తప్పించుకొనేఅవకాశం దొరకగానే నేను సైగచేస్తాను. ఆ వెంటనే మనం పరుగు లంకించుకోవాలి."

తాత మెల్లిగా తన ఆమోదం తెలియబరిచాడు.

మధ్యాహ్నం అయిసరికి ప్రజలు తండోప తండాలుగా వస్తున్నారు. నెల్ తనుకట్టిన పూల గుత్తులను అమ్మటానికి ప్రయత్నించింది. కాని ఎవరూ కొన లేదు. ఒక్క ఆమె మాత్రం ఆపిల్లపై జాలితో ఒక గుత్తి కొన్నది.

బొమ్మలాట ప్రారంభమైంది. ప్రజలు అమితానందముతో ప్రద

ర్శనం చూస్తున్నారు. ఇద్దరు ప్రదర్శకులు కూడా విడిగా ఉన్నారు. ఒకడు తమాషాలు చేస్తూఉంటే మరొకడు ప్రేక్షకులమధ్యకుపోయి, డబ్బు వసూలు చేస్తున్నాడు. ఒక్కక్షణంపాటు వాళ్లు నెల్ సంగతి మరిచిపోయినారు. నెల్ అదను చూసింది. మెల్లిగా తాతకు సైగ చేసి జారుకున్నది.

గట్లవెంబడి పడి గబగబ వెనకైనా తిరిగి చూడకుండా పరుగు తీశారు.

ఎక్కడ ఆగకుండా వారు నడవటంసాగించారు. కాని వేగంకుంటు పడింది. ఎలాగైతేనేం చీకటిపడక ముందే ఒక గ్రామం చేరుకున్నారు.

ఒకపెద్ద ఆటస్థలములో స్కూలు పిల్లలు క్రికెట్ ఆడుకుంటున్నారు. కొందరు పెద్దవారు ఆటచూస్తూ నిలబడ్డారు. ఎవ్వరూ తాతనిగాని నెల్‌నిగాని చూడలేదు. నెమ్మదిగా ఇద్దరూ స్కూలుభవనం వేపు వెళ్లారు.

స్కూలు ఆవరణలో ఒకాయన సుఖంగాకూర్చుని పొగ తాగుతున్నాడు. గేటుదగ్గరికి వీరు రావటంచూసి, చట్టునలేచి, తలుపు తీశాడు.

"మేము ఇద్దరమూ చాలా దూరంనుంచి వస్తున్నాము. బీద వాళ్ళం. ఈ రాత్రికి మేముబస చేయటానికి ఎక్కడవీలవుతుందో చెప్పండి. ఉన్నంతలో డబ్బు చెల్లించుకుంటాం" అన్నదినెల్.

ఆయన ఒకసారి నెల్‌వంక, ఒకసారి తాతవంకచూశాడు. చాలా జాలిపడ్డాడు. "నేను ఈస్కూలులో ఉపాధ్యాయుడిని. ఉపాధ్యాయులు అందరూ సాధారణంగా చాలాబీద వారు. నేను మరీ బీదవాణ్ణి. నాకు ఉన్నంతలో మీకుపెడతాను. రండి లోపలికిరండి" అంటూ ఆయన తాత చెయ్యిపట్టుకొని లోపలికి తీసుకు వెళ్లాడు. నెల్ నెమ్మదిగా వారి వెనక వెళ్లింది.

అదొకచిన్న క్లాసుగది. ఉపాధ్యాయుడు వారిద్దరినీ ఆగదిలో ఒక బల్లపై కూర్చోబెట్టాడు. బల్లపై ఒక తెల్లటి గుడ్డ పరిచి, భోజనం వడ్డించాడు. అతిథులు సుష్టుగా ఆరగించిన తరువాత వారికి పడుకునేటందుకు పక్కలు చూపించాడు. నెల్ ఆదయామయునికి తనకృతజ్ఞత తెలిపింది. ఎంత మంచివాడు ఆయన? తనకున్నంతలో, వారిని ఆదరించాడు. వాళ్లని అనవసర ప్రసంగంతో వేధించ లేదు. ఎవరు మీరు? ఎక్కడి



"అద్దమెలంటాను అందాలు దెలుప"

—ఫొటో: ఉప్పలూరి వెంకట శ్రీనివాసరావు—విజయవాడ.

నుంచి వస్తున్నారు? ఇతేమీ అడగ లేదు.

ప్రభాత సమయమైంది. నెల్ చాలా పెందలకడ లేచింది. ఆయన అప్పటికేలేచి అలవాటుప్రకారం కొంతదూరం నడిచిరావటానికి వెళ్లాడు. ఆయన తిరిగి వచ్చే సరికి నెల్ ఇల్లంతా చాలా శుభ్రంగా అమర్చింది. ప్రాతఃకాల ఫలహారాలు తయారుచేసింది. ఆనాడు మామూలుగా ఇల్లు తుడిచే అవ్వరాలేదు. ఆ అవ్వఎప్పటికీ రాకపోయినా ఫరవాలేదని, నెల్ ఎప్పుడూ తనచిన్న కుటీరంలోనే ఉండిపోవాలని ఆయన మనసులో పదేపదే కోరుకున్నాడు.

ఫలహారాలు సేవించినతరువాత నెల్ తాము వెళ్లిపోవటానికిఅనుజ్ఞ ఇవ్వమని కోరిందికాని ఆయన అంగీకరించలేదు.

"మీరు ఎక్కడికి వెళ్దామనుకుంటున్నారో నాకు తెలియదు. అక్కడ మీకుగలపని ఏమిటో కూడా నాకు తెలియదు. తెలుసుకోవాలనికూడా నేను అనుకోవటంలేదు. అయితే మీరుబాగా అలిసిపోయిఉన్నారు. కనుక ఈ రోజు ఇక్కడేఉండి విశ్రాంతి తీసుకోవాలని, నేనుకోరుతున్నాను."

నెల్ తాతవంకచూసింది. తాత ఈ ఆహ్వానాన్ని త్రోసిపుచ్చలేకపోయినాడు. పాపంతాత చాలానీరసంగా విశ్రాంతిలేకుండా నడవలేని స్థితిలో ఉన్నాడు.

నెల్ వంటగదిలోనికి వెళ్లి పని చెయ్యటం ప్రారంభించింది. ఇది చూచి ఉపాధ్యాయుడు చాలా మురిసిపోయినాడు. ఆరోజు అందరికీ ఆనందంగా గడిచిపోయింది.


మరునటి రోజు ఉదయం ఫలహారాలు కాగానే నెల్ ఉపాధ్యాయునికి కృతజ్ఞత తెలిపి తాతను బయలుదేర దీసింది. బొమ్మలాట ప్రదర్శన సమయంలో తానుపూలగుత్తి అమ్మగా వచ్చినచిన్న కాసుని తమ భోజనాలకయిన ఖర్చుక్రింద ఆయన చేతిలో పెట్టబోయింది నెల్. ఆయన తీసుకోలేదు. "మార్గమధ్యంలో ఎప్పుడయినా నీకు ఆ డబ్బు అవసరంకావచ్చు. కనుక ఆ నాణెం నీ దగ్గరేఉంచుకో. నేను మీకుఇచ్చిన ఆతిథ్యానికి నీవు ఆ డబ్బు చెల్లిస్తున్నావు బాగానే ఉన్నది. కాని నాకు నిన్న నీవు చేసిపెట్టినపనికి నేను ఎంత డబ్బు చెల్లిస్తే ఋణం తీరుతుంది. మీరిద్దరూ ఇక్కడ ఒకరోజు గడిపి నాకు ఎంతో ఆనందం చేకూ

వి. ఎస్. చెన్నూరి

జానకి రామయ్యగారికి ఇద్దరు భార్యలు, మొదటి భార్య అయిన పార్వతమ్మగారికి సంతానం లేకపోవటంచేత రెండో వివాహం చేసుకున్నారు. కొన్నాళ్ళకి ఇద్దరు భార్యలకు ఇద్దరు కుమారులు పుట్టారు. ఆతరువాత కొన్నాళ్ళకి పార్వతమ్మ తనకొడుకు గోపీ ముద్దుముచ్చటలు చూడకముందే గతించింది. గోపి సవతితల్లి పెట్టుపోతలకి తలబిగ్గ వలిసివచ్చింది.

సౌమిత్రమ్మ తన కుమారుడు రాముని చూచినంత ప్రేమగా గోపిని చూచేదికాదు. ఇది అలుసుగా తీసుకుని రాముకూడా గోపీమీద లేనిపోని చాడీలు చెప్పి చీవాట్లు పెట్టించి, తాను మహా తెలివయిన వాడినని ఋజువు చేసుకునేందుకు ప్రయత్నించేవాడు.

గోపిచాలా ఉదారస్వభావుడు. సవతితల్లి రాముల ప్రవర్తన గురించి ఎవరితోనూ చెప్పుకునే వాడుకాదు. అసలు మనసులో నయినా పెట్టుకునే వాడుకాదు.



"నోళుల ప్రేళులు పాలబుగ్గలా
ఎక్కడచూస్తే అక్కడ విహారై—"

—ఫొటో: ఉప్పలూరి వెంకట శ్రీనివాసరావు, విజయవాడ.

★ జూదరి ★

ర్చారు. నాజన్మలో నేను నీ ఋణం తీర్చలేను." ఇలా చెప్తుంటేగా ఆయన కళ్ళల్లోనీరు తిరిగింది. నెల్ కూడా ద్రవించి పోయింది. ఒక్కమాట చెప్పలేకపోయింది, కళ్ళతోనే తిరిగి కృతజ్ఞత ప్రకటించి సెలవుతీసుకొని బయలుదేరింది. తాత మెల్లిగా నెల్ ని అనుసరించాడు.

ఆ ప్రయాణానికి అంతు అంటూ ఉన్నదా లేదా అనిపించింది. దారి పొడుగునా కంటికిఇంపుగా ఉండేది ఒక్కటి కనిపించలేదు. ఎండ మహా తీక్షణంగా ఉన్నది. అలాగే వాళ్ళిద్దరూ నడకసాగించారు.

(ఇంకా వుంది)

★ తెలుగు నోట్సు ★

గోపికి తనఇంట్లో జరుగుతున్న అన్యాయంగురించి జానకిరామయ్యగారికి తెలియకపోలేదు. కాని, సౌమిత్రమ్మగారి నోటికిభయపడి చూచీచూడనట్టే పోతుండేవాడు.

రాముకంటెగోపికి యింట్లోవసతులు తక్కువయినప్పటికీ, క్లాసులో గోపికి మంచిమార్కులొచ్చేవి. అందరూ గోపీనిమెచ్చుకునేవారు. రాముకిది కిట్టేదికాదు. ఈకసి ఇంట్లో ఏదోవిధంగా తీర్చుకొనేవాడు.

ఆయేడుఇద్దరూ స్కూల్ ఫైనల్కువచ్చారు. జానకిరామయ్యగారు ఇద్దర్నీ చెరో టీచరువద్ద ట్యూషన్కి ఒదలిపెట్టారు. పరీక్షలు దగ్గర పడుతున్నాయి.

'ఈ నాలుగురోజులూ సినిమాలకీ, షికార్లకీతిరగకుండా ప్రైవేటుకెళ్ళి శ్రద్ధగాచదవండ'ని జానకిరామయ్యగారు కొడుకులిద్దరికీ హుకుం జారిచేశారు.

ఆరోజు ఏదో మంచి ఇంగ్లీషు పిక్చర్ ఆడుతున్నదని రాముకి తెలిసింది. ఆవూళ్ళోకి ఏకొత్తపిక్చర్ వచ్చినానసరే రాము మొదటిరోజే హాజరు అవుతాడు. లేకపోతే నిద్రపట్టదు. ట్యూషన్కి వెళుతున్నట్టు పుస్తకాలు చంకనబెట్టి, తల్లిదగ్గర రహస్యంగా డబ్బు వసూలుచేసుకుని బయటపడ్డాడు. రాముకి సినిమాథియేటర్లో ఒకబెంచీమీద ఏదోపుస్తకం అవుపించింది. బహుశా'మ్యాటినీ'కి వొచ్చిన వాళ్ళెవరో వదలిపెట్టి వెళ్లుంటారు. ఆపుస్తకాన్ని తీసుకున్నాడు. "లిఫ్కోతెలుగునోట్సు" పుస్తకంమీద గోపీపేరు ఉన్నది. గోపీమ్యాటినీకి వచ్చిఉండాలి. లేదా, గోపీవద్దపుస్తకం పుచ్చుకున్న మరెవ్వరయినా వచ్చిఉండాలి. లేకపోతే ఈపుస్తకం ఇక్కడికెలా వస్తుంది?— ఎలానయితేనేం? నాన్నగారికి పుస్తకం చూపెట్టి థియేటర్లో దొరికింద అనిచెబితే గోపీకి చీవాట్లుపెట్టించవచ్చు, కాని తానుపిక్చర్కు వెళ్లినట్టుమాత్రం నాన్నగారికి తెలియకూడదు.

పిక్చర్ పూర్తయింది. నాన్నగారితో ఎలాబొంకితే తనవిషయం బయటపడకుండా గోపీకి బాగా చీవాట్లు లభిస్తాయోదారిలో ఆలోచించుకువచ్చాడు.

అప్పుడే ట్యూషన్నుంచి వస్తున్నట్లు నటిస్తూ "నాన్నగారూ! రంగయ్యపంతులు గారబ్బాయి రండో ఆటకి వెళ్లాడుట. థియేటర్లోపడిఉందట ఈపుస్తకం. 'అసలిది అక్కడికెలావెళ్లిందో కనుక్కోండి గోపీని" అంటూ పుస్తకాన్ని జానకిరామయ్యగారి ముందు పెట్టేడు. మధ్యాన్నం జానకిరామయ్యగారు ఆఫీసునుండి

వస్తుంటే తోటి గుమాస్తా రాజారావుగారు నిన్న మావాడు మీ గోపీనడిగి తెలుగునోట్సు తెచ్చుకున్నాడట, మీరు వెళ్ళేటప్పుడు మరిచిపోకుండా పట్టుకుపోండి, అని తిన చేతికిచ్చిన విషయం చటుక్కున జ్ఞాపకానికి వచ్చింది. జానకిరామయ్యగారే ఆఫీసునించితిన్నగా మ్యాటినీకెళ్ళి పుస్తకాన్ని అక్కడే వదిలిపెట్టివచ్చారు.

పోతే, రంగయ్యగారబ్బాయి ఇంతకుముందే రాముకోసం వొచ్చాడు. 'రాము ట్యూషన్‌లో లేడూ?' అని అడిగితే 'లేదండి. అసలు నాన్నగారు ఇంట్లో లేరు' అని చెప్పాడు.

జానకిరామయ్యగారికి రాముఆడుతున్ననాటకం క్షణంలో అర్థమైపోయింది.

"ఓహో అలాగా? అయితే తమరుతిన్నగా ప్రయివేటునించేనా రావడం?" అని అడిగారు.

"అవునండీ, కావలిస్తే రంగయ్యగారబ్బాయినడగండి" అని బుకాయించాడు రాము.

"ఆహా! అయితే కాస్తయిలా రామ్మా" అని, దగ్గరికిపిలిచి రాము చొక్కాజేబులో చెయ్యివేసేసరికి నగంచించిన సినిమాటిక్కట్టూ చిల్లరడబ్బులూ దొరికిపోయినాయి.

ఏపాపం ఎరుగని గోపీమీద చాడీలు చెప్పినందుకు జానకిరామయ్యగారు అగ్గయినారు. ఆయనకి కోపంరాదు. వచ్చెనా దూర్వాసుడంతటివాడు.

రాముకీ—రాముని అలా తయారు చేస్తున్న సౌమిత్రమ్మకీ గూడా ఆరోజు బాగా చీవాట్లు అమరినాయి.

తనస్థితి 'మెయ్యబోయి మెడకు వేసుకున్నట్ట'యి నందుకు అమితంగా విచారమేసింది రాముకి.

ఎలాగయితేనేం, ఆనాటినుండి గోపీమీద చాడిలు చెప్పాలంటే మాత్రం, గుండెల్లో గుర్రాలుపరుగెత్తేవి, ఎటుబోయి ఎటువొస్తుందోనని. ★

దేవకన్య

భూలోకమంతటా తిరిగి దేవలోకానికి వెళ్ళబోతున్న దేవకన్య ఒకచోట ఒకతోటలో పచ్చికమీద పడుకుని నిద్రపోతున్న ఒక బాలికను చూసింది.

"ఎంత అందమైన బాలిక! మానవ బాలిక కాదేమో! దేవలోకంనుండి ఎవరో దొంగిలించుకుని వచ్చారేమో" అనుకుంది.

మానవ బాలిక అవునో కాదో తెలుసుకోవాలని కుతూహలంతో ఆమె నేలకు దిగివచ్చింది. బంగారపు తీగలవలె మెరిసే సన్నటి రెండువేళ్లతో ఆ బాలిక బుగ్గలను నొక్కిచూసింది.

నోటిదగ్గిరగా, పెదవులకు పక్కగా, చిరునవ్వుల వలయం అంతమయ్యేచోట ఆమె వ్రేళ్లు ఆనినవి. "అబ్బే, దేవలోకపు బాలికకాదు. మామూలు మనిషే," అనుకుని తనదారిన వెళ్ళిపోయింది.

కాని ఆమె వ్రేళ్లుంచిన చోట గుర్తులుమాత్రం అలాగే వుండిపోయాయి.

అందుకే ఓ అందాల చిన్నారీ! నువ్వు చిరునవ్వునవ్వినప్పుడు నీబుగ్గలమీద రెండు సొట్టలు సాక్షాత్కరిస్తాయి—దేవలోకపు దేవకన్యక వ్రేళ్లు తాకిన పసిడిగుర్తులు!

అందుకే ఓ అందాల బాలా! నిన్నెప్పుడూ నవ్వించడానికే అందరూ ప్రయత్నిస్తారు. నువ్వు నవ్వినప్పుడల్లా మల్లెమొగ్గలవంటి బుగ్గలపైన చక్కని పసిడి సొట్టలు తళుకుమంటాయి! ★

★ ఆడ బ్రతుకు ★

(౩౦-వ పేజీ తరువాయి)

చేతులూ గడ్డంపట్టుకొని, ఆఖరుకు మగపెళ్లి వారివంటవాణ్ణి, ముత్తైదువునూకూడా బ్రతిమాలవలసి వచ్చింది.

వాళ్లకు మిగిలిన నాలుగువేలూ కార్యంనాటికేనా యిచ్చేయాలని తండ్రి పట్టుదల. కాని పెళ్లికే, ఆరువేలు పైన అయిపోయింది. డబ్బు పుట్టడంలేదు. మిగిలిన ఆ కాస్త ఇల్లూ తనఖా పెడదామన్నా, అప్పివ్వడానికి ఎవ్వరూ సిద్ధపడడంలేదు. పెళ్లయి ఏడాది దాటింది. చుట్టుప్రక్కలవాళ్లు "ఇంకా ఎన్నాళ్లుంచుకుంటావయ్యా యీడొచ్చిన పిల్లని? ఆ కాస్త శుభకార్యం, అయిందనిపించి, అత్తారింటికి పంపేయక" అని అడపాతడపా అంటున్నారు. ఎద్దుపుండు కాకికేమి తెలుస్తుంది? చివరకి పరంధామయ్యగారు, ఏ కళనున్నాడో కాని, ముందు వెయ్యి రూపాయిలిస్తే, వచ్చి కార్యం చేసుకుంటామనీ, మిగిలినది తర్వాత యివ్వవచ్చనీ, కబురుచేసేరు. తండ్రి ఎగిరి గంతేసేడు. మార్వాడీకి, ఎలాగో నచ్చచెప్పి, యిల్లు తనఖాపెట్టి, ఒక వెయ్యిరూపాయలు తెచ్చి కార్యం అయిందనిపించేడు.

అత్తవారింటికి వెళ్లేసరికి జానక్కి మామగారి దయకు కారణం తెలిసింది. అత్తగారు మంచం ఎక్కింది. కాచిపోసేందుకు యింట్లో ఆడదిక్కు లేదు. పుట్టింటిలో పువ్వులలో పెరిగిన జానక్కి అత్తవారింటిలో అడుగు పెట్టేసరికే, వంటపని, యితర చాకిరీ తగిలింది. అగోరామయా వస్థలో పడిపోయింది కాని, తనని పంపేటప్పుడు తండ్రి చెప్పిననీతులూ, చదివిన చదువూ కాపాడాయి జానక్కి. పట్టుదలతో వంట చేయడం నేర్చుకుంది. అత్తగారికి చాకిరి విషయంలో కూడా, కొంచెమైనా లోపంరాకుండా, చేసింది. మొదటి ఆరునెలలూ విశ్రాంతి అన్నది ఎరగదు. ఈ విషయం, తండ్రికి తెలిస్తే బాధపడతాడని, కులాసాగానే ఉన్నానని మాత్రం ఉత్తరాలు వ్రాసేది. అప్పటికి ఒకసారి తండ్రి వచ్చేడు. ఆయనను మభ్యపెట్టడానికి జానకి ఎంతో నాటకమాడవలసి వచ్చింది. మామగారు మిగిలిన డబ్బువిషయం ఖచ్చితంగా అడగడంవల్ల, తండ్రి చిన్నబుచ్చుకొని వెళ్లిపోయాడు. ఆ డబ్బు పూర్తిగా యిచ్చేసేవరకూ, అక్కడకు రావడానికి ముఖం చెల్లడంలేదని బెంగపెట్టుకోవద్దని రాసేడు. —ఇంతలో యీ ప్రమాదం.

జానకి ఆలోచనల్లోంచి, యీ ప్రపంచంలోకి వచ్చేసరికి రైలు కొండపల్లి స్టేషను వదిలిపెట్టింది. బెజవాడ దగ్గర పడుతోంది. ఆమె గుండె దడదడా కొట్టుకుంటోంది. తండ్రి ఎలా ఉన్నాడో తాను వెళ్లేవరకూ బ్రతికిఉంటాడా? - వళ్లంతా ముచ్చెమటలు పోసేయి. లేవబోయింది. కాళ్లు దడదడలాడేయి.

రైలు బెజవాడస్టేషనులో ఆగింది. జానకి రైలు దిగి ప్లాటుఫారంమీద నిలబడింది. తనకోసం, ఎవ్వరూ రాలేదు. నాన్నకి ఎలా ఉందో? స్టేషను బయటికి వచ్చి రిక్షాలో కూర్చుంది. శరీరంకంటె మనస్సు ముందు యింటివైపు పరుగెత్తుతోంది. ఆందోళన, ఆవేదన, ఆతురత, ఆమెని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. రిక్షా ఆగింది. తలుపు తెరుచుకొని అన్నగారు బయటికి వచ్చేడు. ఆమెని చూచి అమాంతంగా, కౌగలించుకొని "జానా! నాన్న వెళ్లిపోతున్నాడు" అని బావురుమన్నాడు. ఆతర్వాత ఏం జరిగిందో జానక్కి చాలాసేపటివరకు తెలియదు. స్పృహ వచ్చేసరికి తండ్రి మంచంమీద కూర్చొనిఉంది. ఆయన మరణోన్ముఖుడై ఉన్నాడు. కన్నులు తెరిచి ఉన్నా చూడటంలేదు. జానక్కి దుఃఖం, ఉప్పెనలా ఉబికివచ్చింది. తండ్రిమీద పడి గొల్లుమంది.

తండ్రి పోయిన మూడో రోజునైనా జానకి పచ్చి మంచినీళ్లు పుచ్చుకోలేదు. అన్నగారు బ్రతిమాలేడు. వదినగారు బ్రతిమాలింది. చుట్టుప్రక్కలవాళ్లు బ్రతిమాలేరు. ఏమీ లాభం లేకపోయింది. మంచాన్ని అంటిపెట్టుకుని నిర్జీవంగా పడిఉంది. సాయంకాలానికి అత్తగారూ మామగారూ ఖర్రా వచ్చేరు. సంగతి విని అత్తగారు మందలిస్తే లేచి కొద్దిగా ఎంగిలిపడింది. మరునాడు మధ్యాహ్నం హాలులో అన్నగారూ మామగారూ ఏదో ఘర్షణపడటం వినబడింది అయినా జానకి పట్టించుకోలేదు. సాయంకాలం మూడు గంటలకి, అత్తగారు వచ్చి "అమ్మాయీ! మేము వెడుతున్నాం! నువ్వు బెంగపెట్టుకోకు. ఆయనకేం మహారాజు! ఏదో వెళ్లిపోయాడు. చూడు! నువ్వు వచ్చేటప్పుడు కట్నం బాపతు, మిగిలిన మూడువేలూ, మీ అన్నయ్యని గట్టిగా అడిగి తేవాలనీ - లేకపోతే - చూడూ! మీ మామగారెంత కోపిష్టో నీకు తెలుసుగా!" అని వెళ్లిపోయింది. జానకి నిర్లిప్తతతో వింది. ఆ మాటలు ఆమెకు సరిగా బోధపడలేదు. ఆమె వారిని గుమ్మందాకా సాగనంపాలన్న సంగతికూడా గుర్తించలేదు.

తండ్రిపోయిన నక్షత్రం చెడ్డదవడంవల్ల, యిల్లు ఆరునెలలు వదిలేయాలని సిద్ధాంతులు నిర్ణయించేరు. అన్నయ్యా వదినా సామాన్లు సర్దుకుంటున్నారు. రోజులు గడవడంతో జానకి పూర్తిగా మనుష్యులలోకి వచ్చింది కాస్త నిలదొక్కుకుంది. "ఇక ముందేం చెయ్యాలి?" అన్న ఆలోచన కలిగింది. ఇక యిక్కడ ఉండడం అనవసరం, తిరిగి తన యింటికి హైదరాబాదు వెళ్లిపోవడమే మంచిదనుకుంది. అత్తగారు వెళ్లిపోయేటప్పుడు చెప్పిన మాటలు జ్ఞాపకమొచ్చేయి. "కట్నం బాపతు డబ్బు తీసుకొని రాకపోతే" అని అత్తగారు అర్థోక్తిలో వదిలేయడం, ఆమె గుర్తుకి తెచ్చుకుంది. గుండె గుబగుబలాడింది. మామగారు పైకి ఎంత మర్యాదగా మాట్లాడినా బహు నిక్కచ్చి మనిషి. ఆగ్రహం కలిగిందంటే, ఎంతకైనా, సాహసిస్తాడు. ఆయనముందు జానకి భర్త కూడా పిల్లిలా తప్పించుకొని తిరుగుతాడు. ఇప్పుడేం చేయాలి? అన్నగార్ని మెల్లగా అడిగితే - పాపం వాడుమాత్రం యిప్పుడు, ఎక్కడనుంచి తేగలడు? - అయినా అడగక తప్పదు - వాడేం ఆలోచిస్తాడో.

హాలులో దస్తావేజులు చూసుకుంటున్న, అన్నగారిదగ్గరకు వెళ్లి నిలబడింది జానకి. విషయం ఎలా కదపాలో తెలియక బొటనవ్రేలితో నేలను రాస్తో నిలబడింది. అన్నయ్య తల పైకెత్తి "ఏం" అన్నట్లు చూసేడు.

"నేను రేపు ఆదివారం వెడదామనుకుంటున్నాను" అంది జానకి.

"సరే" అని అన్నయ్య మళ్లీ కాగితాలు చూసుకుంటున్నాడు.

"కట్నం బాపతు మూడువేలూ వచ్చేటప్పుడు పట్టుకురమ్మని మరిమరి చెప్పింది, వెళ్లేటప్పుడు మా అత్తగారు"

అన్నగారి పరధ్యానం మాయమైంది. నిదానంగా జానకి ముఖంలోకి చూస్తూ "ఆ సంగతి మొన్న మీ మామగారికి చెప్పేసేనుగా? మూడువేలు కాదుకదా మూడు దమ్మిడీలుకూడా ఆశించక్కరలేదని" అన్నాడు.

"నాన్న యిస్తానని ఒప్పుకున్నాడుగా అన్నయ్యా! ఇప్పుడు ఆయన లేడుగదా అని ఎగవేయబోతే వాళ్లు ఊరుకుంటారా? మా మామగారి సంగతి నీకు తెలుసుగా ముక్కుమీద ఉంటుంది కోపం" అంది జానకి, భయపడుతూ.

"ఊరుకోపోతే ఉరిపెట్టుకోమను. నాదగ్గర ఒక్క రాగిదమ్మిడీకూడా లేదు - నేనేమీ యివ్వలేను. - నన్ని విషయంలో బాధపెడితే లాభంలేదు"

జానక్కి తనపరిస్థితినిగురించి అన్నగారికి ఎలా నచ్చచెప్పాలో బోధపడలేదు. ఆలోచిస్తోంది. ప్రక్కగదిగుమ్మందగ్గిర వదినగారు వచ్చి నిలబడింది, అన్నాచెల్లెళ్ళ సంభాషణ వినడానికి.

"అన్నయ్యా! పోనీ ఒక ఉత్తరం రాసెయి!

చేస్తానని. లేకపోతే నాకక్కడ చాలా అవమానం జరుగుతుంది" అంది జానకి దీనంగా.

"అలా కుదరదు! ఉత్తరం రాసిస్తే వాళ్లు గోప్పచేసికొట్టి వసూలు చేస్తారు. ఇప్పటికే మామగారు యిల్లంతా గోకిపెట్టేరు నీకు. ఆశకు అంతుండాలి. అయిందేదో అయింది. ఇంకేనా, మా మానాన మమ్మల్ని బ్రతకనియ్యి మాతల్లీ" అని రుంజుకుంటూ వదినగారు వంటింట్లోకి వెళ్లిపోయింది.

అభిమానవతియైన జానకికి దుఃఖం ఒక్కపెట్టున ముంచుకొని వచ్చింది." అంతేనా! అన్నయ్యా" అంది బిగ్గరగా. అన్నగారు తలవంచుకొని జవాబియ్యలేదు.

"సరే! నాకు పుట్టింటిఋణం నాన్నతోనే తీరిపోయింది. పోయి వాళ్ల కాళ్ళమీదే పడతాను - ఇక నీ గడప తొక్కను. నీయింట్లో పచ్చి మంచినీళ్లుకూడా పుచ్చుకోను" అని జానకి చివాలున లేచి తన గదిలోకివెళ్ళి సామాను సర్దుకుంది. వీధిలోకి వచ్చి ఒక సైకిల్‌రిక్షా పిలిచి సామాను అప్పగించింది. "వెడుతున్నాను అన్నయ్యా - వెళ్లొస్తానమ్మా వదినా" అని వీధిలోకి నడిచింది.

అన్నగారూ, వదినగారూ, యిద్దరూ యీ హఠాత్పరిణామానికి నివ్వెరపోయారు. "నీకు మూడుగంటలదాకా రైలు లేదు. ఇప్పటినుంచీ వెళ్లడం ఎందుకే జానా" అన్నాడు అన్నయ్య బాధగా. ఒక్కక్షణంపాటు అన్నయ్యలో తండ్రిని చూసింది జానకి. "బావురు"మని ఏడవాలనిపించింది. కాని నిగ్రహించుకొని, అన్నయ్యవైపు పెడముఖం పెట్టి, రిక్షాలో కూర్చుని "పోనియ్యి" అంది.

ఆడవాళ్ల వెయిటింగ్‌రూమ్‌లో కూర్చుని రైలుకోసం నిరీక్షిస్తోంది జానకి. అవమానం, దుఃఖం, ఆవేదనలతో హృదయం ఉడికిపోతోంది. కళ్ళు మంకెనపువ్వుల్లా ఎర్రబడ్డాయి. ఇంతలో అన్నగారు వచ్చేడు, టిఫిన్ కారియర్‌తో అన్నం పట్టుకొని.

"నా కక్కరలేదు. పట్టుకుపో!" అని పిచ్చిదానిలా అరిచింది జానకి. అన్నగారు తెల్లబోయాడు. చుట్టూ ఉన్న వాళ్లు ఆశ్చర్యపడ్డారు.

"పోనీ యీడబ్బు తీసుకో" అని మూడు పది రూపాయల నోట్లు యివ్వబోయేడు అన్నగారు.

"నా కవసరం లేదు. నువ్వు వెళ్లిపో" అని జానకి బాత్‌రూములోకి పోయి తలుపు వేసుకుంది.

రైలు వచ్చింది. జానకి మూడో తరగతి ఆడవాళ్ళ పెట్టిలో ఎక్కి కూర్చుంది. గార్డు విజిల్ వేసి పచ్చజెండా ఊపేడు. రైలు కదిలింది. జానకి కన్నీటి తెరలమధ్యనుంచి, ప్లాటుఫారంమీద దిగాలుపడి చూస్తూ నిలబడ్డ అన్నగారు మసక మసకగా కనబడ్డాడు. ఆమె గుండె కలుక్కుమంది.

జానకిని రైలులో ఉన్నంతసేపూ ఆవరించిన స్తబ్ధత్వం, హైదరాబాదు రైలు దిగి జట్కా ఎక్కేటప్పటికి దిగిపోయింది. ఇంటికి వెళ్ళేక ఏం జరుగుతుందో నన్న కొత్త భయం పట్టుకుంది. గుండె గబగబా కొట్టుకుంటోంది. ఇల్లు దగ్గరైనకొద్దీ ఆవేదన అంతకంతకు పెరిగిపోతోంది. జట్కా గేటు ముందు ఆగింది. జానకి, బలవంతంగా దిగి గేటుతలుపు తెరుచుకొని లోపలికి వెళ్లింది. తన యింట్లోకి తాను వెళ్ళడానికి అంత భయ మెందుకో ఆమెకు బోధపడ లేదు. కాని అది తన యిల్లేనా అన్న అనుమానం వెంటనే తరుముకొనివచ్చింది.

బలహీనంగా వీధితలుపు తటింది. రెండు సార్లు తట్టేక, కిటికీ తలుపు తెరిచి అత్త గారు తొంగిచూచింది. ఏవో గుసగుసలు వినబడ్డాయి.

"డబ్బు పట్టుకొని వచ్చేవేమో మీ మామగారు కనుక్కోమంటున్నారు" అంది అత్తగారు నీరసంగా.

జానకి కాళ్లు గజగజలాడేయి. భయపడినంతా జరిగింది. "మా అన్నయ్యదగ్గర యిప్పుడు డబ్బు లేదుట" అంది జానకి దిగులుగా.

"ఆ డబ్బు లేకుండా యిక్కడ ఏమంత ములిగిపోయిందని పడివచ్చింది? పొమ్మను - ఆడబ్బు తెచ్చినప్పుడే తనీ యింట్లో అడుగుపెట్టడం" - మామగారి అరుపులు వినబడ్డాయి.

జానకి సర్వనాశనమైనానన్న సంగతి గుర్తించింది. అయినా నీటిలో మునిగేవాడు గడ్డిపరకను పట్టుకొన్నట్లుగా "నేను వట్టి మనిషిని కాదని నీకు తెలుసుగా అత్తయ్యా!" అంది కిటికీ కమ్ములు పట్టుకొని. అత్తగారు మాట్లాడలేదు. గుడ్లనీళ్లు గ్రుక్కుకుంది - 'నేనూ నీలాంటి నిస్సహాయురాలైన ఆడదాన్నే జానకీ' అన్నట్లుగా చూస్తూ.

"అత్తయ్యా! మీ అబ్బాయిని ఒకసారి పిలవండి" అంది జానకి, పోనీ యీ సహాయమైనా చెయ్యండి అన్నట్లు.

"వీలు లేదు. వాణ్ణి చూడటానికి వీలులేదు మంచి ఎత్తేవేసింది. నా కొడుకును, నాలోంచి విడదీద్దామని కాబోలు - పొమ్మను - వెంటనే పొమ్మను" అని మామగారు కేక వేస్తూ వచ్చి కిటికీతలుపులు ఫడాలు మని మూసేసేడు.

ఆ యింటి తలుపులు తనకు శాశ్వతంగా మూసుకుపోయాయని జానకి గ్రహించింది. వస్తుందేమోనని భయపడ్డ ఆపదవచ్చి మీద పడినతర్వాత హృదయం తేలికపడుతుంది. జరుగుతున్నదంతా ఆశ్చర్యంగా చూస్తూ నిలబడ్డ జట్కావాలాని "సామాను మళ్ళీ తీసుకువెళ్లి బండిలో పెట్టు" అంది జానకి తీక్ష్ణంగా. ఒకసారి యింటివైపూ, తాను నీళ్లుపోసి పెంచిన మొక్కలవైపూ దీనంగా చూచి, చకచకా నడిచి గేటుతలుపు తెరుచు

★ ఆడ బ్రతుకు ★

గానివెళ్లి బండిలో కూర్చుని "సేవను?" అంది.

ఎక్స్‌ప్రెస్ కదిలేవరకూ తాను మగవాళ్ల పెట్టిలో కూర్చున్నట్లు గ్రహించలేదు జానకి. మొదట భయపడింది. వెంటనే నవ్వుకుంది, నిండా మునిగినవాడికి చలేమిటని! కిటికీలోంచి బయటకు చూసింది. చీకటిని చీల్చుకొని రైలు మహావేగంగా పోతోంది. ఆకాశంలో కారుమబ్బులు క్రమ్ముకొని వస్తున్నాయి. చలిగాలి రివ్వు రివ్వుమని వీస్తోంది. తన మనస్థితిలాగే ప్రకృతికూడా మహాభయంకరంగా ఉందనుకుంది జానకి.

ఏడాదిక్రిందట తండ్రి ఏడెనిమిదివేలు ఖర్చుపెట్టి అగ్నిసాక్షిగా తనకొక స్థానం సంపాదించిన యింటినుంచి యీనాడు నిర్దాక్షిణ్యంగా గెంటివేయబడింది. ఆ యింట్లో కుర్చీకి, చెంబుకి, మంచానికీఉన్న స్థానంకూడా తనకు లేకుండా పోయింది. జబ్బుపడ్డ అత్తగారికి ఆరునెలలు నిద్రాహారాలు లేకుండా చాకిరీ చేసింది. పుట్టింట్లో పూచికపుల్లైనా యిక్కడిది అక్కడ పెట్టని తాను, అన్ని పనులూ కొద్దికాలంలోనే నేర్చుకొని "కోడలు వచ్చినతర్వాతే, కాస్త కడుపునిండా తింటున్నాను" అని మామగారిచేత అనిపించుకుంది. కాపరానికివచ్చిన క్రొత్తలో భర్త "జానకీ! నువ్వులేందే నేను బ్రతకలేను. నువ్వు నా జీవితానికి వెలుగువి" అనేవాడు. ఒక్కముష్టి మూడువేలరూపాలకు కక్కుర్తిపడి, ఆ విషయాలన్నీ మరచిపోయి తనని యింట్లోంచి గెంటేసి, తలుపులు శాశ్వతంగా మూసేసేరు.

స్త్రీమీద యీ అత్యాచారం చరిత్ర మొదలైనప్పటినుంచీ జరుగుతోనే ఉంది. త్రాగి మత్తెక్కిన ఒక చాకలివాని విశ్వాస వాదాన్ని నమ్మి రఘురాముడు సీతామహాదేవిని పూర్ణగర్భిణి అనయినా ఆలోచించకుండా కారడవులపాలు జేసేడు. కౌరవసభలో ధర్మరాజు పాంచాలిని ఆభరణమో, వస్తువోలాగ, పణంగాపెట్టి జూదమాడేడు. ఆ సభలోనే ధార్తరాష్ట్రులు ఆమెకు వస్త్రాపహరణం చేస్తున్నప్పుడు సింహబలులైన భర్తలూ, భీష్మాది కురువృద్ధులూ కళ్లప్పగించిచూస్తూ కూర్చుండిపోయారు. ఆనాటినుండి యీనాటివరకూ స్త్రీని ఆత్మగౌరవంగల వ్యక్తిక్రింద సమాజం పరిగణించడంలేదు. స్త్రీ, పురుషుడికి, ధనకనకవస్తువాహనాదులలాంటి ఆస్తివంటిది. చిన్నతనంలో తండ్రిమీద, తర్వాత భర్తమీద, ఆఖరున కొడుకుమీద ఆధారపడాలి స్త్రీ. ఇందులో ఎవరిఆగ్రహానికి గురైనా ఆమెకు అధోగతే. పురుషుడు యీ సృష్టిలో అధికారమూ, ఆనందమూ తాను తీసుకొని, అవమానమూ, అ[illegible]లూ స్త్రీకి ప్రసాదించేడు.

వర్షం ధారాపాతంగా కురుస్తోంది. తుపాను గాలికి చెట్లు పెళ పెళ విరిగి పడుతున్నాయి. రైలు రొప్పుకుంటూ రోజుకుంటూ పరుగెత్తుతోంది. జానకి లేచి కిటికీ గాజుతలుపు సరిగా వేసి మళ్లీ కూర్చుంది.

ఇప్పుడు తాను తిరిగి బెజవాడ వెడుతోంది. ఇక బ్రతికిఉండగా నీ గుమ్మంలో కాలు పెట్టననీ, నీ యింట్లో పచ్చి మంచినీళ్లు త్రాగనని ప్రతిజ్ఞ పట్టి, తన కాళ్ళు తానే తెగనరుకుకొని, అన్నగారింటినుంచి వచ్చేసింది. మళ్ళీ యిప్పుడు ఏ ముఖం పెట్టుకొని అక్కడకు వెళ్లడం? అన్నగారు సహించినా, వదినగారు దెప్పకుండా ఉంటుందా? ఆ యింట్లో తనకి చిన్ననాటి మర్యాద జరుగుతుందా? తనతో రక్తం పంచుకొని పుట్టిన అన్నగారు, చెల్లెలి దీనావస్థను గుర్తించకుండా, స్వార్థంయొక్క అవధుల్ని దాటిపోలేక, తండ్రి యిచ్చిన మాట తప్పిపోయాడు. ఉదరపోషణ నిమిత్తం ఆ యింట్లో ఉండి జీవితంయీడ్చే కంటె ఉరిపోసుకొని చావడం మెరుగు.

పోనీ, అన్నగారింటికి వెళ్లక ఏ ఉద్యోగమైనా చూసుకొని స్వతంత్రంగా బ్రతికితే? తన నెర్రి గాని మగవాళ్లకే ఉద్యోగాలు దొరకని యీ రోజుల్లో స్త్రీకి; అందులోనూ స్కూలుఫైనలేనా ప్యాసు కాని దానికి - ఉద్యోగం ఎలా దొరుకుతుంది? దొరికినా, యీ పాపిష్ఠి ప్రపంచంలో తానొక్కతె ఎలా నిగ్రహించుకు రాగలదు? రోడ్డుమీద ఒంటరిగా ఆడది వెడుతూంటే, ఆకలిగొన్న మృగాల్లా చూస్తారు పురుషులు, యీ యిరవయ్యవ శతాబ్దంలో కూడా. ఒక స్త్రీ, స్వతంత్రంగా, ఆత్మగౌరవంతో జీవిస్తోంటే, చూచి ఓర్వలేక కళ్లలో నిప్పులు పోసుకుంటుంది సమాజం. ఆ స్త్రీని నడిరోడ్డు మీదికీడ్చి అవమానించేవరకూ నిద్రపోదు. పోనీ సేవాసదనంలో చేరితే - వాళ్లు చదువు చెప్తారు. ఏదో పని కూడా నేర్పుతారు. మళ్ళీ పెళ్లి కూడా చేసుకోవచ్చును. ఛీ! ఈ పెళ్లి యింత వైభవంగా కడతేరింది! మళ్ళీ పెళ్లి —కన్యలకే వివాహాలు కాని ఈ రోజుల్లో వివాహిత, గర్భిణి అయిన తను మళ్లీ పెళ్లి చేసుకోలగడం అసంభవం.

ఇలా జీవించాలని కోరుకోవడంలో అర్థం లేదు. దారులన్నీ మూసుకొని పోయాయి. ఆశలన్నీ అడుగంటేయి. ఈ సమాజంలో ఆడదై పుట్టేకంటె అడవిలో మ్రానై పుట్టడం మంచిది.

'ఇప్పుడేం చెయ్యాలి?' అన్న ప్రశ్న ఆమె హృదయంలో పుట్టి శరీరంలో నరనరాలకూ వ్యాపించింది. రైలు బెజవాడ వైపు శరవేగంతో పోతోందని తోచగానే ఆమె నుండే 'జల్లు' మంది. లేచి రెండడుగులు నడిచి మళ్లీ వెనక్కివచ్చి తన స్థానంలో కూర్చుంది. హఠాత్తుగా తండ్రి జ్ఞాపకం వచ్చేడు. "నాన్నా" అని ఆమె హృదయం ఆక్రోశించింది. ఇంతలో, కళ్ళు మిరుమిట్లు గొల్పేటట్లు ఆకాశాన్ని చీల్చుకొని, ఒక మెరుపు మెరిసింది. వెంటనే బ్రహ్మాండం బ్రద్దలయ్యే శబ్దంలో పిడుగు పడింది. చూస్తూండగానే, వర్షంలో తడిసిన తాటిచెట్టు పచ్చని ఆకులు 'భగ్గు' మని మండి, అగ్నిజ్వాలలు ఆకాశానికి ప్రాకేయి. "ఈ వరసచూస్తే, రైలు బెజవాడ చేరేటట్లు లేదు" అన్నాడు, జానక్కి ఎదురుగుండా బల్లమీద కూర్చున్న వృద్ధుడు ఆలోచనగా.

జానకి మెదడులో మెరుపు మెరిసింది. "ఈ వరసచూస్తే, రైలు బెజవాడ చేరేటట్లు లేదు" - ఈ రైలు బెజవాడ చేరకపోతే? - ఈ రాత్రి, ఎప్పటికీ తెల్లవారకపోతే? - ఈ ప్రయాణం అనంతమైతే? - అదొక్కటే తాను ప్రస్తుతం ఉన్న విషమస్థితికి పరిష్కారమార్గం.

ఇంతలో గుభేలుమని ధన్వి - వంతెన విరిగిపడింది. కన్నుమూసి తెరిచేలోగా రైలుపెట్టెలన్నీ, ఒకదానివెనుక ఒకటి, గట్లు తెగగొట్టి మహోధృతంగా పారుతున్న వాసంతీనదీ ప్రవాహంలో పడి కొట్టుకొని పోయాయి.

ఒక గంటక్రిందట, గుప్పుబండి, - ఆ వంతెనమీదనుంచి సురక్షితంగా వెళ్లింది. అప్పుడు నదిలో మోకాలిలోతు నీళ్లుకూడా లేవు

★

★ బారిష్టరుగారి బాతాఖాని ★

(5వ పేజీ తరువాయి)

అని ఇతని రెండుచేతులూ, కాళ్లు అనే భావంతో పట్టుకున్నాడట. మనవాడొక్క మందహాసంచేసి 'ఓయి వెర్రివాడా ఇదంతా నాకెందుకునాయనా. నా శరీరాన్ని నా సేవని ఎప్పుడూ డబ్బుకోసం అమ్ముకోలేదు బాబూ. నాకెందు కిదంతా. ఏంచేసుకోను నేను. పైగా విదేశీవస్తువులను బహిష్కరించమని ఒకపక్కన నేను ఉద్యమం సాగిస్తూ, నేనే మరోపక్కని నీదగ్గర విదేశీ వస్తువులు తీసుకుని వ్యాపారం సాగించడం భావ్యమా బాబూ! కాస్త ఆలోచించు. నువ్వేమీ అనుకోకు. నీవూ నీవాళ్ళూ సుఖంగా పదికాలాలపాటు ఉండడమే నే కోరుకునేది. *Good Bye* అన్నాడట. వాడు మారుమాటాడలేక ఖిన్నుడై, చిన్నపుచ్చుకుని తలవంచుకునిపోతుంటే ఇతను జాలిపడి మళ్లీ వెనక్కిపిలిచి 'అయితే నీకంత కుతూహలంగాఉంటే నాకొక్క చిన్నకోరిక ఉంది. అది చెల్లించాలి అన్నాడట. దానితో అతను ఉక్కిరిబిక్కిరిఅయి, శ్రీ మహావిష్ణువు ప్రత్యక్షమై, అక్కడెక్కడికోవెళ్లి, శైవమతాన్ని ఖండించి రమ్మని కోరినప్పుడు విష్ణుచిత్తుడు పడ్డంత ఖంగారూపడి, 'మహాప్రసాదం. ఆజ్ఞాపించండి. నిప్పుల్లో దూకమంటే దూకుతానన్నాడట'. అలాటి అఘాయిత్యాలేమీ వద్దు కాని, విను. మా జమీందారుగారిని ఎరుగుదువు కాదూ. ఆయన మనకు విరోధివర్గంలో వారైనా బహు యోగ్యుడు. అనేకమందికి అనేక ఉపకారాలు చేశాడు. అనేకమంది ఆయనవల్ల బ్రతుకుతున్నారు. ఆయనిప్పుడు చిక్కుల్లో పడ్డాడు. ఆయన దాయాదులు ఆయనమీద వేసిన దావా లండనులో ప్రీవీ కౌన్సిలులో విచారణ అవుతోంది. ఇందులో గనుక ఆయన నెగ్గకపోతే ఆయన సర్వస్వం పోతుంది. ఆయన ఓడిపోవడమంటే కొన్ని వేలమంది నోటమట్టి అన్నమాట. అందుకని నీ సర్వశక్తులూ వినియోగించి, అక్కడ అవసరమైన వాళ్లకు వర్తమానం చేసి మా జమీందారును గెలిపించాలి. ఇది దైవకార్యమనుకో; అనేసరికి అంతకంటేనా అని ఒక్క ఉదాంలో అవతలికి దాటాడట.

ఆ జమీందారుగారు వ్యాజ్యం గెలిచారని తెలిసిన నెల రోజులకు అతను చెప్పిన వృత్తాంతం ఇది. దానిమీద నవక తవక వ్యాఖ్యానాలేమీ చెయ్యకండి.

'అయితే మహానుభావా - బారిష్టరుజీ. మీ వూళ్లో అందరూ అలాటి ఆసామీలేనా ఏమిటి' అన్నాడు శాస్త్రి.

మా వూరే అన్న మాటేమిటి. అన్ని వూళ్లల్లోనూ ఉంటారు. మీ వూళ్లో మట్టుకు లేరూ. మీ వూరివాడి సంగతి చెపుతాను విను, నీకు తెలియకపోతేను. ఆ రమణారావును ఎరుగుదువా - అతనోయి - ఏదో కంపెనీకి ఏజంటు. అస్తమానం తిరుగుతూ ఉంటాడు. అతనోసారి బ్రహ్మాండమైన కోత కోశాడు. దేవుని ఎదుట ప్రమాణం చేసి జీవితంలో ఎన్నడూ కోత తప్ప నిజము చెప్పను అని ఏదో పెద్ద ఒట్టు పెట్టుకుని ఉంటాడు. అతని నోట మామూలు మాటెప్పుడూ వినలేదు నేను. పాముల నరసయ్యకు పాముమంత్రం నేర్పింది తనేనని అనేకసార్లు అతను అనడం విన్నాను. దానికేమి ఎవడన్నా అనొచ్చు ఆమాత్రం. అసలు సంగతి విను. కొంతకాలం చిన్నతనంలో హిమవత్పర్వతాగ్రములమీద ఇతను తపస్సు చేశాడట...దిగంబరిగా.

'మరి ఇతను అక్కడ అయిస్ అయిపో లేదా' అన్నాడు టప్పయ్య. అదేనోయి తమాషా. అల్లసాని పెద్దన్న, పాపం, ప్రవరుడికి పాదలేపనం రాస్తే మీ కందరకూ నవ్వువచ్చింది. ఇతని గురువు ఇతనికి సర్వాంగలేపనం ఒకటి రాశాడట. దానితో ఇతనికి శీతోష్ణబాధ కాని ఆకలి దప్పికల బాధ కాని ఉండేదికాదట. తలచుకోడం తడవుగా, అరేబియన్ నైట్సు కథలో అదేదో తివాసీ మీద కూచుంటే ఎగిరిపోయినట్టు, ఎక్కడికి కావలిస్తే అక్కడికి ఇట్టే పక్షిలా వాలేవాడట. ఆ తపస్సువల్ల ఎన్నో శక్తులితనికి వచ్చాయట. అందులో స్వర్ణయోగం ఒకటి సిద్ధించిందట. ఏరాగో పుటంపెట్టి దానిమీద రెండు చుక్కలు పసరు ఒకటి పిడుస్తే, అది ధగధగ మెరిసిపోతూ బంగారమై ఊరుకునేదిట.

మరైతే ఇతనెప్పుడూ దరిద్రుడులా అలా ఉంటాడేం మేష్టారూ అన్నాడు మళ్ళీ టప్పయ్య.

ఇలాటి వెధవ ప్రశ్నలు వెయ్యవద్దని లక్షసార్లు చెప్పాను. గురువుగారు చెప్పేది సాంతం విను. తరువాత నడుగు నీకు సందేహాలేమైనా ఉంటే అన్నాడు శర్మ.

బైరాగులనూ యోగులనూ నువ్వు అనేకమందిని చూస్తున్నావా. వాళ్లలో చాలామంది ఈయోగం తెలుసునట. అయితే దాన్ని స్వార్థానికి ఎన్నడూ ఉపయోగించకూడదట. అలా చేసిననాడు వెంటనే వాడి వంశం నిర్మూలమవుతుందని శాపం ఉన్నదట. అలా జరిగినవి అనేకనే దృష్టాంతరాలు అతను చెప్పకొచ్చాడు. ఇతను ఏటేటా రెండు మూడుసార్లు హరిద్వారం వెడతాడట. అక్కడతను మామూలు బైరాగివేషం వేసుకుని, ఓ మణుగో రెండు మణుగులో స్వర్ణం తయారుచేసి, అది రొక్కంగా మార్చి, కొన్ని ఫలహారాలూ, కొన్ని శాలువలూ రగ్గులూ వగైరా కొని అక్కడ, పర్వతాలమీద నుండేవాళ్లకు పంచిపెట్టి చేతులు దులుపుకుని చక్కా వస్తాడట.

అక్కడవాళ్లకీ లేపనాలున్నాయి కదండి. అవి కొన్ని మనకు పారేసినా బాగుండును అన్నాడు మళ్లీ టప్పయ్య.

ఓయి వెర్రివాడా అక్కడందరూ సిద్ధులా మరి. అనేకమంది, యాత్రికులు విద్యార్థులు, ప్రథమ తరగతి సాధకులు ఉంటారుకాదూ మరి. వాళ్లకో సమన్న మాట.

ఇందులో ఒక్కక్షరంకూడా నేను కల్పించిది లేదబ్బాయి. సూతుండు తను ఎక్కడో విన్నది శౌనకాది మహామునులకు శలవిచ్చినట్లు, నేను ఆనోటా ఈనోటా విన్నది యథాతథంగా మీకు మనవిచేసుకున్నాను. నమ్మండి నమ్మకపోండి. మీ ఇష్టం. ఏం శాస్త్రి. మీ వూరువాళ్లే మీ తక్కువవాళ్లు కారని ఒప్పుకుంటావా! ఇంతకన్నా పైకోతకోసేవాళ్లుంటారంటావా!! ★



పక్షిరాజావారి "ఆజాద్"లో మీనాకుమారి.



సారథి చిత్రం "రోజులు మారాయి"లో జానకి, నాగేశ్వరరావు



డైరెక్టరు: బి. ఎన్. రెడ్డి

వాహినీ వారి ఉత్తమ చిత్రం

"బంగారు పాప"

మంచి చిత్రాలు నిర్మించడంలో పేరుపడిన వాహినీ సంస్థ ఈసారి కూడా మరొక ఉత్తమ చిత్రం ఆంధ్రుల కందించింది. సర్వజనాదరణీయమైన కథ, మంచి నిర్మాణకౌశలం, టెక్నికల్ నిర్దుష్టత కలిగి "బంగారు పాప" వాహినీవారి పేరుప్రతిష్ఠలను ఇనుమడింపచేస్తున్నది. బి. ఎన్. రెడ్డిగారి దర్శకత్వం ఈ చిత్రంలో పరాకాష్ఠ అందుకున్నది.

కథ పాలగుమ్మి పద్మరాజుగారు, స్క్రీన్ ప్లే బి. ఎన్. రెడ్డి, పద్మరాజుగార్లు, పాటలు కృష్ణశాస్త్రిగారు వ్రాశారు. చిత్రంలో అడుగడుగునా వీరి పనితనం కనిపిస్తున్నది. ముఖ్యంగా మొదటినుంచి చివరదాకా పరంపరగా వచ్చే సన్నివేశాలన్నీ ప్రతిభావంతంగా సృష్టించబడినవి. వీటికి రూపకల్పన చేయడంలో రెడ్డిగారి భావుకత ప్రేక్షకుల హృదయాలను కలచి కలచి దోచుకున్నది.

'ఆప్తులని నమ్మినవాళ్లు మోసంచేస్తే మనిషికి తాత్కాలికంగా మానవత్వంమీద నమ్మకం పోవచ్చు. కాని చివరకు మానవత్వమే జయిస్తుంది. మనిషి తిరిగి మంచివాడవుతాడు', అనే ఆదర్శభావం "బంగారు పాప"లోని కథకు ప్రాతిపదిక.

కోటయ్య అనే కమ్మరివాడు తను పెళ్లిచేసుకుందామనుకున్న రామి, తన గురువనుకున్న గోపాలస్వామి కలిసి తనకు ద్రోహం చేయగా ప్రతీకారవాంఛతో పాశవికంగా తయారవుతాడు. అటువంటిస్థితిలో అతనికి యాదృచ్ఛికంగా ఒక దిక్కులేనిపాప దొరుకుతుంది. ఆ పాపను అతడు పెంచుతాడు. ఆ పెంచడంలో అతనికి పరివర్తన కలుగుతుంది. ఎప్పటివలె మంచివాడవుతాడు. స్థూలంగా ఇది కథావస్తువు.

కోటయ్యగా ఎస్. వి. రంగారావు నటించాడు. ఈయన ఇదివరలో నటించిన పాత్రలన్నీ ఒక ఎత్తు, ఈ చిత్రంలో పాత్ర ఒక ఎత్తుగా పాత్రీకరణం నడిచింది. మొదట అమాయకుడుగా, తరవాత రౌడీగా, ఆ పిమ్మట పసిపాప నెత్తుకుని తల్లికంటె మిన్నగా ప్రేమతో సాకిన ఉదాత్తమానవుడుగా, చివరలో ఆ పాప సుఖంకోసం తన సర్వాన్నీ త్యాగంచేయడానికి సిద్ధపడిన ఉదారుడుగా రంగారావు అతి క్లిష్టమైన, గంభీరమైన పాత్రను ధరించవలసి వచ్చింది. మొదట పగ తీర్చుకోవడమే అతని జీవిత లక్ష్యం. తరవాత బంగారు పాపయే అతని జీవితానికి ఏకైక కేంద్రం అవుతుంది. మొదటినుంచీ అతడే కథానాయకుడు. ఇంత బాధ్యతనూ రంగారావు ఎక్కడా లోటురానీయకుండా నిర్వర్తించి ప్రశంసాపాత్రుడైనాడు.

బంగారు పాప మనోహర్ అనే ధనవంతునికి, అతడు ప్రేమించి రహస్యంగా పెండ్లాడిన ఒక యువతికీ పుట్టిన పిల్ల. ఆ యువతి భర్తను కలుసుకోడానికి వస్తూ దారిలో గాలివానలో చిక్కుకుని ప్రమాదానికి లోనై చనిపోతుంది. ఆ పిల్లను కోటయ్య పెంచుతాడు. ఆ పిల్ల తన పిల్లయేనని మనోహర్‌కు తప్ప మరెవరికీ తెలియదు. మనోహర్ తిరిగి తన తండ్రి నిశ్చయించిన యువతిని పెళ్లిచేసుకుంటాడు కాని అతనికి మళ్ళీ పిల్లలు కలగరు. అతని దృష్టి అంతా కోటయ్య యింట్లో పెరుగుతున్న తన పాపమీదనే వుంటుంది. వంశమర్యాదలను అతిక్రమించలేక అతడు రహస్యం బయట పెట్టలేకపోతాడు. ఆపిల్ల పెరిగి పెద్దదవుతుంది. మనోహర్ అక్కగారికొడుకైన శేఖర్‌తో ఆపిల్లకు చిన్నప్పటినుంచీ ఉన్న స్నేహం ప్రేమగా మారుతుంది. ఆమె కమ్మరివాడియింట్లో పెరిగిన అనాథబాలిక కనుక వారిప్రేమకు విఘాతం కలుగుతుంది. శేఖర్ తల్లిదండ్రులు, కుటుంబంలోని యితరులూ వారిని విడదీయాలని ప్రయత్నంచేస్తారు. కాని చివరకు మనోహర్ ఆపిల్ల తనకూతురేనని బయటపెట్టి వారిప్రేమను సఫలంచేస్తాడు.

మనోహర్‌గా జగ్గయ్య చాల చక్కగా నటించాడు. శేఖర్‌గా రామశర్మ, బంగారుపాపగా కృష్ణకుమారికూడా బాగా నటించారు. డా॥శివరామకృష్ణయ్య, వంగర, రమణారెడ్డి, జమున, విద్యావతి, కాంచన, హేమలత, మున్నగువారు తదితర నటనటీవర్గంలో ఉన్నారు.

చిత్రంలో సన్నివేశాలభారం తగ్గించడానికి రమణారెడ్డి నటించిన ఒక చిన్న పాత్ర బాగా ఉపయోగపడింది. కిరసనా

యిలు రామదాసు పాత్రకు కథలో ఎంత తక్కువ స్థానమున్నదో పాత్రగా అది అంత బాగున్నది.

అనేక సన్నివేశాల్లో ప్రేక్షకుల హృదయాలు ద్రవిస్తాయి. సంభాషణలు అనవసరం అనిపించేటంత శక్తివంతంగా సన్నివేశాలు రచించబడినవి. సంభాషణల సహాయం లేకుండానే ప్రతి సన్నివేశం హృదయాన్ని చీల్చుకొనిపోయింది. దీనికి బి. ఎస్. రెడ్డిగారినీ, పద్మరాజుగారినీ ముఖ్యంగా అభినందించాలి. కృష్ణశాస్త్రి గారి పాటలు, అద్దేపల్లి రామారావుగారి సంగీతం కర్ణరసాయనంగా వున్నాయి. బి. ఎన్. కొండారెడ్డిగారి ఛాయాగ్రహణం ఉత్తమంగా ఉన్నది.

మొత్తంమీద "బంగారు పాప" వాహినీ చిత్రాలన్నిటికీ తలమానికంగా, కళాఖండం అనదగినదిగా వున్నది. సులభంగా ఇది విజయవంతం కాగలదని ఆశించవచ్చును. ★


బొంబాయి సినిమాలేఖ:

★ షీలా రామాని ★

ఇప్పుడిప్పుడే పైకివస్తున్న తారలలో షీలారామానీ ఒకతె. ఈమె సింధు ప్రాంతానికి చెందిన యువతి. ఈమె వేష భాషలు, అలవాట్లుచూస్తే భారతదేశానికి చెందినట్టు కనిపించవు. సభలకూ, సమావేశాలకూ హాజరైనప్పుడు ఆమె వేషం, మాట్లాడే తీరు, ఆలోచనలు అన్నీ ఏఅమెరికన్ యువతివో అనిపిస్తాయి ఆమె స్నేహితులు కూడా అలాటివారే కావడం ఈ అభిప్రాయాన్ని మరింత బలపరుస్తుంది ఈ కారణంచేతనే ఆమె "టాక్సీడ్రైవర్" చిత్రంలో సిల్వీ వేషం ధరించి అనేకుల అభిమానం చూరగొన్నది. ప్రేక్షకులకు ఆమె వేషం, నటనా బాగానచ్చాయి. ఆపాత్రకు ఆమె సరిపోయింది.

ఆ తరువాత ఆమె చాలా చిత్రాల్లో నటించింది. కళాకార్, మంకూ, నౌక్రీ ఆమె తాజాచిత్రాలు. కాని వీటిల్లో ఆమె ధరించిన పాత్రలకూ సిల్వీ పాత్రకూ చాలా తేడా వున్నది. అందుచేతనే ఆమె బాగా రాణించలేక పోయిందేమో.

1950 వేసంగిలో ఒక సంఘటన జరిగి షీలారామాని చిత్రాల్లోకి అడుగు పెట్టడానికి కారణమైంది ఆమె తల్లిదండ్రులు ప్రతి వేసవికీ ఏదో హిల్ స్టేషన్‌కు వెడుతూ వుంటారు ఆసంవత్సరం వారుసిమ్లా వెళ్లారు. వెళ్లిన కొద్దిరోజులకు ఆనగరంలోని పుర ప్రముఖులు కొందరు కలిసి అందాలపోటీ ఏర్పాటుచేశారు. అదివరకే ఆమె చిత్రవిచిత్రంగా అలంకరించుకొనివిందులకువాటికీ హాజరవుతూ చాలమందిని విస్మితులనుచేసి



"బంగారు పాప"లో విద్యావతి, జగ్గయ్య



"బంగారు పాప"లో రామశర్మ, కృష్ణకుమారి.

★ షీలా రామాని ★

వున్నది. దబ్బపండులాంటిచాయ, భావగర్భితమైన కళ్ళు, చక్కని శరీరసౌష్ఠవం కలిగిన ఆమె పోటీలో తప్పక గెలుస్తుందని అందరూ ఆశించారు. కాని ఆమె తీరా తనపేరు ఇచ్చిన తరవాత, ఫిలింతార మీనా కూడా పోటీ చేస్తోందని తెలుసుకుంది. "మీనా కూడా పోటీలో ఉందని తెలిస్తే నేను పోటీచేసేదాన్నే కాదు" అని ఆమె ఇప్పుడు కూడా అంటూవుంటుంది. "కొందరు స్నేహితులు నన్ను వేధించడానికి అలా చేశారని నాకు తరవాత తెలిసింది. వేదికపైకి మీనావచ్చేసరికి నేను తెలపోయాను కాని అప్పుడు ఉపసంహరించుకుంటే బావుండదు అని ఊరుకున్నాను." అన్నదామె. కాని తీరా ఫలితాలు ప్రకటించేసరికి ఆమె ఆశ్చర్యం వర్ణనాతీతం. "మిస్ సినిమా 1950" బిరుదు షీలా రామానికే లభించింది మీనా రెండో బహుమతి పుచ్చుకున్నది షీలా జీవితంలో అది ఒక ముఖ్య ఘట్టం. ఆసభలో నిర్మాత పి. ఎన్. అరోరా కూడా వున్నాడు. ఆయన వెంటనే షీలాను సమీపించి తన చిత్రంలో బుక్ చేస్తానన్నాడు. కాని ఆమె తండ్రి ఫతేచంద్ కేవల్ రామాని నవ్వేసి అరోరాకు కృతజ్ఞత తెలిపి సెలవు పుచ్చుకున్నాడు వెంటనే ఢిల్లీ విశ్వవిద్యాలయంలో ఎమ్. ఏ. క్లాసులో చేరవలసిందని కూతురును ఆజ్ఞాపించాడు. ఈ ఆజ్ఞను ఉల్లంఘించలేక పోయింది షీలా. ఢిల్లీవచ్చి విశ్వవిద్యాలయంలో చేరింది. కాని చిత్రాల్లో నటించాలనే కోరికమాత్రం అలాగే వుండిపోయింది. హఠాత్తుగా ఒకరోజున చదువు మానేసి తండ్రివద్దకువచ్చి తనకేదైనా ఉద్యోగం ఇమ్మంది. ప్రతిరోజూ తన గదిలో ఒంటరిగావుండి నర్గిస్ లా మాట్లాడడం, నళినీజయవంత్ లాగా మొహం పెట్టడం, మధుబాల వలె నడవడం అభ్యసించేది ఇది చూసి విసుగుపుట్టి ఆమె తండ్రి తన ఆఫీసులోనే తన సెక్రటరీగా ఆమెను నియమించాడు. కాని ఆమె చూపు సినిమాల మీదేవుంది. పనిచేస్తూ చేస్తూ మధ్యలో తన గదిలోకివెళ్ళి ఇన్‌గ్రిడ్ బెర్గ్‌మన్‌నో నర్గిస్‌నో, నళినీజయవంత్‌నో అనుకరిస్తూవుండేది. ఇదిచూసి తండ్రి ఇంకా చిరాకుపడి 'నువ్వు ఏ ఆఫీసులోనూ ఏపనికి పనికిరావు' అన్నాడు. ఆమె తను స్వతంత్రంగా బ్రతకగలనని నిరూపించడానికిగాను ఒక కూల్ డ్రింక్ ఫాక్టరీలో చేరింది. అంతకుముందు ఆమె ఢిల్లీలో బి. ఏ. చదువుకున్న రోజుల్లో రేడియో కార్యక్రమాల్లో పాల్గొనేది. కాలేజీలో కూడా అనేక కార్యక్రమాల్లో పాల్గొనేది కొంతకాలానికి ఆమెకు అమెరికాలో 'వాయిస్ ఆఫ్ అమెరికా' సంస్థలో చేరమని ఆహ్వానం వచ్చింది కూతురును అమెరికాకు పంపించడమా లేక ఈ దేశంలోనే వుండేటుగా సినిమాల్లోచేరనివ్వడమా అని సమస్య ఏర్పడింది తండ్రికి రెండోదే మంచిదనుకున్నాడాయన.

1950 అక్టోబరులో షీలా తనతల్లితో కలిసి బొంబాయివచ్చి సినిమా ప్రయత్నాలు చేసింది రాజ్ కపూర్, పి ఎన్ అరోరా ఆమెకు కెమెరా టెస్టులు జరిపించారు చివరకు ఫిల్మిస్తాన్ నిర్మాత శశిధర్ ముఖర్జీ ఆమెను మూడేళ్ళకు బుక్ చేశారు.



"ట్యాక్సీ"లో షీలా రామాని

1952 లో ఆమె ఫిల్మిస్థాన్ వారి "ఇద్దాం"లో నటించింది. తరవాతవారిదే "ఆనందమఠ్" చిత్రంలో రాజనర్తకిగా నటించింది

ఆమె వయస్సు 24 ఏళ్ళు. 1931 ఏప్రిల్ 2న జన్మించింది మంచి విద్యాభ్యాసం, విజ్ఞానం ఉన్న యువతి. చిన్నప్పుడు కాన్వెంట్ స్కూల్లో చదువుకోవడం చేత యూరపియన్ అలవాటు అలవడ్డాయి అందుచేత తండ్రి లాహోరులోని ఒక హిందూబాలికా పాఠశాలలో ఆమెను చేర్పించాడు. అక్కడ 1945లో మెట్రిక్యులేషన్ ప్యాసయింది. కరాచీలో డి. జె. సింద్ కాలేజీలో చేరింది అక్కడ ఆమె నాటకాల్లోనూ, నృత్యాల్లోనూ పాల్గొనేది.


ఇంటర్మీడియట్ అయినతర్వాత ఢిల్లీకి వారి కుటుంబం మారింది. అక్కడ ఇంద్రప్రస్థకాలేజీలో చేరి 1949 లో బి. ఏ. ప్యాసయింది. ఎమ్. ఏ చదవడానికి ఉపక్రమించింది కాని ఫిలిములపై ఆకర్షణ అడ్డం వచ్చింది.


మామూలుగా ఆమె ఎప్పుడూ మాట్లాడుతూనే వుంటుంది. ఆమెకు తెలియని విషయాలంటూ లేవనిపిస్తుంది. ఆమె చిత్రకారిణి కూడాను. గుర్రపుస్వారీ, ఈత, వడివనడుపడం, స్కేటింగ్ మొదలైన వాటిలో ప్రావీణ్యం ఉన్నది. రోజుకొక విధంగా అలంకరించుకోవడంలో ఆమెకు చాలా శ్రద్ధ.

మొదటి భారతీయ టాకీ చిత్ర నిర్మాత అర్దెశిర్ ఎమ్. ఇరానీ

మొదటి భారతీయ టాకీ చిత్రం తీసిన అర్దెశిర్ ఎమ్. ఇరానీ 76 సం॥ వయోవృద్ధుడైనా ఈనాటికీ ఎంతో ఉత్సాహంగా కనిపిస్తాడు. ప్రతిరోజూ చీకటితోనే లేచి వ్యాయామంచేసి, ప్రాతర్భోజనం ముగించి స్టూడియోకు బయలుదేరుతాడు. ఆయన స్టూడియో పేరు జ్యోతీ స్టూడియో (కెన్నెడీ బ్రిడ్జివద్ద). 1931 మార్చి 14వ తేదీన మొదటి భారతీయ టాకీ చిత్రం "ఆలం ఆరా" విడుదలైంది. ఆ తరువాత ఇరానీ సుమారు 100 టాకీ చిత్రాలు తీశాడు. సులోచన, రోజ్, సబితాదేవి, మాధురీ, సితారా, బిబ్బో, జుబీదా మొదలైన ఆనాటి తారలూ, పృథ్వీరాజ్, ముబారక్, యాకూబ్, డబ్ల్యు. ఎమ్. ఖాన్, నిసార్, మాస్టర్ విఠల్ మొదలైనవారు ఆయన చలవవల్ల పైకి వచ్చినవారే.

చలనచిత్ర గోష్ఠిలో పాల్గొన్న అనిల్ బిశ్వాస్, నర్గీస్, రాజ్‌కపూర్ దిలీప్‌కుమార్, డేవిడ్, కిశోర్ సాహూ, నిరూపరాయ్.





మొట్టమొదటి భారతీయటాకీ చిత్రం నిర్మించిన అర్దేశిర్ ఎమ్. ఇరానీ.

అర్దేశిర్ ఇరానీ

ఆయన జన్మదినం 1886 డిసెంబరు 5. జన్మస్థలం పూనా. మొట్టమొదటి సినిమా థియేటరును ప్రారంభించింది ఆయనే.

1923 లో ఆయన మెజస్టిక్ ఫిలిం కంపెనీ, 1928 లో ఇంపీరియల్ ఫిలిం కంపెనీ ఆయన స్థాపించాడు. మొటమొదటి భారతీయ వర్ణచిత్రం "కిసాన్ కన్య" తీసింది కూడా ఆయనే.

కాని ఇంత ప్రతిభావంతుడైన వ్యక్తి సాధించిన వాటినిగూర్చి సరియైన వివరాలను ఎవరూ సేకరించకపోవడం దురదృష్టం. జ్యోతిస్టూడియో ఆయన కుమారునిచే నిర్వహింప బడుతున్నప్పటికీ ఆయన తీసిన పాతచిత్రాల తాలూకు ఫొటో ఒక్కటైనా అక్కడ దొరకదు. ఇరానీ అభిమానులు కొందరు "ఆలం ఆరా" ను తిరిగి విడుదలచేసి టాకీ రజతోత్సవం జరపాలనుకున్నారు. కాని ఆ చిత్రం కాపీ ఒక్కటైనా లేదు

ఇటీవల నేను ఇరానీని ఆయన స్టూడియోలో కలిసినప్పుడు తన కండలను నొక్కి చూడమని ఆయన బలవంతం చేశాడు. "నేనిక్కడే ఈ స్టూడియోలోనే కుస్తీలు పట్టేవాణ్ణి. కావలిస్తే పృథ్వీరాజ్ ను అడగండి. ఆయనకు నా సత్తా బాగా తెలుసు" అని నవ్వుతూ ఆయన అన్నాడు. ఈ వృద్ధునికే సరికి చూపు సరిగా ఆనకపోవడం ఒకటి మాత్రం బాధిస్తోంది. లేకపోతే ఈ వయస్సులో కూడా ఆయన చిత్రాలు తీయకుండా ఊరుకునేవాడు కాదు. ★

సినిమా వార్తలు

ప్రతిభావారి "రేచుక్క" చిత్రం ఈ నెల 25 వ తేదీన ఉగాది కానుకగా విడుదల కానున్నది. ఎన్. టి. రామారావు, అంజలీదేవి మున్నగు ప్రసిద్ధ తారాగణం, మల్లాది రామకృష్ణశాస్త్రిగారి రచనము, పి. పుల్లయ్యగారి దర్శకత్వము ఈ చిత్రంలోని విశేషాలు.

* * *

సారథీవారి చిత్రం "రోజులు మారాయి" షూటింగ్ పూర్తయిందని, ఎడిటింగ్, రీరికార్డింగ్ వగైరా పనులు జరుగుతున్నాయని తెలుస్తున్నది. ఎ. నాగేశ్వరరావు, జానకి మున్నగువారు నటిస్తున్న ఈ చిత్రం దర్శకుడు చాణక్య.

* * *

గోకుల్ పిక్చర్స్ వారి చిత్రం "వదినెగారి గాజులు" చాలవరకు అయిపోవచ్చింది. మరొక పదిపదిహేనురోజుల షూటింగ్ తో పూర్తవుతుందని తెలుస్తోంది. దీని నిర్మాత దోనేపూడి కృష్ణమూర్తిగారు. దర్శకుడు రజనీకాంత్. అంజలీదేవి, అమర్ నాథ్, జమున మున్నగువారు నటిస్తున్నారు.

* * *

ముడి ఫిలిం ఉత్పత్తి

భారతదేశంలో తెలుపు నలుపు ముడి ఫిలిం తయారుచేసే అవకాశాలు తక్కువ అనీ, ముడి ఫిలిం ఫ్యాక్టరీని స్థాపించడానికి ముందు బోలెడంత పరిశోధన జరగాలనీ, దీనికి కనీసం రెండేళ్లయినా పట్టవచ్చుననీ లండన్, కొడక్ లిమిటెడ్ అధ్యక్షుడు, మేనేజింగ్ డైరెక్టరు అయిన హెచ్. ఎస్. కార్పెంటర్ ఈ నెల 15 వ తేదీన ప్రకటించారు. ఆయనా, కొడక్ జనరల్ సేల్స్ మేనేజరు డా॥ ఎ. బార్లే మద్రాసు వచ్చిన సందర్భంలో ద. భా. ఫిలిం వాణిజ్య మండలి, ద. భా. చలనచిత్ర స్టూడియో సంఘంవారలు కలిసి స్వాగత సభ, విందు ఏర్పాటు చేశారు. సభ మైలాపూర్ వుడ్ లాండ్స్ లో జరిగింది. ప్రముఖ నిర్మాతలు పలువురు హాజరయ్యారు.

ఎస్. ఎస్. వాసన్ గారు అతిథులను ఆహ్వానిస్తూ ఇలాఅన్నారు: "భారతదేశంలో చలనచిత్ర పరిశ్రమ పెద్ద పరిశ్రమల్లో ఒకటిగా ఉన్నది. ఈ పరిశ్రమకు అవసరమైన ముడిఫిలిం వగైరా సాధనసామగ్రిని విదేశాల నుంచి దిగుమతి చేసుకోవలసివస్తున్నది. దిగుమతి అవసరం లేకుండా దేశంలోనే ఉత్పత్తి చెయ్యాలని కొంతకాలంగా పరిశ్రమలోనివారూ, ప్రభుత్వమువారూకూడా ఆలోచిస్తున్నారు. అయితే దీనికి కావలసిన టెక్నికల్ నిపుణులు కొరత కావడం మొదలైన యిబ్బందులు కొన్ని వున్నాయి. అదిగాక తెలుపు నలుపు చిత్రానికి కావలసిన ముడి ఫిలిం ఉత్పత్తి చేసే ఫ్యాక్టరీని ఎంతో పరిశోధనచేసి, డబ్బు వెచ్చించి, శ్రమపడి స్థాపించేసరికి రెండేళ్లయినా పడుతుంది. ఈ రెండేళ్లలో పరిస్థితులు మారిపోవచ్చు. రంగుల ఫిలిమ్ కే గిరాకీ ఎక్కువ కావచ్చు. ప్రతివారూ రంగుల ఫిలిమ్ తీయడానికే తహతహలాడవచ్చు. అప్పుడు ఈ తెలుపు నలుపు ఫిలిం ఫ్యాక్టరీ దండగ అవుతుంది. అందుచేత ఈ విషయంలో సలహా యివ్వవలసిందిగాఅతిథులనుకోరుతున్నాను.

మిస్టర్ కార్పెంటర్ సమాధానమిస్తూ, ముడి ఫిలిం ఫ్యాక్టరీ స్థాపనను చాలా ఇబ్బందులతో కూడినదనీ, ముడి ఫిలిం తయారు చేయడానికి తగిన పరిస్థితులు భారతదేశంలో లేవని తాను అనుకొంటున్నాననీ, అయినా పరిశోధనలు జరిపి ఈ విషయం పరిశీలించడం అవసరమనీ అన్నారు. భారతదేశపు చలన చిత్రాలు, వాటి నిర్మాణం మంచిస్థాయిలో ఉన్నాయని ఆయన ప్రశంసించారు. ప్రజల జీవనప్రమాణాన్ని అభివృద్ధి చేయడంలో భారతదేశం చేస్తున్న అద్భుత కృషి విదేశీయులైన తమవంటివారికి ఆశ్చర్యకరంగా వుందని ఆయన అన్నారు. ★

విజ్ఞానవీధులు

"డాక్టర్"

202 హిందూమత స్థాపకు లెవరు?

అని తాంబరమునుంచి పే. వెంకట సుబ్బయ్యగారు అడుగుతున్నారు. హిందూమత స్థాపకులు ఋషులు. వీరు పెక్కురు. ప్రపంచములో మొట్టమొదటి జిజ్ఞాస మతమునకు సంబంధించిన జిజ్ఞాస. భారతదేశములోకూడా మత జిజ్ఞాసయే మొదటిది. ఉపనిషత్తులూ, దర్శనములూ పరతత్వమును గురించిన జిజ్ఞాసలే. ఇవన్నీ వేర్వేరు ఋషులు నిర్మించినవి కనుక వీటిలోని వస్తువూ ప్రశ్నావళీ వేర్వేరుగా వుంటుంది.

మన మతమునకు జీవము పరమేశ్వరుడున్నాడను నమ్మిక. జీవితాదర్శము పరమేశ్వరుని తత్వమును తెలుసుకొనుట, కేవలము మాటలలో వర్ణించుట తెలుసుకొనుట కాదు. మనోవాక్కాయ కర్మలలో పరమేశ్వరుని సత్తను గురించిన గుణములు కనబడు టే జీవితపరమావధి. దీనినే మోక్షమనుట గూడ కలదు.

పరమేశ్వరుని గురించి ఋషులు తెలుసుకొన్న సంగతులే ఉపనిషత్తులలోనూ, దర్శనములలోనూ ఉంటాయి. వీటిని కంఠతాపట్టిన మాత్రాన పరమేశ్వరుడు తెలియడు. కాశీ వర్ణనలు చదువుట, కాశీకి దారి తెలుసుకొనుట వేరూ కాశీని స్వయముగాచూచి అనుభవించుట వేరూకదా! ఆ రీతిగనే పరమేశ్వరుని స్వయముగా తెలుసుకొనుటయే మోక్షము. మన మతమునకు ఆదర్శము ఈ అన్వేషణ. ఎవరి అన్వేషణ వారిది. ఇదివరకు ఋషులు తాము అన్వేషించిన పద్ధతులూ తెలుసుకొన్న సంగతులూ చెప్పి వుంచారు.

వారి వాక్యములే బ్రహ్మసూత్రములూ, ఉపనిషత్తులూ, భగవద్గీతలూను. ఈ మూడు గ్రంథాలూ మనకు ముఖ్య మత గ్రంథములు. మతసంస్కారము చేయదలచిన ప్రతి ఆచార్యుడూ ఈ "ప్రస్థానత్రయము"నకు వ్యాఖ్యను రచించి వీటిని తన ఉపదేశముల కనుకూలముగా ఉన్నట్లు నిరూపించుకోవలెను. శంకర, రామానుజ, మధ్వ ఆచార్యులు అట్లుచేసినారు.

ఉదాహరణమునకు "ఏకమేవ అద్వితీయం బ్రహ్మ"అన్న సూత్రమునకు రెండు విధాల వాఖ్యానాలు చూతాము. "బ్రహ్మపదార్థము ఒక టేను రెండోది లేనిది" అని దీని దండాన్వయము. శంకరులు "ఉన్నది బ్రహ్మపదార్థ మొక్కటే రెండోదిలేదు." అన్నారు. ఆనందతీర్థులు "బ్రహ్మ ఒక్కటే. రెండో బ్రహ్మలేదు. జీవులు మాత్రము పెక్కురు" అన్నారు.

ఈ వాఖ్యానము భాషను మడతపెట్టుట పై ఆధారపడినట్టుంటుందనుకోవడము సరి కాదు. పై ఆచార్యుల అనుభవమే వారిని నడిపి వారిచే వ్యాఖ్యానము చేయించినది కాని వారి వాదశక్తీ, వ్యాకరణ జ్ఞానమూ కాదు. వారు అనుభవించినదే సత్యముగ భావించి, ప్రస్థానత్రయమును ఆ అనుభవమునకు అనుకూలముగ వ్యాఖ్యానించినారు.

గౌతమబుద్ధుడూ, మహావీరుడూ, గురునానకూ, ప్రస్థానత్రయమును ప్రమాణములుగా స్వీకరించలేదు. బౌద్ధులు మూడు వేదములను చదివినారుగాని "వాటిని మించిన మతమును బోధించుచున్నాము" అన్నారు. పై ముగ్వురు నిర్మించినవీ వైదికమతములు కావు. ఆ రీతిగనే బసవేశ్వరుని వీరశైవమూ వేదసమ్మతము కాదు. పండితారాధ్యుల వీరశైవము వేదసమ్మతమే.

రామకృష్ణ పరమహంస ప్రస్థానత్రయమునకు వ్యాఖ్యరచించినవారు కాదు. అయితే వారి జీవితమూ, ఉపదేశములూ ప్రస్థానత్రయానికి పెద్దవ్యాఖ్య. కాళీమాతను ప్రత్యక్షము చేసుకునేవరకూ ఆయన ద్వైతి. తోతాపురి శిక్షణపొందిన కొంతకాలము వరకూ విశిష్టాద్వైతి. చివరకాలములో "ఇన్ని నోళ్లద్వారానూ భుజిస్తున్నా" ననుకున్నప్పుడు అద్వైతి, కనుక ముగ్గురు ఆచార్యుల వ్యాఖ్యలూ ఆయన నిజముచేసినారు.

అయితే మతసాధనకంటె మనవారిలో మతవివాదము ఎక్కువైంది. మనస్సు ఎన్ని మడతలు తిప్పినా అనుభవము లేకపోతే ఆ జిజ్ఞాసలన్నీ దండుగ. పురందరదాసు కీర్తనల సంపుటమును ఉపనిషత్తులకు పైనపెట్టిన వ్యాసరాజస్వామీ, తనకు నష్టమువచ్చినా పెక్కురు తరింతురని గోపుర శిఖరమునుండి తిరుమంత్రమును గట్టిగాబోధించిన రామానుజులూ, "నేను అన్న భావాన్ని పూర్తిగా నశింపైనా చెయ్యి, లేదా జగత్తంతటికీ వ్యాపింపజెయ్యి" అని బోధించిన శంకరులూ, అందరూ మహానుభావులే. ఇలాటి వారే మన మతస్థాపకులు. ★

గ్రంథసమీక్ష

కథావాహిని 4:

బొమ్మిరెడ్డిపల్లి సూర్యారావుగారికథలు; వెల 1-0-0; పేజీలు 104; ఆదర్శ ప్రచురణ. ఇందులో సూర్యారావుగారు రచించిన నాగరికులు, విశ్వకర్మ, ప్రయోజకత్వం, కరువుకాలం, బియ్యపుగింజలు, పాగచూరినగోడలు, చీకటిదేశం, ప్రభువెక్కిన పల్లకీ అనే 8 కథలున్నాయి. ఈ కథలన్నిటిలోనూ తెలుగుదేశపు వాతావరణం బాగా కనిపిస్తుంది. కొన్నికొన్ని విలువలను విమర్శించడం, ప్రతిఘటించడం ఈకథల్లో కనిపిస్తుంది. అన్నీ ఒకశైస్థాయిలో లేవు. నాగరికులు, విశ్వకర్మ, ప్రయోజకత్వం అనేకథలు బాగా వున్నాయి.

పెళ్లికి వాగ్దానం:

నవల; రచయిత: శ్రీ ఆరవల్లి శోభనాద్రి నరసింహాచార్యులు; వెల 0-8-0; పేజీలు 62; ప్రతులకు: శ్రీ ఆరవల్లి, బోళ్లవారి వీథి, పాలకొల్లు, ప. గో. జిల్లా.

మీ అదృష్టం:

1955 లో గోచార, లగ్న ఫలితాలను తెలిపే జ్యోతిష పుస్తకం; రచన శ్రీ సత్య ప్రకాష్‌జోషీ; వెల 0-8 0; ప్రతులకు: కిషోర్ పబ్లికేషన్స్, 29. గంగాయమ్మన్ కోయిల్ స్ట్రీట్, రాయపేట, మద్రాసు - 14

దేశదేశాల కథలు:—మొదటి భాగం;

అనువాదకుడు: గద్దెలింగయ్య; ప్రచురణ: ఆదర్శ గ్రంథమండలి, విజయవాడ; వెల 1-0-0. ఈ పుస్తకంలో అమెరికా, చైనా, ఇటలీ, హంగరీ, ఇంగ్లండు, జర్మనీ, రష్యా, స్వీడన్ దేశాల రచయితలు వ్రాసిన కథలు దేశానికొకటి చొప్పున ప్రకటింపబడినవి. కథలన్నీ చాలా బాగున్నాయి. అనువాదంలో మరికొంత శ్రద్ధతీసుకుని రచిస్తే ఈ గ్రంథం ఇంకా బాగుండేది.

ముద్దుబిడ్డలు:—పిల్లల కథలు;

రచన: మద్దులూరి రామకృష్ణ; ప్రచురణ: ఆదర్శ గ్రంథమండలి; వెల 0-8-0. బాలసాహిత్యంలో మంచి కృషి చేస్తున్న రామకృష్ణగారు రచించిన పది కథలు ఈ సంపుటిలో వున్నాయి. ఇవన్నీ పిల్లలకోసం వ్రాయబడిన చిన్న చిన్న కథలు. గారడీ అబ్బాయి, ఏటావచ్చే గోరువంక అనే కథలు చక్కగా వున్నాయి.



"కళాకార్"లో షీలా రమాని

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St, Madras




ఉగాది
విడుదల!
ప్రతిభా వారి
రేచుక్క
అంజలీదేవి...యన్.టి. రామారావు...ప్రమీల...సదాశివరావు...ముక్కామల
జోగారావు...పేకేటి...గాడేపల్లి
దర్శకుడు
పి.పుల్లయ్య
నిర్మాత
జి. కృష్ణమూర్తి